
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 153
మంగళవారం 23-8-2022


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'


కార్ల్‌సన్‌కు 'చెక్'
క్రిప్టో కప్ చెస్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద గెలుపు - 12లో



4జీ చార్జీలకే 5జీ సేవలు!
ప్రయోగాత్మకంగా కొనసాగింపు దశలవారీగా చార్జీలకు రెక్కలు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


కేసులు ఎత్తేస్తామన్నారు
బీజేపీలో చేరితే తనపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయడంతో పాటు సీఎంను చేస్తామన్నారని ఆప్ నేత మనీశ్ సిసోడియా చెప్పారు.
వివరాలు 6లో


భారత నేత హత్యకు ఐసిస్ కుట్ర
భారత పాలక వర్గానికి చెందిన ఓ కీలక నేత హత్యకు కుట్ర పన్నిన ఐసిస్ ఆత్మాహుతి దళ సభ్యుడు రష్యాలో పట్టుబడ్డాడు.
వివరాలు 6లో


రైతుల 'మహా పంచాయత్'
కనీస మద్దతు ధరకు చట్టబద్ధత తదితర డిమాండ్లతో ఢిల్లీలో నిర్వహించిన మహా పంచాయత్‌లో వేలాది రైతులు పాల్గొన్నారు.
వివరాలు 6లో



ఇమ్రాన్‌కు ముందస్తు బెయిల్
టెర్రరిజం కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు మూడు రోజులపాటు ముందస్తు బెయిల్ మంజూరైంది.
వివరాలు 6లో

రూ.10,000 కోట్లతో పోలవరం పరుగులు

అడహక్‌గా నిధులివ్వాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వినతి

రాష్ట్రం ఇప్పటిదాకా సొంతంగా ఖర్చు చేసిన రూ.2,900 కోట్లను త్వరగా రీయింబర్స్ చేయాలి

- ప్రాజెక్టు సవరించిన అంచనాలను సత్వరమే ఆమోదించండి
- కాంపోనెంట్ వారీ రీయింబర్స్ విధానంతో పనుల్లో తీవ్ర జాప్యం
- మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని నిధులివ్వాలి
- డీబీటీ పద్ధతిలో నిర్వాసితులకు పరిహారాన్ని అందించాలి
- రాష్ట్రానికి రావాల్సిన రిసోర్స్ గ్యాప్ నిధులను మంజూరు చేయండి
- గత సర్కారు తప్పిదాలకు ఇప్పుడు రుణ పరిమితిలో కోతలు సరికాదు
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సహా ఇతర విభజన హామీలను నెరవేర్చండి



సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ • రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం తగిన సహాయ సహకారాలను అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. పనుల్లో మరింత వేగం పెంచేందుకు వీలుగా అడహక్‌గా రూ.10 వేల కోట్లు ఇవ్వాలని విన్నవించారు. కాంపోనెంట్ వారీగా రీయింబర్స్ విధానంతో నిర్మాణ పనుల్లో విపరీతమైన జాప్యం జరుగుతున్న దృష్ట్యా దీనికి స్వస్తి చెప్పాలని కోరారు. అన్ని జాతీయ ప్రాజెక్టుల్లో వ్యవహరించిన మాదిరిగానే మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు చేస్తున్న పనులకు వెంటనే రీయింబర్స్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన సమస్యలు, పెండింగ్ అంశాలను విన్నవించేందుకు ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో ప్రధానంగా పోలవరం, రిసోర్స్ గ్యాప్ నిధులు, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధత, విభజన హామీల అమలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తదితర అంశాలపై ప్రధానితో చర్చించి వినతిపత్రం అందజేశారు.

రూ.55,548.87 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించండి

పోలవరం పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా సొంతంగా రూ.2,900 కోట్లు ఖర్చు చేసిందని, ఈ మొత్తాన్ని వెంటనే రీయింబర్స్ చేయాలని సీఎం జగన్ కోరారు. సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) నిర్ధారించిన మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. చేసిన పనులకు 15 రోజుల్లోగా

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రపతి ముర్ముతో సీఎం భేటీ

- రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు
- విద్యుత్ రంగ సమస్యలపై కేంద్ర మంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి జగన్ చర్చ
- తెలంగాణ చెల్లించాల్సిన కరెంట్ బకాయిల అంశాన్ని పరిష్కరిస్తామన్న కేంద్ర మంత్రి

విద్యుత్ రంగ సమస్యలను సీఎం జగన్ ప్రస్తావించారు. తెలంగాణ నుంచి రావాల్సిన రూ.ఆరు వేల కోట్లకుపైగా బకాయిలపై చర్చించాం. ప్రస్తుతం ఈ అంశం సొలిసిటర్ జనరల్ వద్ద ఉంది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం.
- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్

వివరాలు 2లో ▸

న్యూస్‌రీల్

గిరిజనులకు విలువిద్యలో శిక్షణ


గిరిజనుల పిల్లల్ని ఆర్చర్లుగా తీర్చిదిద్దుతామని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆదివాసీ ప్రాంతంలో ఆర్చరీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వీటికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా చెప్పారు.
వివరాలు 3లో ▸

మహిళల్ని కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం


కాకినాడ జిల్లా ఉప్పాడలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే తొలి 'చేయూత మహిళా మార్టు'ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సోమవారం ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'చేయూత మహిళా మార్టు'లకు శ్రీకారం చుట్టిందన్నారు.
వివరాలు 5లో ▸

వివాహానికి వెళ్తొస్తూ మృత్యు ఒడికి


ఏలూరు జిల్లా వల్లూరు–అర్ధవరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి పంట కాల్వలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు.
వివరాలు 3లో ▸

29న కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయ మొదటి బ్లాక్‌లోని కేబినెట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి తీసుకెళ్లాల్సిన అంశాల ప్రతిపాదనలను 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా సాధారణ పరిపాలన(కేబినెట్ విభాగం) శాఖకు పంపించాల్సిందిగా అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ సోమవారం ఆదేశాలిచ్చారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఆరు పేపర్లే

- విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి తగ్గించిన ప్రభుత్వం
- 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్‌లు పెడుతున్నందున పబ్లిక్ పరీక్షల పేపర్ల కుదింపు
- గతంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 11 పేపర్ల విధానం
- ఇక నుంచి లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్‌ల్లో సింగిల్ పేపర్లే
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022–23 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జీవో 136ను విడుదల చేశారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పాఠశాల విద్యలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. సీబీఎస్‌ఈ టెన్త్‌లో ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలు ఆరు పేపర్లలో మాత్రమే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలనూ అదే రీతిలో ఆరు పేపర్లలోనే నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని ప్రకారం ఇకపై టెన్త్ పరీక్షల్లో ఫిజికల్ సైన్స్ (పీఎస్), బయోలాజికల్ సైన్స్ (ఎన్ఎస్) సబ్జెక్టులు కలిపి ఒక్క పేపర్‌గానే ఉంటాయి. అదేవిధంగా లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా ఒక్కో పేపర్ మాత్రమే ఉంటుంది.

11 పేపర్ల నుంచి ఆరుకు తగ్గింపు..

టెన్త్ పబ్లిక్ పరీక్షలు తొలుత 11 పేపర్లతో ప్రారంభమై ఇప్పుడు ఆరుకు తగ్గాయి. గతంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానం అమల్లో లేనప్పుడు 11 పేపర్లలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరిగేవి. ఆ పరీక్షలకు ముందు

మిగతా 3వ పేజీలో ▶

28న జేఈఈ అడ్వాన్స్‌డ్

- న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు మినహా అన్నిటికీ నెగిటివ్ మార్కులు
- స్వల్ప మార్పులు మినహా పాత విధానంలోనే పరీక్ష
- నేటి నుంచి అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్
- 11న తుది కీతోపాటు ఫలితాలు
- 12 నుంచి జోసా కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు, తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ – 2022 పరీక్షను ఈ నెల 28న నిర్వహించనున్నారు. ఐఐటీ బాంబే ఈ పరీక్షను నిర్వహించనుంది. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్ష అడ్మిట్ కార్డులను మంగళవారం నుంచి విద్యార్థులు

మిగతా 3వ పేజీలో ▶

పండ్లు, కూరగాయల నష్టాలకు ఇక చెక్


- ఉద్యాన పంటలు సాగయ్యే ప్రతి నాలుగు ఆర్బీకేలకు ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం
- కోల్డ్ స్టోరేజ్‌లు కూడా..
- మొత్తం 945 కేంద్రాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- ఇప్పటికే 32 కేంద్రాల నిర్మాణం పూర్తి.. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడి


కృష్ణా జిల్లా కొత్తూరు తాడేపల్లిలోని ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రంలో కూరగాయలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి


సాక్షి, అమరావతి: రైతులు తాము పండించిన పండ్లు, కూరగాయలకు కోత అనంతరం నష్టాలను తగ్గించాలనే ఉద్దేశంతో ఆర్బీకేల పరిధిలో ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఉద్యాన పంటలు పండించే ప్రాంతాల్లో ప్రతి నాలుగు ఆర్బీకేలకు ఒక ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం, కోల్డ్ స్టోరేజీని నిర్మిస్తామని చెప్పారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో నిర్మించిన ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం, రైతు శిక్షణ కేంద్రాన్ని సోమవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. 75 శాతం సబ్సిడీతో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ సంఘం కోసం వీటిని నిర్మించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) పరిధిలో రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మంత్రి కాకాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ ద్వారా నిర్మిస్తున్న ఈ ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఎఫ్‌పీవోలకు 75 శాతం, వ్యక్తిగతంగా నిర్మించుకుంటే రైతులకు 40 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. తాము పండించిన ఉత్పత్తుల నాణ్యతను పెంచుకునేందుకు, మంచి ధరలు పొందడానికి ఇవి దోహదపడతాయని చెప్పారు. వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పండ్లు, కూరగాయల కోతలు, సరైన పద్ధతిలో

మిగతా 2వ పేజీలో ▶

ఇదం జగత్



అక్కడే అని ఏం లేద్సార్!
మనకు ఎక్కడైనా అంతే వస్తాయ్!



సాక్షి, అమరావతి: కోవిడ్ సంక్షోభంలోనూ రాష్ట్ర ఆర్థిక వృద్ధి కొనసాగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలు ఫలితాన్నిచ్చాయి. ఓ పక్క ప్రాధాన్యతా రంగాల కార్యకలాపాలు కొనసాగేలా చేయూతనిస్తూనే, మరో పక్క సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేయడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోకుండా చూశారు. దీంతో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ముగిసిన ఆర్థిక సంవత్సరం (2021–22)లో రాష్ట్ర వృద్ధి రేటు ఎక్కువగా ఉంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ 2021–22లో స్థిర ధరల ప్రకారం 11.43 శాతం వృద్ధి రేటు సాధించినట్లు తెలిపింది. తెలంగాణ, రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకన్నా ఏపీ వృద్ధి రేటు ఎక్కువగా ఉంది. కోవిడ్–19 సంక్షోభం, లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా, దేశంలో 2020–21 సంవత్సరంలో వృద్ధి రేటు తిరోగమనంలో ఉన్న విషయం తెలిసిందే. కోవిడ్ సంక్షోభం నుంచి బయటపడి, గత ఏడాదిలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా 2021–22లో ఏపీ ఏకంగా 11.43 శాతం రెండంకెల వృద్ధి సాధించింది. ఇదే సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం వృద్ధిరేటు కేవలం 8.7 శాతమే. కేంద్రం, మిగతా రాష్ట్రాలకంటే

మిగతా 14వ పేజీలో ▶

కృష్ణా, గోదావరిలో తగ్గిన వరద




- శ్రీశైలంలోకి 1.76 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 95 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలు కడలిలోకి..
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 4.8 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రంలోకి..

14లో

క్లుప్తంగా

నేడు ప్రపంచ బ్యాంక్ బృందం రాక

ఇథియోపియాలో ఏపీ విధానాలు అమలుకు అధ్యయనం



సాక్షి, అమరావతి: ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్రంలో పర్యటించనుంది. తూర్పు ఆఫ్రికా దేశమైన ఇథియోపియాలో ఆర్బీకే తరహాలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వరల్డ్ బ్యాంక్ ఆర్థిక చేయూత అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్యతో పాటు కేంద్ర ప్రభుత్వం, వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల బృందం గత నెలలో ఇథియోపియాలో పర్యటించింది. ఏపీ వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న వినూత్న విధానాలను అధ్యయనం చేసేందుకు వరల్డ్ బ్యాంక్‌లోని అగ్రికల్చర్ అండ్ ఫుడ్ గ్లోబల్ ప్రాక్టీస్ సీనియర్ కన్సల్టెంట్ హిమ్మత్ పటేల్ నేతృత్వంలోని ఈ బృందం ఢిల్లీ నుంచి మంగళవారం ఉదయం 8.45 గంటలకు విజయవాడ చేరుకోనుంది. గన్నవరంలోని ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, ఆర్బీకే చానల్‌ను సందర్శిస్తారు. అక్కడ నుంచి పెనమలూరు మండలం వణుకూరు చేరుకుని ఆర్బీకే కేంద్రాన్ని సందర్శించి రైతులతో భేటీ అవుతారు. అనంతరం ఘంటసాలలోని కేవీకేని సందర్శిస్తారు. అనంతరం విజయవాడ చేరుకుని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో భేటీ అవుతారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలిస్తారు.

పలమనేరు పీఎస్‌లో మూడు షిఫ్టుల విధులు

- ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితం
- తొలిసారి పలమనేరు సబ్ డివిజన్‌లో అమలు చేస్తున్న సీఐ


సీఐ చంద్రశేఖర్

పలమనేరు(చిత్తూరు): పోలీసులకు డ్యూటీ వేళల్లో కొంచెం వెసులుబాటు కల్పించేందుకు పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ కాస్త నూతనంగా ఆలోచించారు. మూడు షిఫ్టులుగా చేస్తే వారి విధి నిర్వహణ సులభతరమవుతుందని భావించారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ విధానాన్ని పలమనేరు సబ్ డివిజన్‌లో మొట్టమొదటి సారి పోలీస్‌స్టేషన్‌లోని మొత్తం సిబ్బందిని మూడు భాగాలుగా విభజించారు. షిఫ్టులో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల చొప్పున నియమించారు. మొదటి షిఫ్టు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా, రెండో షిఫ్టు ఒంటి గంట నుంచి రాత్రి 8 దాకా.. ఆపై 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 వరకు చివరి షిఫ్టు ఉంటుంది. ఈ విధానం గత నాలుగు రోజులుగా అమలవుతోంది. ఫలితంగా సిబ్బందికి ఒకటిన్నర రోజు విశ్రాంతి లభిస్తోంది. ఇదే విధానాన్ని గతంలో కర్నూలు జిల్లా నంద్యాల టౌన్ స్టేషన్‌లోనూ అమలు చేసి మంచి ఫలితాలు సాధించినట్టు సీఐ చెప్పారు.

'మార్గదర్శి' కేసులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు

- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణ 19కి వాయిదా
- వాయిదా వద్దన్న రామోజీరావు న్యాయవాది విజ్ఞప్తిని తిరస్కరించిన సుప్రీంకోర్టు




సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఏపీ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఉండవల్లి అరుణ్ కుమార్ కేసుతో తమ పిటిషన్‌ను కూడా జత చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ కోరారు. విచారణ వాయిదా వేయాలని విన్నవించారు. అలాగే విచారణ వాయిదా వేయాలని ఉండవల్లి అరుణ్‌కుమార్ తరఫు న్యాయవాది రమేశ్ అల్లంకి కూడా విజ్ఞప్తి చేశారు. అయితే విచారణ వాయిదా వేయొద్దని రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా కోరగా సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. అనంతరం ఉండవల్లి అరుణ్ కుమార్ పిటిషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను జత చేసిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది. కాగా.. తెలంగాణ ప్రభుత్వానికి కూడా కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదు.

రాష్ట్రపతి ముర్ముతో ముఖ్యమంత్రి జగన్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఆమెను కలిసిన సీఎం జగన్ శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన భేటీలో వివిధ అంశాలపై చర్చించడంతోపాటు రాష్ట్రంలో పరిస్థితులను వివరించారు. పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి సీఎం వెంట ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ డిస్కంల నుంచి ఏపీకి రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ.6,756 కోట్లను త్వరగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బకాయిల అంశాన్ని పరిష్కరిస్తాం: ఆర్కే సింగ్

సీఎం జగన్‌తో సమావేశం అనంతరం కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ మీడియాతో మాట్లాడారు. విద్యుత్ రంగానికి సంబంధించిన సమస్యలను సీఎం జగన్ ప్రస్తావించారని, ముఖ్యంగా తెలంగాణ నుంచి రావాల్సిన రూ.ఆరు వేల కోట్లకుపైగా బకాయిలపై చర్చించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం ఈ అంశం సొలిసిటర్ జనరల్ వద్ద ఉందని, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. చట్టం ప్రకారం ప్రాథమికంగా ఎవరు బకాయిలు చెల్లించాలనే విషయాన్ని పరిష్కరిస్తామన్నారు. పవర్ ఎక్స్ఛేంజీలలో కొనుగోళ్ల బకాయిల సమాచారంలో పొరపాట్లు లేవన్నారు. బకాయిలు చెల్లించని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు 75 రోజులలోగా చెల్లించాలని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించకుంటే విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కోల్పోతారని చెప్పారు.


రాష్ట్రపతి ముర్ముకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి


కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌కు శ్రీవారి చిత్రపటం ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్

రైతు.. ప్రభుత్వం.. ఫ్లిప్‌కార్ట్

- అన్నదాతల నుంచి నేరుగా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల కొనుగోలుకు సన్నాహాలు
- కనీస మద్దతు ధర కంటే మెరుగైన ధర చెల్లింపు
- వ్యవసాయ శాఖతో ఒప్పందం చేసుకోబోతున్న ఫ్లిప్‌కార్ట్

సాక్షి, అమరావతి: రైతుల నుంచి మెరుగైన ధరలకు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు కొనుగోలు చేయించేలా ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. తొలుత అపరాలు.. ఆ తర్వాత దశల వారీగా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కంటే మెరుగైన ధర చెల్లించి కొనుగోలు చేయడానికి ఫ్లిప్‌కార్ట్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖతో త్వరలో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. రైతులు పండించే పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సూచన మేరకు ఫ్లిప్‌కార్ట్ ముందుకు వచ్చింది. ఆన్‌లైన్ విక్రయాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లిప్‌కార్ట్ మాల్స్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానుంది.

ఎఫ్‌పీవోల ద్వారా కొనుగోళ్లు

వ్యవసాయ ఉత్పత్తులను ఇతర బహుళ జాతి సంస్థల మాదిరిగా మధ్యవర్తులు, వ్యాపారులు, మిల్లర్ల ద్వారా కాకుండా రైతుల నుంచి నేరుగా ఫ్లిప్‌కార్ట్ కొనుగోలు చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తుంది. అనంతపురం, గుంటూరు రీజియన్ పరిధిలో పనిచేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోల) ద్వారా కొనుగోళ్లు జరుపుతుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, కమిషనర్ హరికిరణ్‌తో ఫ్లిప్‌కార్ట్ బృందం మంగళవారం సమావేశం కానుంది. తొలి దశలో కందులు, మినుములు, పెసలు తదితర పప్పు దినుసులను ఎఫ్‌పీవోల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించనున్నామని, త్వరలో ఎంవోయూ చేసుకోనున్నామని ఫ్లిప్‌కార్ట్ ఏపీ ప్రతినిధి గిరిధర్ 'సాక్షి'కి తెలిపారు.



రైతులకు మేలు చేసేలా ఒప్పందం

రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనుగోలు చేసేందుకు ఫ్లిప్‌కార్ట్ సంస్థ ముందుకురావడం శుభపరిణామం. ఆహార ఉత్పత్తుల సరఫరా చైన్ మేనేజ్‌మెంట్‌ను రాష్ట్రంలో బలోపేతం చేస్తున్న వేళ ఫ్లిప్‌కార్ట్ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయబోతోంది. తద్వారా చిన్న, సన్నకారు రైతులకు సైతం మేలు కలుగుతుంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ప్రారంభం

- గన్నవరంలో ఏపీలో తొలి ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేయి ఉద్యోగాలు
- స్థానిక విక్రేతలు, ఎంఎస్ఎంఈలు, రైతులకు ఉపయోగకరం

సాక్షి, అమరావతి: ఈ – కామర్స్ మార్కెట్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేసింది. విజయవాడ సమీపంలోని గన్నవరం వద్ద ఏర్పాటు చేసిన ఈ నూతన ఫెసిలిటీని సోమవారం ప్రారంభించింది. ఈ కేంద్రం ప్రారంభంతో ఫ్లిప్‌కార్ట్ సరఫరా చైన్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించింది. ఈ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి కలగడంతో పాటు వేలాది మంది స్థానిక విక్రేతలు, ఎంఎస్ఎంఈలు, చిన్న రైతులకు మార్కెట్ అవకాశాలు లభిస్తాయి. ఈ ఫెసిలిటీతో రాబోయే ప్రతిష్టాత్మక ఫ్లిప్‌కార్ట్ కార్యక్రమం బిగ్ బిలియన్ డేస్ 2022లో రోజుకు 4 వేల గ్రోసరీ ఆర్డర్లను నిర్వహించగలదు. ఈ కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10,000 కోట్లతో పోలవరం పరుగులు

రీయింబర్స్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీబీటీ పద్ధతి ద్వారా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కింద నిర్వాసితులకు పరిహారాన్ని అందించాలన్నారు.

రిసోర్స్ గ్యాప్ నిధులు మంజూరు చేయాలి..

రిసోర్స్ గ్యాప్ కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయాలని ప్రధానిని సీఎం జగన్ కోరారు. 2014–15కి సంబంధించి బిల్లుల రూపంలో, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు తదితరాల రూపంలో రాష్ట్రానికి రావాల్సిన ఈ నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధీకరణ లేకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ప్రధాని దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో 2.68 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ అందుతుండగా ఇందులో కేంద్రం ఇస్తున్న దానికంటే అదనంగా దాదాపు 56 లక్షల కుటుంబాలకు రాష్ట్రమే రేషన్ వ్యయాన్ని భరిస్తోందని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి పెను భారమని, ఏపీకి నిర్దేశించిన కేటాయింపులను పునఃపరిశీలించాలని నీతిఆయోగ్ ఇప్పటికే సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్రం ఇస్తున్న దానికంటే అదనంగా 56 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని అమలు చేయడంతో సుమారు రూ.5,527.63 కోట్ల అదనపు భారాన్ని మోయాల్సి వచ్చిందని వివరించారు. ప్రస్తుతం సైతం పథకాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాతీయ ఆహార భద్రతా చట్టం లబ్ధిదారులపై పునఃపరిశీలన చేయాలని కోరారు.

వీటిని పరిష్కరించండి..

- తెలంగాణ డిస్కంల నుంచి రూ.6,756 కోట్ల విద్యుత్ బకాయిలు రావాల్సి ఉంది. ఎనిమిదేళ్లుగా ఈ సమస్య అపరిష్కృతంగానే ఉంది. ఈ బకాయిలు ఇప్పిస్తే కష్టాల్లో ఉన్న రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఒడ్డున పడతాయి. ఉత్పత్తిదారులకు బకాయిలు చెల్లించేందుకు మార్గం సుగమం అవుతుంది.
- రాష్ట్ర విభజనలో హేతుబద్ధత లేదు. దీనివల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయింది. విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలి. ప్రత్యేక హోదా సహా ఇతర హామీలను నెరవేర్చాలి.
- పారిశ్రామిక రంగం వృద్ధి, ఉద్యోగాల కల్పన, కేంద్రం నుంచి గ్రాంట్లు, పన్ను రాయితీలు తదితర ప్రయోజనాలు ప్రత్యేక హోదా ద్వారానే దక్కుతాయి. తద్వారా రాష్ట్రంపై భారం తగ్గుతుంది.
- రాష్ట్రంలో 26 జిల్లాలకుగానూ కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. 12 కాలేజీలకు అనుమతులు రావాల్సి ఉంది. వీటిని మంజూరు చేయాలి.
- కడపలో సమీకృత స్టీల్ ప్లాంట్‌కోసం ఏపీఎండీసీకి గనులు కేటాయించాలి.
- ఏపీఎండీసీకి బీచ్‌శాండ్ మినరల్ ఏరియాలను కేటాయించాలి. 14 ఏరియాలకు కేటాయింపు అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ రంగంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి.
- గత సర్కారు హయాంలో రాష్ట్రంలో పరిమితికి మించి చేసిన అప్పులను పరిగణలోకి తీసుకొని ప్రస్తుతం రుణ పరిమితిలో కోత విధించడం సరికాదు. ఇప్పుడు మూడేళ్లలో రూ.17,923 కోట్లకుపైగా రుణ పరిమితిలో కోత విధించారు. దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నవి రుణాలే కానీ గ్రాంట్లు కావు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని రుణాల పరిమితిని సవరించాలి.


ప్రధాని నరేంద్ర మోదీకి శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

మాత, శిశు మరణాల కట్టడికి పటిష్ట చర్యలు

- మరణాలపై ఆన్‌లైన్ పర్యవేక్షణ
- ఎంపీసీడీఎస్ఆర్ పోర్టల్‌లో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు లాగిన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మాత, శిశు మరణాల కట్టడికి వైద్య శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. మాత, శిశు మరణాల నమోదు, విశ్లేషణలో కచ్చితత్వం ఉండేలా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన 'మెటర్నల్, పెరినాటల్ డెత్ సర్వేలెన్స్ అండ్ రెస్పాన్స్' (ఎంపీసీడీఎస్ఆర్) పోర్టల్‌లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఎన్‌రోల్ చేశారు. ఈ పోర్టల్‌కు సంబంధించి రాష్ట్ర స్థాయిలో డ్యాష్ బోర్డును ఏర్పాటు చేశారు. మాత, శిశు మరణాలకు సంబంధించి వివరాలు నమోదుకు ప్రతి ఆస్పత్రి, జిల్లాకు రెండు రకాల లాగిన్‌లు ఉంటాయి. మాతృ మరణాలకు సంబంధించి లాగిన్‌లు కేటాయింపులు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలల మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 127 మాతృ మరణాలు సంభవించాయి. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గతంలో మాత, శిశు మరణాలు సంభవిస్తే ఆఫ్‌లైన్ విధానంలోనే నమోదు ఉండేది. వీటిపై జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఎంహెచ్‌వోలు మరణాలు సంభవించడానికి గల కారణాలపై సమీక్షించి.. తదుపరి ఆ తరహా ఘటనలు చోటు చేసుకోకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని చర్యలు తీసుకునేవారు. అయితే నూతన విధానంలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సంభవించిన మాత, శిశు మరణాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో రాష్ట్రంలో ఏ జిల్లా, మండలం, గ్రామంలో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నది సులువుగా తెలుసుకోవడానికి వీలుంటుంది. అదేవిధంగా సంబంధిత జిల్లా అధికారులు మరణాల కట్టడిపై సమీక్షలు నిర్వహించారా లేదా అన్న అంశాలు రాష్ట్ర అధికారులకు ఎప్పటికప్పుడు తెలుస్తుంది. మరణాలు యాంటేనేటల్, పోస్ట్‌నేటల్‌లో సంభవిస్తున్నాయా, మరణాలు సంభవించడానికి గల కారణాలేమిటి, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపం, ఇతర కారణాలేమిటనేది సులువుగా విశ్లేషించడానికి వీలు కలుగుతోంది. ఆన్‌లైన్ విధానం వల్ల వివరాల నమోదు, సమాచార మార్పిడిలో గతంలో ఉండే కాలయాపన తగ్గడంతోపాటు, కచ్చితత్వం ఉండనుంది.

ఏపీకి నాలుగో స్థానం

ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధతో ఇప్పటికే రాష్ట్రంలో మాత, శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. జాతీయ సగటు కన్నా రాష్ట్రంలో తక్కువగా మరణాలు ఉంటున్నాయి. ప్రతి లక్ష ప్రసవాలకు తల్లుల మృతుల సంఖ్య 70కి మించకూడదనేది నిబంధన. అయితే, జాతీయ స్థాయిలో సగటున ప్రతి లక్ష ప్రసవాలకు ప్రసూతి మరణాలు రేటు (ఎంఎంఆర్) 112గా ఉంది. రాష్ట్రంలో మాత్రం లక్ష ప్రసవాలకు ఇది 58గా నమోదైంది. ఈ క్రమంలో మాతృ మరణాల కట్టడిలో దేశంలోనే నాలుగో స్థానంలో మన రాష్ట్రం ఉంది. అదే విధంగా సగటున వెయ్యి ప్రసవాల్లో జాతీయ స్థాయిలో 30 మంది శిశువులు మరణిస్తున్నారు. రాష్ట్రంలో ఈ సంఖ్య 25గా ఉంది.

పండ్లు, కూరగాయల నష్టాలకు ఇక చెక్

▶ మొదటి పేజీ తరువాయి


రవాణా, గ్రేడింగ్, ప్యాకింగ్ చేయడంపై రైతులకు శిక్షణనిస్తున్నట్టు తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలి..

సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సేంద్రియ ఉత్పత్తులకు గుర్తింపు కోసం సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో ఆర్గానిక్ సర్టిఫికేషన్ సంస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇది త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, రైతులు, వినియోగదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం, రైతులకు శిక్షణనివ్వడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘాన్ని మంత్రి అభినందించారు. ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఉద్యాన పంటలు అధికంగా పండించే ప్రాంతాల్లో ప్రతి నాలుగు ఆర్బీకేలకు ఒక ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం చొప్పున 945 కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 505 కేంద్రాలకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వగా.. 171 చోట్ల పనులు చేపట్టామన్నారు. వీటిలో 32 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, అధ్యక్షుడు భూపతి రాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైతులకు కౌలు చెల్లింపు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.208 కోట్లు కేటాయింపు
- జూలైలో 24,739 మందికి దాదాపు రూ.185 కోట్లు చెల్లింపు
- మరో 1,304 మంది ఖాతాల్లో రూ.7.84 కోట్ల జమ
- వివాదాలు తేలిన తర్వాత మిగిలిన రైతులకు చెల్లింపు
- మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు చెల్లించాల్సిన కౌలు ఏటా 10 శాతం పెంచుతున్నట్టు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ప్రస్తుత (2022–23) ఆర్థిక సంవత్సరానికి గాను 24,739 మంది రైతుల ఖాతాల్లో రూ.184,99,37,974 నగదును జూన్, జూలై నెలల్లో జమచేయగా, మరో 1,304 మంది రైతుల ఖాతాల్లో సోమవారం రూ.7,84,14,562 జమచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరావతి ప్రాంతంలో భూములిచ్చిన రైతులకు చెల్లించాల్సిన కౌలును వివాదాల్లో ఉన్న భూములకు మినహా, మిగతావాటికి ఏటా ఎలాంటి ఆలస్యం లేకుండా రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కౌలు చెల్లింపులకు రూ.208.10 కోట్లు కేటాయించగా.. ఇప్పటి వరకు 26,043 మంది రైతులకు రూ.192,83,52,536 చెల్లించినట్లు తెలిపారు. రాజధాని భూ సమీకరణలో తీసుకున్న 34,400.15 ఎకరాల్లో 2,689.15 ఎకరాలు అసైన్డ్ భూములున్నట్లు చెప్పారు. అసైన్డ్ భూముల్లో 380.79 (కేటగిరీ–4, 6) ఎకరాలకు కౌలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఈ విభాగంలో మిగిలిన 2,308.36 ఎకరాలపై సీఐడీ విచారణ పూర్తయిన తర్వాత కౌలు మొత్తం చెల్లిస్తామని చెప్పారు. సివిల్ వివాదాల్లో ఉన్న మరో 455.04 ఎకరాలకు కూడా కేసులు ముగిశాక కౌలు చెల్లించనున్నట్టు తెలిపారు. 2015–16 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రైతులకు కౌలు రూపంలో రూ.1,344.93 కోట్లు చెల్లించినట్టు ఆయన చెప్పారు.

అమరావతి రైతులకు చెల్లించిన కౌలు సొమ్ము వివరాలు..

ఆర్థిక సంవత్సరం	రైతుల సంఖ్య	కౌలు సొమ్ము (రూ.కోట్లలో)
2015-16	28,390	148.75
2016-17	25,878	145.81
2017-18	24,265	154.11
2018-19	23,372	159.86
2019-20	24,588	173.55
2020-21	29,005	182.26
2021-22	28,501	187.75
2022-23	26,043	192.84
మొత్తం	---------	1,344.93

22 రోడ్ల విస్తరణకు రూ.540 కోట్లు

- 319 కి.మీ. మేర రోడ్ల నిర్మాణానికి ఆమోదం
- సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టేందుకు నిర్ణయం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి దిశగా మరో ముందడుగు పడింది. కేంద్ర రహదారుల మౌలిక వసతుల అభివృద్ధి నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి రాష్ట్రంలో 22 రహదారులను విస్తరించి.. కొత్త రోడ్లు నిర్మించే ప్రణాళికను ఆమోదించారు. ఇందులో భాగంగా మొత్తం 319 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నారు. వాటిలో జిల్లా ప్రధాన రహదారులు 13, రాష్ట్ర హైవేలు 7, ఇతర రహదారులు 2 ఉన్నాయి. జిల్లా కేంద్రాలు, జాతీయ రహదారిని అనుసంధానించే ప్రధాన రహదారులను సీఆర్ఐఎఫ్ నిధులతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ప్రతిపాదనలను రూపొందించి కేంద్ర ఉపరితల రవాణా శాఖకు సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం తొలి దశలో 9 రహదారులు, మలి దశలో 13 రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపింది. కాగా, ఈ ప్రణాళికపై సంతృప్తి చెందిన కేంద్ర ప్రభుత్వం ఒకే దశ కింద మొత్తం 22 రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఏకంగా రూ.540 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆ రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులను ఆర్ అండ్ బీ శాఖ చేపడుతుంది. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి ఏడాదిలో ఈ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అభివృద్ధి చేయనున్న రహదారులు ఇవీ

జిల్లా	రహదారి	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
అంబేడ్కర్ కోనసీమ	టేకిశెట్టిపాలెం-అంతర్వేది	25
అంబేడ్కర్ కోనసీమ	అమలాపురం-బెండమూర్లంక-సామంతకుర్రు	20
తూర్పు గోదావరి	గోపాలపురం-గంటి-రావులపాలెం	25
ఏలూరు	కలవపూడి-గణపవరం	22.50
పశ్చిమ గోదావరి	కొల్లేరు-భీమవరం	25
ఎన్టీఆర్	విజయవాడ-విస్సన్నపేట	40
కృష్ణా	గన్నవరం-పుట్టగుంట	35
సత్యసాయి	రొద్దాం-పావగడ-దొడగట్ట	20
సత్యసాయి	గుత్తూరు-మరకుంటపల్లి-మునిమడుగు	18
కర్నూలు	గార్లదిన్నె-బురుజుల-కోన	34.80
నెల్లూరు	నెల్లూరు-పొదలకూరు-సైదాపురం	45
నెల్లూరు	గూడూరు-తిరిమెర్ల	30
నెల్లూరు	కందుకూరు-కె.ఉలవపాడు	20
నెల్లూరు	కలిగిరి-ఓబులేటివారిపాలెం	30
తిరుపతి	శ్రీకాళహస్తి-ముచువోలు	20
శ్రీసత్యసాయి	బత్రేపల్లి-ఎన్‌పీ కుంట	22.50
కర్నూలు	నన్నూరు-చిన్నటేకూరు-గూడూరు-ఎమ్మిగనూరు	22.50
ఏలూరు	భీమడోలు-కామవరపుకోట	12
కాకినాడ	తుని-ఫైడికొండ	18
కాకినాడ	తాండవ నదిపై హైలెవల్ వంతెన (కొట్టం నుంచి కోటనందూరును అనుసంధానిస్తూ)	10
వైఎస్సార్	వల్లూరు-ఆదినిమ్మాయపల్లి, చిన్నమాచుపల్లి-పుష్పగిరి రోడ్	22.20
వైఎస్సార్	కడప-గండి-ఓబులంపల్లి	25.70

క్లుప్తంగా

సీపెట్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: ప్లాస్టిక్, అనుబంధ రంగాలకు సంబంధించిన వివిధ కోర్సులకు ప్రవేశాల గడువును విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) పొడిగించింది. పదో తరగతి, బీఎస్సీ పూర్తి చేసి.. ప్లాస్టిక్ రంగంపై ఆసక్తి ఉన్నవారు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సీపెట్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ సోమవారం సూచించారు. పదో తరగతి పూర్తయినవారు మూడేళ్ల కాలపరిమితి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బీఎస్సీ పూర్తయినవారు రెండేళ్ల కాలపరిమితి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు అర్హులన్నారు. కోర్సులకు ఎంపికైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 78935 86494 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వచ్చే నెల 3 నుంచి ఏపీ పీజీ సెట్

- ఈ నెల 25 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- ఏపీ పీజీ సెట్ కన్వీనర్ నజీర్ అహ్మద్ వెల్లడి



వైవీయూ: ఉన్నత విద్యా మండలి, యోగి వేమన విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2022 షెడ్యూల్‌ను సెట్ కన్వీనర్ ఆచార్య వై.నజీర్ అహ్మద్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సబ్జెక్టుల వారీగా సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 18తో ముగిసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 147 సబ్జెక్టులకు 39,359 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని చెప్పారు. ఇందులో అత్యధికంగా కెమికల్ సైన్స్‌కు 9,899 దరఖాస్తులు, లైఫ్ సైన్స్‌కు 5,960 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. సెప్టెంబర్ 3, 4, 7, 10, 11 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30 నుంచి 6 వరకు మూడో సెషన్ నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు ఈనెల 25 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. సంస్కృతం, ఉర్దూ, తమిళం, ఫోక్‌లోర్, బీఎఫ్‌ఏ, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, జియోగ్రఫీ సబ్జెక్టులకు దరఖాస్తులు తక్కువగా రావడంతో వాటికి పరీక్ష నిర్వహించడం లేదని చెప్పారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఆ కోర్సులకు సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

గిరిజనులకు విలువిద్యలో శిక్షణ

ప్రతి ఆదివాసీ ప్రాంతంలో ప్రత్యేక ఆర్చరీ శిక్షణ కేంద్రాల ఏర్పాటు

- అన్ని రాష్ట్రాల్లో ఆదివాసీలకు పూర్తిస్థాయి సదుపాయాలు
- అటవీ హక్కుల చట్టాల అమలుకు చర్యలు
- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా
- పర్యాటక కేంద్రాలుగా అల్లూరి నడయాడిన ప్రాంతాలు: కిషన్‌రెడ్డి
- చింతపల్లిలో మన్యం తిరుగుబాటు శత జయంత్యుత్సవాలు



గిరిజన సంప్రదాయ కొమ్ములతో.. కేంద్ర మంత్రులు అర్జున్‌ముండా, కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ, కళావతి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విలువిద్యలో ఆరితేరిన గిరిజనుల పిల్లల్ని ఆర్చర్లుగా తీర్చి దిద్దుతామని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆదివాసీ ప్రాంతంలో ఆర్చరీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వీటికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో ఆదివాసీలకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పిస్తామని, అటవీ హక్కుల చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం చింతపల్లిలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో రంప తిరుగుబాటు శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అల్లూరి దాడి చేసిన పోలీస్ స్టేషన్ ఆవరణలో సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అల్లూరి అనుచరుడు గంటం దొర మనుమడు బోడి దొరని ఘనంగా సత్కరించారు. వారి వారసులు 11 మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. న్యాయవాది కరణం సత్యనారాయణరాజు ఆంగ్లంలో రచించిన 'లెజెండరీ అల్లూరి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ గిరిజనులు ఆత్మాభిమానం కోసం ప్రాణాలు పణంగా పెడతారని చెప్పారు. అల్లూరి బ్రిటిష్ వారిపై విప్లవాగ్ని రగిలించడం గర్వంగా ఉందన్నారు. గిరిజనుల ఉన్నత విద్యకు 2014 నుంచి దేశవ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలల్ని ప్రారంభించామని, 740కి పైగా పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం బడ్జెట్‌ను రూ.12 కోట్ల నుంచి రూ.38 కోట్లకు పెంచామన్నారు. ఆదివాసీలకు దైవంతో సమానమైన చెట్టు, పుట్ట, భూమిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. అటవీ ఉత్పత్తుల్ని పెంచి, వాటి మార్కెటింగ్‌కు మోడల్ విలేజ్‌లు అభివృద్ధి చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తామని మంత్రి అర్జున్ ముండా తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బెంగళూరు, ఢిల్లీలోనూ అల్లూరి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని, తొలి గిరిజన మహిళా రాష్ట్రపతి ఆధ్వర్యంలోనూ వేడుకలు జరుపుతామని అన్నారు. అల్లూరి నడయాడిన ప్రాంతాల్ని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ గిరిజనులకు 9 లక్షల ఎకరాలకు పైగా అటవీ హక్కు పత్రాలు అందించిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. రాజేంద్రపాలేన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. కృష్ణదేవి పేటలో రూ.66 లక్షలతో అల్లూరి స్మృతి వనం అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా, జూ.ఎన్టీఆర్ భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదు: కిషన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: అమిత్‌షా, జూనియర్ ఎన్టీఆర్ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వారిద్దరి మధ్య సినిమాలకు సంబంధించిన చర్చ మాత్రమే జరిగిందన్నారు. సీనియర్ ఎన్టీఆర్ గురించి, ఆయన చేసిన పలు సినిమాల గురించి అమిత్ షా అడిగి తెలుసుకున్నారని వివరించారు. జూనియర్ ఎన్టీఆర్‌తో డిన్నర్ మీట్‌కు అమిత్ షా కోరిన నేపథ్యంలో ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఆరు పేపర్లే

▶ మొదటి పేజీ తరువాయి

నాలుగు యూనిట్ టెస్టులు, రెండు టర్మ్ టెస్టులు నిర్వహించేవారు. సీసీఈ విధానాన్ని ముందుగా 8వ తరగతి వరకే అమల్లోకి తెచ్చినప్పటికీ.. ఆ తర్వాత 9, 10 తరగతులకూ వర్తింపచేశారు. సీసీఈ విధానంలో విద్యార్థులకు నాలుగు ఫార్మేటివ్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించేవారు. అంతేకాకుండా వివిధ ప్రాజెక్టులు, ఇతర కార్యక్రమాలతో సీసీఈ విధానం అమలు చేశారు.

విద్యార్థులపై పరీక్షల భారం తగ్గించేందుకు..

ఈ నేపథ్యంలో విద్యార్థులను పబ్లిక్ పరీక్షల్లో మరింత నిశితంగా పరీక్షించాల్సిన అవసరం లేదని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) పాఠశాల విద్యా శాఖకు నివేదికను సమర్పించింది. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు సీబీఎస్‌ఈ.. టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లలోనే నిర్వహిస్తోందని నివేదించింది. దీన్ని అనుసరించి రాష్ట్రంలో కూడా ఆరు లేదా ఏడు పేపర్లలో నిర్వహిస్తే సరిపోతుందని తెలిపింది. దీంతో ప్రభుత్వం టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లలోనే నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖను ఆదేశించింది.

వివాహానికి వెళ్లొస్తూ మృత్యు ఒడికి

- పంట కాల్వలోకి దూసుకుపోయి బోల్తా కొట్టిన కారు
- ముగ్గురు మహిళల మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- ఏలూరు జిల్లాలో విషాదం



తల్లి అమర్జహాన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు బాషా

గణపవరం: పంట కాల్వలో కారు బోల్తా కొట్టిన ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. ఈ విషాద ఘటన ఏలూరు జిల్లా గణపవరం మండలం వల్లూరు – అర్ధవరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి జరిగింది. మృతులు భీమవరంలోని కొత్త బస్టాండ్ ప్రాంతానికి చెందినవారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమవరం కొత్త బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న మహబూబ్ బాషా బంధువుల వివాహం ఏలూరులో జరిగింది. దీనికి అమర్జహాన్ (50), మహ్మద్ సంషాద్ (55), ఫాతిమా జహార్‌బీ (45), అమర్జహాన్ కుమారుడు కమాల్ బాషా, ఎండీ రహీమా కారులో బయలుదేరి వెళ్లారు. ఫంక్షన్ పూర్తి అయ్యాక తాడేపల్లిగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి రాత్రి ఎనిమిది గంటల సమయంలో కారులో భీమవరం బయలుదేరారు. కారు వల్లూరు వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి.. పంట కాల్వలోకి దూసుకుపోయింది. స్థానికులు వెంటనే కారులో ఉన్నవారిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నీటిలో సగం వరకు కారు మునిగిపోవడంతో కారులో ఉన్న అమర్జహాన్, మహ్మద్ సంషాద్ (55), ఫాతిమా జహార్‌బీ (45) అనే ముగ్గురు మహిళలు ఊపిరాడక కారులోనే ప్రాణాలు విడిచారు. కారు నడుపుతున్న అమర్జహాన్ కుమారుడు కమాల్ బాషా, ఎండీ రహీమాను స్థానికులు రక్షించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న జేఈఈ అడ్వాన్స్‌డ్

▶ మొదటి పేజీ తరువాయి

వెబ్‌సైట్ (https://jeeadv.ac.in/) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా పరీక్ష విధానంలో స్వల్ప మార్పులు మినహా పాత విధానంలోనే పరీక్ష జరగనుంది. అడ్వాన్స్‌డ్ పరీక్షలో న్యూమరికల్ వ్యాల్యూ విభాగంలోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు ఉండవు. తక్కిన విభాగాల్లోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు ఉంటాయి.

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

జేఈఈ మెయిన్‌ను 13 మాధ్యమాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. అడ్వాన్స్‌డ్‌ను మాత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లోనే నిర్వహిస్తారు. ఒక్కో పేపర్ పరీక్ష వ్యవధి.. మూడు గంటలు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పేపర్–2 నిర్వహిస్తారు. నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పేపర్–1, పేపర్–2ల్లో ఒక్కోదానిలో 54 ప్రశ్నలుంటాయి. ఒక్కో పేపర్‌కు 180 చొప్పున మొత్తం 360 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు మినహా తక్కిన విభాగాల్లో తప్పుగా రాసినవాటికి నెగిటివ్ మార్కులుంటాయి. మార్కుల విధానంలో ఫుల్ మార్కులు, పార్షియల్ మార్కుల విధానం అమలవుతుంది.

సెప్టెంబర్ 3న ప్రొవిజినల్ 'కీ'..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఆంధ్రప్రదేశ్‌లో 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐఐటీ భువనేశ్వర్ జోన్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు ఐఐటీ మద్రాస్ జోన్ పరిధిలో 25 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థుల రెస్పాన్సు కాపీలను సెప్టెంబర్ 1 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ప్రొవిజినల్ ఆన్సర్ కీని అదే నెల 3న విడుదల చేస్తారు. వీటిపై 3, 4 తేదీల్లో అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. తుది ఆన్సర్ కీని, ఫలితాలను సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నారు. ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అదే రోజు నుంచి ప్రారంభం కానుంది. ఈ పరీక్షను సెప్టెంబర్ 14న నిర్వహించి ఫలితాలను 17న విడుదల చేస్తారు. కాగా సెప్టెంబర్ 12 నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ఆధ్వర్యంలో సీట్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఇంక సొంతంగా ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ పార్కుల నిర్మాణం

5వ ఎస్‌ఎల్‌ఎస్‌సీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేగంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు మౌలికవసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంటోంది. ప్రతి జిల్లాకు కనీసం ఐదు ఎంఎస్‌ఎం క్లస్టర్లను అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా వీటిని అభివృద్ధి చేసే బాధ్యతను ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించనుంది. ఇందుకోసం ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన 5వ స్టేట్ లెవెల్ స్టీరింగ్ కమిటీ ఆన్ ఎంఎస్‌ఈ సీడీపీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఇంజనీరింగ్ విభాగం లేకపోవడంతో ఎంఎస్‌ఎంఈ పార్కులు, క్లస్టర్లు వంటి నిర్మాణ బాధ్యతలను ఏపీఐఐసీ వంటి సంస్థలకు అప్పగించేవాళ్లమని, ఇప్పుడు పనులు వేగంగా చేయడం కోసం సొంతంగా ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినట్లు ఏపీఎంఎస్‌ఎంఈడీసీ సీఈవో గోపాలకృష్ణ 'సాక్షి'కి వివరించారు. ఒకసారి ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటైతే ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన అన్ని నిర్మాణ పనులను తమ సంస్థలోకి బదలాయించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలను పెద్ద ఎత్తున ప్రోత్సహించే విధంగా త్వరలో ప్రత్యేక పాలసీని తీసుకు రావాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంఎస్‌ఎంఈ డీఐ ఐఈడీఎస్ డి.చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వలవన్, రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్ జి.సృజన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బాకీ కట్టాల్సిందే..

- ఎల్‌పీఎస్ పథకం తీసుకొచ్చిన కేంద్రం


సాక్షి, అమరావతి: రాష్ట్రాల్లోని విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కంల) ముక్కుపిండి మరీ బకాయిలు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. గడువులోగా చెల్లించని డిస్కంలపై కఠిన వైఖరిని అవలంబిస్తోంది. కేంద్రం దెబ్బకు రాష్ట్రాలు విలవిల్లాడుతున్నాయి. తక్షణమే చెల్లించాల్సిన రూ.5,100 కోట్లలో దాదాపు 80 శాతం బకాయిలను కేవలం ఐదురోజుల్లో వసూలు చేసింది. కేంద్రం ఇదే విధానాన్ని కొనసాగిస్తే డిస్కంల మనుగడ కష్టంగా మారుతుందని ఇంధనరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బకాయిల వసూళ్లలో కఠిన విధానాలు అమలు చేసేందుకు కేంద్రం నాలుగేళ్ల నుంచే ప్రణాళికలు వేస్తూ వస్తోంది. విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత కోసమంటూ 2018 మే నెలలో పేమెంట్ రాటిఫికేషన్ అండ్ అనాలసిస్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్వాయిస్ ఆఫ్ ఏజెన్సీస్ (పీఆర్‌ఏఏపీటీఐ) పేరుతో 'ప్రాప్తి' వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కంలు చెల్లించాల్సిన బకాయిల వివరాలను ఎప్పటికప్పుడు ఈ పోర్టల్ ద్వారా అప్‌డేట్ చేస్తున్నారు. ఇందులో పేర్కొన్నదాని ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి డిస్కంల బకాయిలు రూ.1,32,432 కోట్లకు చేరాయి. దీంతో విద్యుత్ నిబంధనలు–2022 ప్రకారం కేంద్రం జూన్ 3న లేట్ పేమెంట్ సర్‌చార్జ్(ఎల్‌పీఎస్) పథకాన్ని తీసుకొచ్చింది. మే నాటికి ఉన్న బకాయిలు రూ.1,30,139 కోట్లను 48 వాయిదాల్లో చెల్లించేస్తే సర్‌చార్జ్ నుంచి మినహాయింపు ఇస్తామని డిస్కంలకు ఆఫర్ ఇచ్చింది. ఏపీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఈ పథకంలో చేరిన ఏపీ డిస్కంలు తొలివాయిదా రూ.1,407 కోట్లను ఈ నెల 5న కట్టేశాయి.

గడువు దాటితే నిషేధం

ఎల్‌పీఎస్ కంటే ముందే 2019 ఆగస్టు 1న పేమెంట్ సెక్యూరిటీ మెకానిజాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. దీనిప్రకారం.. డిస్కంలు కొనుగోలు చేయాలనుకున్న విద్యుత్‌కు ముందే సెక్యూరిటీ లెటర్ ఇచ్చి 45 రోజుల్లోగా బిల్లులు చెల్లించాలి. ఇందుకోసం 2020 మేలో డిస్కంలు రుణాలు తీసుకునేందుకు రూ.90 వేల కోట్ల లిక్విడిటీ ఇన్‌ఫ్యూజన్‌ను ప్రకటించింది. తద్వారా పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌ల నుంచి డిస్కంలు భారీగా రుణాలు పొందగా.. వడ్డీలతో కలిపి భారంగా మారాయి. మరోవైపు బకాయిలు చెల్లించకపోతే ఇన్నాళ్లు వడ్డీనే వసూలు చేస్తున్న కేంద్రం తాజాగా నిషేధాస్త్రం ప్రయోగించింది. 13 రాష్ట్రాల్లోని 29 డిస్కంలు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీలో విద్యుత్ కొనుగోలు, అమ్మకం వంటివి నిర్వహించకుండా 18న నియంత్రణ విధించింది. అప్పటికే చెల్లించిన ఏపీతో సహా కొన్ని రాష్ట్రాలు నిషేధం నుంచి బయటపడ్డాయి. పలు రాష్ట్రాలు ఐదురోజుల్లోనే బకాయిలు చెల్లించేశాయి. ఇంకా చెల్లించని కర్ణాటక, జమ్ముకశ్మీర్, మిజోరాం రాష్ట్రాలపై నిషేధం కొనసాగుతోంది.

నేనే గెలవాలని కాదు..!

- మా లక్ష్యం 'వైఎస్సార్‌సీపీ విముక్త ఆంధ్రప్రదేశ్': పవన్
- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వం



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో తామే గెలవాలన్నది జనసేన వ్యూహం కాదని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెల్లడించారు. 'ప్రజలు బాగుండాలి.. వారి భవిష్యత్ బాగుండాలి. ఒక్కటి మాత్రం ఖచ్చితం.. వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వం' అని పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రోజు జరిగిన సమావేశంలో 'వైఎస్సార్ సీపీ విముక్త ఆంధ్రప్రదేశ్' అని పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరినీ కూడగట్టి అడుగులు వేస్తామన్నారు. ఆ దిశగానే తమ వ్యూహాలు ఉంటాయన్నారు. 'ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వబోమంటూ ఆవిర్భావ సభలో చెప్పినదానికి కొనసాగింపే వైఎస్సార్‌సీపీ విముక్త ఆంధ్రప్రదేశ్. దీనికి ఎలా అడుగులు పడతాయో చెప్పలేను. ఏం జరుగుతాయో చెప్పలేను. మొన్నటి దాకా ప్రధాని మోదీ టీడీపీని రానివ్వరు.. చంద్రబాబును కలవరు అని అన్నారు. మరి వాళ్లిద్దరూ కలిశారు కదా? వాళ్ల ఇద్దరి మధ్య ఏం జరిగిందో నాకు తెలియదు' అని చెప్పారు.

షిండే ఏ పాదయాత్రతో సీఎం అయ్యారు?

తాను ఒక లక్ష్యం వైపు వెళ్లుతుంటే పార్టీలో కొందరు నేతలు పరిమిత మేధస్సుతో వెనక్కి లాగుతున్నారని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు కొందరు పక్కనే ఉంటూ పొడుస్తున్నారని చెప్పారు. అలాంటి వారు వేరే పార్టీలో చేరాలని సూచించారు. 2009లోనూ కొంత మంది డబ్బులు తీసుకోవడం వల్ల అప్పుడు (ప్రజారాజ్యం) అలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. జనసేనలో అలాంటివి తన దృష్టికి వస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని చెప్పారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ రాజకీయంగా మూడో ప్రత్యామ్నాయం ఉండాలన్నారు. అమిత్‌షా– జూనియర్ ఎన్టీఆర్ భేటీ ఎందుకు జరిగిందని బీజేపీ నేతలను తాను ఆరా తీయబోనని చెప్పారు. పాదయాత్రలు చేస్తేనే ముఖ్యమంత్రి కారని వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండే ఎలాంటి పాదయాత్ర చేసి ముఖ్యమంత్రి అయ్యారని ప్రశ్నించారు.

బీజేపీతో సంసారం.. చంద్రబాబుతో శృంగారమా?

పవన్‌కు డీల్ కుదిరింది.. ప్యాకేజీ సెట్టైంది

- అది జనసేన కాదు.. 'నారా–నాదెండ్ల' సేన
- టీడీపీ కార్యాలయం ఉండగా మంగళగిరిలో మరో ఆఫీస్ ఎందుకు?
- అన్ని చోట్లా గుండు గీశారు కాబట్టే జుత్తు పెంచుతున్నారు
- చిరంజీవికి తమ్ముడివా?.. చంద్రబాబుకు దత్తపుత్రుడివా?
- మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి శంకరనారాయణ, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ధ్వజం





సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో జనసేనకు డీల్ కుదిరిందని మూడు రోజులుగా పవన్‌కల్యాణ్ పిచ్చి వాగుడుతో స్పష్టమవుతోందని రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి ఎం.శంకరనారాయణ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. చంద్రబాబు కోసం.. చంద్రబాబు చేత.. చంద్రబాబు వల్ల పుట్టిన పార్టీ జనసేన అని వ్యాఖ్యానించారు. తనకు కులమతాలు, ప్రాంతాలు లేవంటున్న పవన్‌కు ఉన్నది చంద్రబాబు... కావాల్సింది ప్యాకేజీ అని విమర్శించారు. ఈ మేరకు సోమవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలివీ..

ఇంతకీ ఎవరి కోసం?

ఓ దొంగ తనకు తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని చెప్పినంత మాత్రాన జనం నమ్మరు. మాటలను బట్టి కాకుండా చేతల ఆధారంగా నిగ్గు తేలుస్తారు. టీడీపీ, జనసేన విముక్త ఆంధ్రప్రదేశ్ అని 2019లోనే ప్రజలు తీర్పు చెప్పడంతో పవన్‌కు మెంటల్ ఎక్కింది. గత ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ గుండు గీశారు కాబట్టే జుత్తు పెంచుకోవడంపై ఆయనకు అంత మమకారం. ఇంతకీ వచ్చే ఎన్నికల్లో బాబు కోసం పోటీ చేస్తున్నావా? లేక నీ కోసం నువ్వు పోటీ చేస్తున్నావా..? అని అడిగితే నోరు మెదపడు. 175కు 175 ఎమ్మెల్యే సీట్లలో, 25కు 25 లోక్‌సభ సీట్లలో నీ బీఫామ్ మీద అభ్యర్థులను నిలబెడుతున్నావా లేదా? అంటే దానికీ సమాధానం లేదు.

మరో కార్యాలయం ఎందుకు?

తనను కాకుండా మరో సినీ నటుడిని తాజాగా అమిత్‌షా కలవటంతో పవన్ కల్యాణ్‌కు టీడీపీ వైపు వెళ్లిపోవాలన్న ఆత్రం మరింత పెరిగినట్లుంది. బీజేపీతో పొత్తులో ఉన్నారా లేదా? అనే విషయం చెప్పకుండా, సంసారం ఒకరితో... శృంగారం మరొకరితో అన్నట్లుగా బీజేపీ మిత్రపార్టీగా చెప్పుకుంటూ రోజూ చంద్రబాబు డైలాగులనే వల్లిస్తున్నారంటే పవన్‌కు ప్యాకేజీ కుదిరింది. ఆయన పర్యటన కూడా బహుశా టీడీపీ కోసం, టీడీపీ చెప్పినట్టు, టీడీపీ చెప్పిన నియోజకవర్గాల్లో, టీడీపీ డైలాగులు, స్క్రిప్టుతో కొనసాగుతోంది. అసలు మంగళగిరిలో పవన్‌కు వేరే ఆఫీసు ఎందుకు? టీడీపీ కార్యాలయంలోనే నిర్వహిస్తే సరిపోతుంది కదా. ఆయన చెబుతున్న వైఎస్సార్‌సీపీ రహిత ఆంధ్రప్రదేశ్ అంటే అర్థం ఏమిటి? జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, 31 లక్షల ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, వైఎస్సార్ రైతు భరోసా, రైతులకు ఉచిత విద్యుత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన.. ఇలా దాదాపు 40కి పైగా సంక్షేమ పథకాలు అమలు కాకూడదన్నదే బాబు, దత్తపుత్రుడి అజెండా.

ఆ డబ్బంతా ఏమైంది?

బాబు–పవన్ జాయింట్ గవర్నమెంట్ హయాంలో ఈ పథకాలన్నింటినీ ఎందుకు ఇవ్వలేకపోయారంటే.. నాడు వారి కడుపులు మాత్రం నింపుకొని ప్రజలను ఎండగట్టారు. ఇప్పుడు రూ.1.65 లక్షల కోట్లకుపైగా మూడేళ్లలోనే నేరుగా పేదలకు లబ్ధి చేకూరింది. ఈ డబ్బంతా బాబు–పవన్ ప్రభుత్వంలో ఎక్కడికి పోయింది?

కనిపించింది ప్యాకేజీ ఒక్కటే

రెయిన్ గన్ల పేరుతో గత సర్కారు రాయలసీమలో ఐదేళ్లు డ్రామాలాడినా, కరువు కోరల్లో చిక్కుకున్నా రైతు కష్టం పవన్ కల్యాణ్‌కు కనపడలేదు. ప్యాకేజీ ఒక్కటే కనిపించింది. పార్టనర్‌షిప్ సదస్సుల పేరుతో చొక్కాపైన ధరించే కోట్లు అద్దెకు తెచ్చి, దొంగ సంతకాలతో పారిశ్రామిక అభివృద్ధి అని ప్రచారం చేసిన చంద్రబాబు హయాంలో, ప్రత్యేక హోదాను పోగొట్టినప్పుడు పవన్ కల్యాణ్ మగతనం ప్యాకేజీ కోసం పూర్తిగా చచ్చిపోయింది.

స్టేటస్, ప్యాకేజీ దక్కింది పవన్‌కే

2018లో చంద్రబాబు తాకట్టు పెట్టిన ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ రాలేదు గానీ రాజకీయ కరువు బాధితుడు పవన్ కల్యాణ్‌కు మాత్రం టీడీపీ నుంచి పూర్తి స్థాయి స్పెషల్ స్టేటస్, స్పెషల్ ప్యాకేజీ దక్కింది. లింగమనేని భూముల రూపంలో, గాజువాక, భీమవరం స్పాన్సర్ల రూపంలో, టీడీపీనే ఇచ్చిన జనసేన బీఫామ్‌ల రూపంలో వారి మధ్య అవగాహన అద్భుతంగా వర్ధిల్లింది. ఇప్పుడున్నది జనసేన కాదు. అదంతా నారా–నాదెండ్ల సేన. గ్లాసు బాబుది.. డోస్ పవన్‌ది.

తట్టుకోలేకే వితండ వాదన..

సీఎంపై పవన్‌కు హఠాత్తుగా అంతులేని మమకారం ఏర్పడింది. తన అన్నని సీఎం జగన్ నివాసంలో ఆప్యాయంగా ఆదరించినా, తాను ఓడిపోయిన భీమవరంలో ఆలింగనం చేసుకున్నా తట్టుకోలేకే అవమానించారంటూ వితండ వాదన చేస్తున్నారు. ప్రతి నమస్కారంతోపాటు ప్రతి ఒక్కరికీ మంచి చేసే సంస్కారం సీఎం జగన్ సొంతం.

తమ్ముడా.. దత్తపుత్రుడా?

రాజకీయం అంటే సినిమా కాదు. సినిమాల్లో థానోస్‌లుంటారు. రాజకీయాల్లో విలన్లని జనం ఎప్పటికప్పుడు చావబాదుతూనే ఉంటారు. రాజకీయ జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నా, ఇప్పటికీ ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోయినా, ప్రజలు ఇంతగా ఛీ కొట్టినా, సిగ్గూ లజ్జా లాంటి పదాల్ని వ్యక్తిగత జీవితంలో, రాజకీయ జీవితంలో కూడా కాశీ, గంగలో కలిపేసుకుని బతుకుతున్న వాళ్లని ఏమనాలి? చిరంజీవికి తమ్ముడు అనాలా.. చంద్రబాబుకు దత్తపుత్రుడు అనాలా?

చిరంజీవిపైనే పవన్ వ్యాఖ్యలా?

- జూ.ఎన్టీఆర్ ఇమేజ్‌ను వాడుకునేందుకే అమిత్‌షా భేటీ
- మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలు



గుడివాడ రూరల్: ప్యాకేజీల కోసం చంద్రబాబు దత్తపుత్రుడిగా మారి బూట్లు నాకే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మెగాస్టార్ చిరంజీవిపై వ్యాఖ్యలు చేసే అర్హత లేదని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు (నాని) చెప్పారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చిరంజీవి సినీ రంగంలో సమస్యల పరిష్కారానికి, సినీ కళాకారుల సంక్షేమాన్ని ఆకాంక్షించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారని అన్నారు. చిరంజీవి సినీ రంగంలో కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి అని, ఆయనంటే అందరికీ అమితమైన గౌరవమని తెలిపారు. చిరంజీవి సీఎంకు నమస్కారాలు పెట్టారని ఆత్మాభిమానం లేదని పవన్ అనడం సిగ్గుచేటన్నారు. ఉన్న పుత్రుడు వల్ల ప్రయోజనం లేక చంద్రబాబు దత్తపుత్రుడు వైపు చూస్తున్నారని విమర్శించారు.

బీజేపీ విస్తరణలో భాగంగానే ఎన్టీఆర్‌తో భేటీ

బీజేపీని దేశవ్యాప్తంగా విస్తరించడంలో భాగంగానే జూనియర్ ఎన్టీఆర్‌తో అమిత్‌షా భేటీ అయ్యారని భావిస్తున్నట్లు కొడాలి నాని చెప్పారు. జూనియర్ ఎన్టీఆర్ నటనను మెచ్చుకోవడానికి అమిత్‌షా భేటీ అయ్యారంటే తాను నమ్మనని, బీజేపీ కోసం ఎన్టీఆర్ ఇమేజ్‌ను వాడుకునే ఉద్దేశంతోనే ఈ భేటీ జరిగిందనేదే తన అభిప్రాయమన్నారు. రాజకీయంగా ఉపయోగం ఉండే వ్యక్తులతోనే మోదీ, అమిత్‌షా భేటీ అవుతారని చెప్పారు. చంద్రబాబు, ఎల్లో మీడియా అధినేతలు ఢిల్లీలో మోదీ, అమిత్‌షా భేటీ కోసం ప్రదక్షిణలు చేసినా అపాయింట్‌మెంట్ దక్కలేదని ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఈ పకోడి, చకోడి నాయకుల సామర్థ్యం వారికి తెలుసునన్నారు. 2024 ఎన్నికల్లో బాబు, పవన్‌కు రాజకీయ సన్యాసం తప్పదని చెప్పారు. దొడ్డిదారిన మంత్రి పదవి పొందిన నారా లోకేష్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. హైదరాబాద్‌లో పుట్టి మంగళగిరిలో ఓడిపోయిన పప్పుగాడికి పలాసలో పనేంటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడబడితే అక్కడ ఆందోళన చేస్తే పోలీసులు అరెస్ట్ చేసి లోపలేస్తారన్నారు. సీఎం జగన్ గురించి పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తే పప్పుగాడికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఆహార ఉత్పత్తుల్లో తగ్గుతున్న పోషక విలువలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్

సాక్షి, అమరావతి: రసాయన వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం వల్ల ఆహార పదార్థాల్లో పోషక విలువలు తగ్గిపోతున్నాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ అన్నారు. భవిష్యత్‌లో మూడు నుంచి ఐదు రెట్లు అధికంగా ఆహారం తీసుకోవల్సిన పరిస్థితి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో కొత్తగా చేరిన 12 జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, సిబ్బందికి మూడు రోజులు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని గుంటూరు రైతు సాధికార సంస్థ భవన్‌లో సోమవారం విజయకుమార్ ప్రారంభించారు. రోజురోజుకూ ఆహార ఉత్పత్తుల్లో తగ్గుతున్న కాపర్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియాన్ని పరిశీలిస్తే ఆహారంలో పోషక విలువలు ఏ స్థాయిలో తగ్గిపోతున్నాయో అర్థమవుతుందని తెలిపారు. గత 50 ఏళ్లలో సాగు భూమి 20 శాతం పెరిగితే, ఎరువుల వాడకం 12 రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. ఏటా భూసారం తగ్గిపోతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రకృతి సాగు పద్ధతులు పాటిస్తే గాలిలో కర్బన శాతం తగ్గి వాతావరణం చల్లబడుతుందన్నారు.



అత్యంత వివేకవంతులూ, అత్యంత మూర్ఖులూ మాత్రమే ఎప్పటికీ మారకుండా ఉంటారు.
– కన్‌ఫ్యూషియస్

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 23

ఈ లెక్క సరైనదేనా?

వివాదం ముందు పుట్టి కశ్మీర్ తర్వాత పుట్టిందంటే అతిశయోక్తి కాదేమో! స్వతంత్ర భారతదేశంలో విలీనం దగ్గర నుంచి ఇవాళ్టి దాకా జమ్మూ – కశ్మీర్‌ను చుట్టుముట్టినన్ని వివాదాల కథ అలాంటిది మరి. జమ్మూ – కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370వ అధికరణం రద్దు తర్వాత గత మూడేళ్ళలోనూ ఇదే వరుస. ఓటర్ల జాబితా సవరణ అంశం ఆ జాబితాలో తాజాగా వచ్చి చేరింది. దేశంలోని ఈ అతి పిన్న వయసు కేంద్ర పాలిత ప్రాంతంలో 'సాధారణంగా నివసిస్తున్నవారు' సైతం ఓటర్లుగా నమోదు చేయించుకోవచ్చంటూ జమ్మూ – కశ్మీర్ ఎన్నికల ప్రధానాధికారి ఆగస్ట్ 17న ప్రకటించారు. బీజేపీ మినహా అక్కడి రాజకీయ పార్టీలన్నీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తాజా అనుమతితో గేట్లు ఎత్తేసినట్టేననీ, చివరకు స్థానిక ప్రజలు ఎన్నికల మైనారిటీగా మారిపోతారనీ రచ్చ రేగుతోంది.

మునుపటి జమ్మూ– కశ్మీర్ రాష్ట్రంలో శాశ్వతవాసులే ఓటర్లుగా అర్హులు. అలా కానివారు సైతం ఇప్పుడు ఓటు వేయడానికి అర్హులే అన్నది ఎన్నికల ప్రధానాధికారి మాట. ఆర్టికల్ 370 రద్దుతో 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం అందుకు అవకాశమిస్తోందనేది ప్రాతిపదిక. దీని వల్ల జమ్మూ – కశ్మీర్ తుది ఓటర్ల జాబితాలో 20 – 25 లక్షల మంది ఓటర్లు కొత్తగా చేరతారని అంచనా. అలాగే, ఆ ప్రాంతంలో నియుక్తులైన దాదాపు 7 లక్షల భద్రతా దళ సిబ్బందీ ఓటర్లుగా నమోదు చేసుకొని, సరి కొత్త కేంద్రపాలిత ప్రాంతపు తొలి అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనవచ్చు. ఈ వైఖరే ఇప్పుడు స్థానిక ప్రధాన పార్టీల్లో అనేక అనుమానాలకు దారి తీస్తోంది. ఇది స్థానికేతరుల్ని ఓటర్లుగా చేర్చి, వారికి ఓటుహక్కు కల్పించే పన్నాగమనీ, స్థానికులు మైనారిటీగా మారిపోతారనీ, ఎన్నికల్లో వారి ప్రాధాన్యం తగ్గిపోతుందనీ నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ, సీపీఎం వగైరాల ఆరోపణ.

దాదాపు దశాబ్ద కాలం తర్వాత తొలిసారిగా ఎన్నికల దిశగా వెళుతున్న కశ్మీర్‌లో 2019 ఆగస్ట్ 5న ఆర్టికల్ 370 రద్దుతో ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించడమే పెను వివాదమైంది. ఆ పైన ప్రధాన పార్టీల నేతల్ని నిర్బంధంలో ఉంచడం మరో వివాదం. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపైనా ఆరోపణలొచ్చాయి. ఏడు అసెంబ్లీ స్థానాలు సృష్టిస్తే, 6 జమ్మూకు, ఒకటే కశ్మీర్‌కు దక్కాయి. ముస్లిమ్‌ల మెజారిటీ ఉన్న కశ్మీర్‌ను తగ్గించి, హిందూ మెజారిటీ జమ్మూకు రాజకీయ ప్రాధాన్యం దక్కేలా ఈ ప్రక్రియ సాగిందనే విమర్శ ఎదురైంది. తీరా ఎన్నికలకు వెళ్ళే ముందు ఆఖరు పనిగా 25 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చుకొనే తాజా ప్రతిపాదన అగ్నికి ఆజ్యం పోసింది. అయితే, ఈ కొత్త ఓటర్లలో అధిక శాతం మంది మునుపటి ఓటర్ల జాబితా సవరణ తర్వాత 18 ఏళ్ళు నిండినవారన్నది కశ్మీర్ ఎన్నికల యంత్రాంగం చెబుతున్న వివరణ. ఆ మాటతో స్థానిక పార్టీలు ఏకీభవించడం లేదు.

1987 నాటి తప్పులడక కశ్మీర్ ఎన్నికల లానే, ఇప్పుడీ తాజా నిర్ణయం తీసుకున్నారని పోలికలు తెస్తున్నాయి. అప్పట్లో అలా తప్పుదోవలో ఎన్నికల వల్లే, ఆ వెంటనే 1990లలో కశ్మీర్‌లో తీవ్రవాదం చెలరేగిందని పార్టీల వాదన. ఇప్పటికీ ఆ దెబ్బ నుంచి కశ్మీర్ కోలుకోలేదు. మళ్ళీ అదే 1987 నాటి వ్యవహారశైలిలో వెళితే ఉపద్రవమే అని హెచ్చరిస్తున్నాయి. యువతలో నిరుద్యోగం, స్థానికంగా పెరుగుతున్న అశాంతి సహా కశ్మీర్‌లో అనేక సమస్యలున్నాయి. 20 – 29 ఏళ్ళ మధ్య వయస్కుల్లో 55 శాతం మంది నిరుద్యోగులే. జాతీయ సగటుతో పోలిస్తే ఇది రెట్టింపు. నిరుద్యోగ యువతకు ఆర్థిక అవకాశాల కల్పన, కశ్మీర్‌ను మళ్ళీ పర్యాటక స్వర్గంగా మార్చడం లాంటి అనేక సవాళ్ళు రానున్న సర్కారుకున్నాయి. వీటన్నిటినీ పరిష్కరించడానికి ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వం కావాలి.

కశ్మీర్ ఎన్నికల నిర్వహణ ఓ బృహత్తర కార్యం అంటున్నది అందుకే! ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం నిష్పాక్షిక అంపైర్‌లా వ్యవహరించడమే కాదు... కనిపించాలి, అందరికీ అనిపించాలి కూడా! ప్రస్తుతం ప్రత్యేక ప్రతిపత్తి లేనందు వల్ల దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లానే జమ్మూ– కశ్మీర్‌లోనూ మామూలుగా నివసిస్తున్న వారందరికీ ఓటు హక్కునివ్వడం సరైన చర్యే కావచ్చు. అక్కడ సాధారణ పరిస్థితులు తీసుకురావడానికే ఈ చర్యలనీ చెప్పవచ్చు. అయితే, ఆలోచనతో పాటు ఆచరణలోనూ చిత్తశుద్ధి, ముందు జాగ్రత్త అవసరం. కశ్మీర్‌లో రాజకీయ ప్రక్రియకు ఊతమివ్వడానికే ఈ ఓటర్ల జాబితా సవరణ అనుకున్నా, అందుకు సంబంధిత వర్గాలన్నిటినీ ఒప్పించి, ఒక్క తాటి పైకి రప్పించడం కీలకం. రేపు ఎన్నికల ఫలితాలకు జనామోదం ఉండాలంటే, సుస్థిర ప్రభుత్వం ఏర్పడాలంటే, శాంతి నెలకొనాలంటే అది తప్పనిసరి.

2014 తర్వాత ఎన్నికలే జరగని కశ్మీర్ మెరుగైన ప్రాథమిక వసతులు, జీవన ప్రమాణాల కోసం ఎదురు చూస్తోంది. రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని స్థానిక ప్రజల, పార్టీల దీర్ఘకాలిక డిమాండ్. కేంద్రం సైతం కశ్మీర్‌ను మళ్ళీ పట్టాలెక్కించేందుకు కంకణబద్ధులమై ఉన్నామంటూ పార్లమెంట్‌లో చాలాకాలం క్రితమే రోడ్ మ్యాప్ ప్రకటించింది. అపనమ్మకాన్ని పోగొట్టి, ఆ మార్గాన్ని సుగమం చేయడం అటు కేంద్రం, ఇటు ఎన్నికల సంఘం చేతుల్లోనే ఉంది. ఏ నిర్ణయం తీసుకున్నా పారదర్శకంగా ఉండాలి. స్థానిక ప్రజల, పార్టీల అనుమానాలన్నిటినీ ముందే నివృత్తి చేయాలి. మూడేళ్ళలో 25 లక్షల్లో పెరిగాయంటున్న ఈ ఓటర్ల లెక్కను చర్చకు పెట్టి, అవసరమైతే ప్రక్రియలోనూ, లెక్కల్లోనూ తప్పులు సరిదిద్దుకోవాలి. ఇవన్నీ చేసినప్పుడే అన్ని పక్షాల నమ్మకం చూరగొనడం సాధ్యం. ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయంగా ఉంటేనే, ఎన్నికైన ప్రభుత్వానికీ విశ్వసనీయత. అదే లేకుంటే, ఎన్నికలు పెట్టినా మిగిలేది అనుమానాలు, ఆరోపణలే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణమాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.5.54 వరకు, తదుపరి ద్వాదశి **నక్షత్రం:** ఆరుద్ర ఉ.11.37 వరకు, తదుపరి పునర్వసు **వర్జ్యం:** రా.12.56 నుండి 2.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

సమానతా భారత్ సాకారమయ్యేనా?

అభిప్రాయం



కనిమొళి కరుణానిధి

స్వాతంత్య్రం ప్రతి ఒక్కరికీ అవకాశాలిస్తుంది. ఉదాహరణకు, ఒక మతానికి కట్టుబడి ఉండటం, నచ్చిన విధంగా జీవించడం, దేశ సంపద సృష్టిలో పాలుపంచుకోవడం వంటివి. అయితే ప్రస్తుతం మతపరమైన వివక్ష, జనాభాలో 10 శాతం మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం కావడం వంటివి కనిపిస్తున్నాయి. దీనికి కారణం అందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అనే చోదక శక్తుల లేమి. దేశాభివృద్ధి ప్రయాణంలో లోటుపాట్లను ఎత్తి చూపే భావవ్యక్తీకరణ స్వాతంత్య్రం ఉన్నప్పుడే అన్ని రంగాల్లో నిజమైన అభివృద్ధి సాధ్యం. కానీ విమర్శకులు ఈరోజు జైలుపాలవుతున్నారు.

నూరు సంవత్సరాల భారత్... అంటే అది నాకు సంబంధించినంత వరకు శక్తిమంతమైన ఆలోచన. బంగాళాఖాతాన్ని నేను చూస్తున్నప్పుడు, సముద్రం దాని ధ్రువాన్ని లేదా అంచును తాకడానికి సాగుతున్నట్లు కనిపిస్తుంది. ఈ తీరం నుంచే నా కోరికల జాబితా ఆకాశాన్ని తాకుతుంటుంది. సహజంగానే ఇక్కడ అనేక ప్రశ్నలున్నాయి. వృద్ధి అనేది ఎంత సమ్మిళితంగా ఉంటుంది? మన సమాజంలో మార్పు సామాజిక న్యాయ పంథాలో సాగుతోందా? సమానత్వం అనేది సమాజ చలనసూత్రానికి కేంద్ర బిందువుగా ఎలా ఉండబోతోంది? ఈ ప్రశ్నలను ఆధారంగా చేసుకుని, మన సమాజ వృద్ధి, పురోగమన చలనం అనే ఒక సంక్లిష్ట వ్యవహారంగా మారుతున్నాయి. జాతీయ పురోగతికి నారీ శక్తిని అనుసంధానించడం ద్వారా మూలాలు అత్యున్నత శిఖరాలను చేరుకున్నట్లుంది. ప్రధాని ఈ ఆకాంక్షను చక్కగా పసిగట్టారు కదా! స్వాతంత్య్రం సిద్ధించి నూరేళ్ళ పూర్తయ్యే సమయానికి అనేక ప్రభావిత రంగాల్లో భారత్ అత్యంత చోదక శక్తుల్లో ఒకటిగా ఉంటుందనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. కొన్ని అంతర్జాతీయ సంభాషణల్లో భారత్ ఒక తప్పనిసరిగా వినాల్సిన స్వరంగా ఉంటోంది. కానీ 2047 నాటికి ఇదే స్వరం మరి కొన్ని వందల డెసిబెల్స్ స్థాయిలో మార్మోగుతుందని నేను భావిస్తున్నాను. వాతావరణ మార్పు, పెరుగుతున్న అసమానతా స్థాయులు, భౌగోళిక రాజకీయ మండలాల్లో ఎగుడుదిగుడులు వంటి అంతర్జాతీయ సవాళ్లను చూసినట్లయితే... భారత యూనియన్ లోపల ఇప్పుడు అవసరమైన స్నేహభావాన్ని సులభమైన పదాల్లో వివరించలేం.

ఈ ప్రయాణం కోసం ఇండియా ప్రాజెక్టు మూల్యం చెల్లించవలసి ఉంటుంది. అది ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశ సంపద సృష్టిలో 33 శాతం వాటా కలిగిన... ఒక్క శాతం మంది దీని సంగతి చూసుకుంటారని కొందరనవచ్చు గాక. కానీ అనేక ఏళ్లుగా ప్రజా జీవితంలో గడిపిన నేను ఇది చాలదని అనుకుంటున్నాను. ప్రతి వ్యక్తీ భారత్ చెల్లించవలసిన మూల్యంలో భాగస్వామి అయినప్పుడే ఈ చెల్లింపు సాధ్యమవుతుంది.

ఏ దేశమైనా సరే, అభివృద్ధి సాధించాలంటే అందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అనే రెండు ప్రధాన పాత్ర పోషిస్తాయి. మందబలం ఉన్న వారి భుజబల ప్రదర్శనకు వ్యతిరేకంగా వైఖరి తీసుకోవడంలో సమాజ ఇంగిత జ్ఞానానికి సంబంధించినంత వరకు చరిత్రలో ఈ క్షణం ఒక శంఖారావం లాంటిది. నిరంకుశ చట్టాలతో స్వారీ చేయడం, సమాజం ముక్కలుగా చీల్చివేయడాన్ని తారస్థాయికి తీసుకెళుతున్నారు. జనాభాలో 10 శాతం మంది దేశ సంపదలో 64.6 శాతం సంపదను సృష్టిస్తున్నారు. అదే దిగువ భాగంలో ఉంటున్న 50 శాతం మంది ప్రజలు కేవలం 5.9 శాతం సంపదను మాత్రమే సృష్టిస్తున్నారు. ఆర్థిక వృద్ధి ఇంకా సమ్మిళితం కాలేదు. అంటే అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం దీంట్లో ఇంకా



సాకారం కాలేదు. ఫలితంగా అసమానతలను ఇది ఇంకా విస్తృతం చేస్తుందన్నమాట. కాబట్టే ఇండియా ప్రాజెక్టును ఇంకా విభిన్న స్థాయికి తీసుకెళ్లడంలో ఇది మార్గదర్శకంగా పనిచేస్తుంది. దేశం శాఖోపశాఖలుగా చీలిపోతే చరిత్రలో అంధకార యుగాలతోనే పోల్చి చూడగలం. ఆర్ఎస్ఎస్ స్వాతంత్య్రానికి పెద్దగా దోహదం చేయలేదని డి. రాజా చెప్పారు. కానీ ఇప్పుడు అదే ఆరెస్సెస్ స్వాతంత్య్ర సమర వారసత్వాన్నే ప్రమాదంలో పడవేస్తోంది కదా?

సామాజిక న్యాయం గురించి ఇంకా విస్తృత స్థాయిలో సంభాషించడానికి ఇది తిరిగి మేల్కొల్పవలసిన సమయం. ఇంత పెద్ద రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో దార్శనిక పత్రంలో సామాజిక న్యాయానికి ఎలాంటి ప్రత్యామ్నాయమూ లేదు. రాజ్యాంగ ప్రవేశిక తొలి భాగమే ఏం చెబుతోందంటే ''...పౌరులందరికీ న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను పదిలపర్చడం...'' సామాజిక న్యాయం సమానత్వానికి హామీ ఇస్తుంది. తదుపరి 25 సంవత్సరాలు ఆ తర్వాత ఒక్కొక్క రోజు గడిచే కొద్దీ సమాజంలో సానుకూల మార్పుకు ఉత్ప్రేరకం ఏమిటంటే, సమగ్రవృద్ధికి హామీ పడటమేనని ఇది భారత పౌరులకు తెలుపుతుంది.

సామాజిక న్యాయంలో మూలాలు కలిగిన అభివృద్ధికి విజయవంతంగా పునాది వేయడం వల్లనే తమిళనాడులో కొన్ని దశాబ్దాలుగా సాధించిన వృద్ధి సాధ్యమైంది. పెరియార్‌తో సహా, కామరాజర్, సీఎన్ అన్నాదురై, కలైజ్ఞర్ ఎం. కరుణానిధి వంటి నేతలు ప్రజాస్వామ్య సమ్మిళిత స్వభావానికి ప్రతినిధులుగా ఉంటూ వచ్చారు. ఉదాహరణకు, తమిళనాడులో ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించడానికి కరుణానిధి తీసుకున్న చొరవ ఆనాటికి వెనుకబడివున్న ప్రతి ఒక్కరికీ అవకాశాలను కల్పించింది. తక్కువ ఫీజులతో వైద్య విద్య చదవాలనుకున్న ప్రతి ఒక్క పిల్లాడికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈరోజు 'నీట్' ఆ వ్యవస్థను విధ్వంసం చేయడానికి ప్రవేశించింది.

మన చరిత్ర శకలం పితృస్వామిక రంగుతో రూపొందింది. దీనివల్లే మార్పులు చోటు చేసుకోవడం కష్టమవుతోంది. ఈ దేశంలో 18 శాతం మంది మహిళలు మాత్రమే నేటికీ వేతన రూపంలోని ఆదాయాలను ఆర్జిస్తున్నారు. ఉద్యోగాల లేమి, నైపుణ్య స్థాయుల విషయంలో... వ్యవస్థ దురభిమానాలు, వేతనం చెల్లించని కుటుంబ విధుల వంటివి మహిళలకు ప్రాధాన్యం లేకుండా చేస్తున్నాయి. 2047 నాటికి మార్పు వస్తుందని నేను భావిస్తున్నాను. 33 శాతం రిజర్వేషన్ అనేది వాస్తవమవుతుందని భావిస్తున్నా. అప్పుడు 50 శాతం వాటా కోసం బలంగా కృషి చేయాలి. ప్రాథమిక స్థాయిలో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వల్ల ఉత్పత్తిలో గణనీయంగా పెరుగుదల నమోదు అవుతోంది. కానీ మీరు లోతుకు వెళ్లే కొద్దీ మరింత ఉత్తమంగా ఉంటుందని మీరు అర్థం చేసుకుంటారు. ఈ ప్రభావం ఆర్థికవ్యవస్థపై గణనీయంగా ఉంటుందని ఆర్థికవేత్తలంటుంటారు. దీని ప్రతిఫలనం ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలిగిస్తుంది.

స్వాతంత్య్రం దాని స్వభావ రీత్యానే ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఇస్తుంది. ఉదాహరణకు, ఒక మతానికి కట్టుబడి ఉండే అవకాశం. తమకు నచ్చిన మతాన్ని ఆచరించేందుకు వ్యక్తులు ఎంపిక చేసుకోవచ్చు. వ్యక్తి స్థాయిలో స్వాతంత్య్రానికి చెందిన నిజమైన అర్థం ఏమిటంటే, అస్తిత్వాలకు అతీతంగా ప్రత్యేకించి మైనారిటీ అస్తిత్వాలకు అతీతంగా హక్కులు, సౌకర్యాలను పంపిణీ చేయడం. 2047 నాటికి, ఎల్‌జీబీటీక్యూ+ కమ్యూనిటీ... అంటే సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటి ఎలాంటి తిరోగమన నిబంధనల ద్వారా సవాలు చేయబడకుండానే సామాజిక, రాజకీయ పరిధిలో జీవితాన్ని సాగిస్తుంది. వ్యవస్థలో సహానుభూతి లేకపోవడం వల్ల, మైనారిటీలను వారికి అర్హమైన గౌరవంతో వ్యవస్థ వ్యవహరించదు. సమానత్వం, సామాజిక న్యాయం ఉన్న చోటే వారి స్వరాలు వినిపిస్తాయి, వారి సమస్యలు ప్రతిధ్వనిస్తాయి.

మన పంథాలో దిద్దుబాటు అవసరం. అప్పుడే మన భవిష్యత్ తరాలు స్వేచ్ఛాయుతమైన, సంపద్వంతమైన సమాజాన్ని చూడగలుగుతాయి. మన రిపబ్లిక్ పౌరులందరినీ కాపాడేలా, శాస్త్రీయ ధృతితో ఈ ప్రయాణంలో తనిఖీకేంద్రాలను అప్రోచ్ అయ్యేలా మనం జాగ్రత్త వహించాలి. చరిత్రను విజేతలే రాస్తారనే ప్రసిద్ధ సూక్తిని నేను గుర్తు చేసుకుంటాను. ఆశావహుల ద్వారా భవిష్యత్తు లిఖితమవుతుందని నా భావన. ఆశావహులకు భావవ్యక్తీకరణ స్వాతంత్య్రం ఉన్నప్పుడే వారు ఆ పని చేస్తారు. భావవ్యక్తీకరణ స్వాతంత్య్రం లేకుండా పోయిన అనేకమంది ఆశావహులు ఈరోజు జైల్లో ఉంటున్నారు. నిరంకుశ రాజ్యవ్యవస్థలో ఈ నిరాకరణకు మూలాలు ఉన్నాయి. కానీ సాహస పదాలను రాయడాన్ని, గట్టిగా మాట్లాడటాన్ని, 2047 వరకు మాట్లాడుతుండటాన్ని మనం కొనసాగిస్తుంటాం. దీనికోసం తమిళ కవి సుబ్రహ్మణ్య భారతీయార్ మాటలను మనసులో ఉంచుకోవాలి. దారిద్ర్యంలో లేదా బానిసత్వంలో ఏ ఒక్కరూ ఉండకూడదు. కులం పేరుతో దేశంలో ఎవరూ అణిచివేతకు గురికాకూడదు. విద్యా సంపదను ప్రశంసించుదాం. సంతోషంలో మునిగి తేలుదాం. మనం అందరం ఒకటే అనే విధంగా సమానత్వంలో జీవిద్దాం.

వ్యాసకర్త డీఎంకే పార్లమెంట్ సభ్యురాలు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మండే యూరప్



యూరప్‌లో మండే ఎండల వారం మళ్లీ రానుంది. ఈ ఆగస్ట్ నెల, దీనితోపాటు ఈ మొత్తం వేసవే యూరప్ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు కలిగినదిగా నమోదు కానుంది.
– మైకా రాంటానెన్, వాతావరణ పరిశోధకుడు

ఎటువైపు నిలబడతారు?



వామపక్షీయుల వైఖరి మోసపూరితంగా ఉంటోంది. వాళ్లు నిజానికి విముక్తి వైపు నిలబడాలి. కానీ దానికి బదులుగా ముస్లిం నేపథ్యం ఉన్న అసమ్మతివాదులు మహిళా హక్కులకై చేస్తున్న పోరాటం విషయంలో వారి ధోరణి తిరోగమన దిశలో ఉంది.
– జారా కే, టాంజానియా యాక్టివిస్ట్

స్థాయి గల సినిమా



కేవలం రీమేక్ అయినంతమాత్రాన ఒక సినిమా తక్కువైపోదు. గొప్పవాటిని రీమేక్ చేసే సంప్రదాయం ఉన్నదే. 'స్కార్‌ఫేస్' ఒక రీమేక్. 'ఎ స్టార్ ఈజ్ బార్న్, లాస్ట్ ఆఫ్ ద మోహికన్స్, ట్రూ గ్రిట్...' ఇలా ఎన్నో. 'లాల్‌సింగ్ చడ్డా' మంచి సినిమా. విడుదలైనప్పుడు పెద్దగా ఆదరణ లేకపోయినా, కాలక్రమంలో దాని స్థాయి పెంచుకున్న 'షాషంక్ రిడెంప్షన్' మార్గంలో నడిచినా ఆశ్చర్యపోను.
– పర్మీందర్ సింగ్, ఆంట్రప్రెన్యూర్

సేతు బంధనం



'రామ సేతువును ప్రాచీన వారసత్వ కట్టడంగా తేల్చే తుది విచారణను సుప్రీంకోర్టు చేపట్టింది. అవును, కాదు అని ఏదో ఒకటి చెబుతూ ప్రభుత్వం తన అఫిడవిట్ సమర్పించాలని సూచించింది. ఒకవేళ అవును అంటే అది నా విజయం. కాదు అంటే 2024 ఎన్నికల్లో అది మోదీ పరాజయం.
– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

మంత్రాలకు...



ఒకవేళ 190 కోట్ల మంది ముస్లింలు వారి మసీదుల్లో, 100 కోట్ల మంది హిందువులు వారి దేవాలయాల్లో, 250 కోట్ల మంది క్రైస్తవులు వారి చర్చీల్లో మూకుమ్మడిగా కేవలం ఒకే ఒక్క మనిషి క్యాన్సర్ తగ్గాలని ప్రార్థించారనుకో, అది ఫలిస్తుందా? లేదు. వాళ్లు తప్పడు నంబర్‌కు ఫోన్ చేస్తున్నారు. అదే ఆసుపత్రికి చేసే ఒక్క కాల్‌తో ఫలితం ఉండొచ్చు.
– ఇంతియాజ్ మహమ్మద్, నాస్తికుడు

డబ్బులు వాళ్లవే!



'ఉచిత' రాజకీయాల గురించి తమిళ నాడును విమర్శిస్తున్నారు. ఇది చూడండి: 1965లో సగటు ఆదాయం బిహార్‌లో 350 రూపాయలు, తమిళనాడులో 400 రూపాయలు. 2020లో సగటు ఆదాయం: బిహార్– రూ.46,000. తమిళనాడు– రూ.2.25 లక్షలు. 2021లో కేంద్రానికి చెల్లించిన పన్నులు: బిహార్– రూ.2,000. తమిళనాడు– రూ.13,000. విమర్శించే బదులు తమిళనాడుకు ధన్యవాదాలు ఎందుకు చెప్పకూడదు?
– ప్రవీణ్ చక్రవర్తి, రాజకీయ ఆర్థికవేత్త

అణిచివేత కోసమే



ముల్లా జకీర్‌ను అఫ్గానిస్తాన్‌లోని పంజ్‌షీర్, అంద్రాబ్ ప్రాంతాల్లోని సైనిక కార్యకలాపాల అధిపతిగా నియమించారు. ఈ జకీర్ తన కర్కశత్వానికి పేరొందిన కమాండర్. అంద్రాబ్, పంజ్‌షీర్ ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రతిఘటనను తాలిబన్ నాయకత్వం గట్టిగా అణిచేయాలనుకుంటోందని ఈ నియామకాన్ని బట్టి అర్థమవుతోంది.
– బషీర్ అహ్మద్ గ్వాఖ్, జర్నలిస్ట్

అక్షర యోధుడు

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కలాన్ని ఎక్కుపెట్టి ప్రాణాలు వదిలిన జర్నలిస్ట్ యోధుడు షోయబుల్లాఖాన్. ఖమ్మం జిల్లా సుబ్రవేడులో 1919 అక్టోబర్ 17న జన్మించారు. డిగ్రీ పూర్తయిన తర్వాత 'తేజ్' పత్రికలో చేరారు. రజాకారుల, భూస్వాముల ఆగడాలపై ప్రతిరోజూ రాసేవారు. అందుకే 'తేజ్'ను నిజాం ప్రభుత్వం నిషేధించింది. దీంతో 'రయ్యత్' పత్రికలో చేరారు. అక్కడ షోయబుల్లాఖాన్ అక్షరాలు కట్టలు తెంచుకున్నాయి. ఆ పత్రికపైనా వేటు పడింది. బూర్గుల రామకృష్ణారావు సహాయంతో... భార్యా, తల్లి నగలు అమ్మి 1947 నవంబర్ 17న 'ఇమ్రోజ్' పత్రికను స్థాపించారు. అందులో షోయబుల్లాఖాన్ పెన్ను గన్నయింది. ఖాసిం రజ్వీ నుండి బెదిరింపు లేఖ వచ్చింది. ఎర్రకోటపై నిజాం జెండా ఎగరవేస్తానన్న రజ్వీ ప్రకటనను తన పత్రికలో తీవ్రంగా వ్యతిరేకించారు.

నిజాంను వ్యతిరేకిస్తూ వార్తలు రాస్తే చేతులు నరికేస్తామనీ, పత్రికను సర్వనాశనం చేస్తామనీ రజ్వీ బహిరంగంగానే బెదిరించాడు. అయినా షోయబుల్లాఖాన్ తగ్గలేదు. 1948 ఆగస్టు 22న కాచిగూడలోని పత్రిక ఆఫీసు నుంచి అర్ధరాత్రి ఇంటికి బయలుదేరిన ఆయనపై పదిమంది దాడి చేసి చేతులు నరికి, బుల్లెట్ల వర్షం కురిపించారు. ధర్మానిదే గెలుపు అని కన్నుమూసిన షోయబుల్లాఖాన్‌కు ఇవే మా ఘన నివాళులు.

– ఎం. సత్యనారాయణ, హైదరాబాద్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సారాంశం
సరికొండ చలపతి

75 ఏళ్లుగా ఉరుకుతున్నా... ఉన్నకాడే!

జెండా పండుగ అయిపోయింది..
ఇక ఆ రంగు లైట్లు ఆర్పేసి ఇటు రండి..
తొమ్మిదేళ్ల దళిత విద్యార్థి ఇంద్రా మేఘ్వాల్ చిత్రపటం వద్ద పెట్టిన కొవ్వొత్తుల వెలుగులో... చీకట్లు చూద్దాం. ఒక గ్లాసుడు నీళ్ల.. పోయిన చిన్న ప్రాణం. అగ్రవర్ణం దాహార్తికి చిన్నబోయిన త్రివర్ణాలు కనిపిస్తాయి. ఇది '..అనుకోని సంఘటన' అని సర్దిచెప్పుకునే లోపే.. 'కాదు.. అనునిత్యమే' అన్నమాట రీసౌండ్‌లా 'జనగణమన' కన్నా ఎక్కువ శబ్దంతో మన చెవుల్లో మారుమోగుతుంది. – ఇదీ సామాజిక భారతం

రోడ్లపై వేలాది జెండాల ప్రదర్శనలు, వాట్సాప్ డీపీలు, ధగధగా మెరిసే కాంతుల అలంకరణలు, గొప్పగా సంబురాలు.. వీటన్నిటి మధ్య బిల్కిస్ బానో సామూహిక అత్యాచార దోషులకు స్వాతంత్య్ర దినోత్సవం ఇచ్చిన స్వేచ్ఛావాయువులు. వారి మెడలో పూలదండలు, పంచుకున్న మిఠాయిలు.. అమృతోత్సవాలను చేదెక్కించలేదూ! – ఇదీ రాజకీయ భారతం

'కలకత్తా ఫుట్‌పాత్‌లపై
ఎందరో గాలివానల్లో తడుస్తున్నారు
వాళ్లను అడగండి పదిహేను ఆగస్టు
గురించి ఏమంటారో..'
.. 1947లో స్వాతంత్య్రం వచ్చిన రోజున మాజీ ప్రధాని వాజ్‌పేయి రాసుకున్న కవిత ఇది.. ఉత్సవాలు జరిగిన మరునాడే (ఆగస్టు 16న) వాజ్‌పేయి వర్ధంతి జరిపినవారిలో ఎవరైనా.. ఆయన గుర్తుగానైనా.. ఫుట్‌పాత్‌లపై ఉన్న వారిని అడిగి ఉంటారా '..ఆగస్టు 15 గురించి ఏమంటారూ' అని..

– వృద్ధిరేటు 75 ఏళ్లుగా పెరిగీ పెరిగీ హైరైజ్ భవనాల్లో చిక్కుకునిపోయిందని, అక్కడి నుంచి ఫుట్‌పాత్ దాకా రాలేదని తెలిసేది కదా!
– ఇదీ ఆర్థిక భారతం

'..దేశభక్తి, అఖండత అని ఒకటే అంటున్నారు..
మేం దేశభక్తి ఎలా చాటుకోవాలి?
మా ఇంటిపై జెండా ఎగురవేసే కదా..?
మరి జెండా ఎగురవేయడానికి మాకు ఇల్లు ఏది?..'
..ఇది ఏ సామాన్యుడో అన్నది కాదు.. గరీబోళ్ల సీఎం టంగుటూరి అంజయ్య 1970లో అన్నమాట! మరి 'ఇంటింటికీ జెండా పండుగ'.. అంటూ జెండాలు పంచిన నాయకులకు ఈ ప్రశ్న ఏమైనా ఎదురై ఉంటుందా.. బధిర శంఖారావంలా!
– ఇదీ నేటి జన భారతం

హుందాతనం, ఆత్మగౌరవం, సమన్యాయం.. చైతన్యం, సమున్నత మానవ విలువలు, సామాజిక న్యాయం, లౌకిక భావన, సౌభ్రాతృత్వం.. ఆదాయాల్లో, అంతస్తుల్లో, అవకాశాల్లో, సౌకర్యాల్లో.. సమానత్వం తెచ్చుకుందాం అని 75 ఏళ్ల క్రితం రాసుకున్న రాతలు రాజ్యాంగం పుస్తకాన్ని దాటి బయటికి రానట్టున్నాయ్..
– ఇదీ గణతంత్ర భారతం

... వీటన్నింటినీ అంబేద్కర్‌కు వదిలేసి మన నేతలు ఏం చేస్తున్నారో చూడండి.

- గాంధీ, గాడ్సేల ఎత్తును భారతీయత స్కేలుతో కొలిచి.. ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువని తేల్చుకునే పనిలో తీరిక లేకుండా మునిగిపోయారు.
- ఇన్నేళ్లు నెహ్రూ, గాంధీల పాలనలోనే భారతావని నడిచినా.. ఇప్పుడు క్విట్ ఇండియా స్ఫూర్తిగా దేశాన్ని ఏకం చేస్తామంటూ అదే గాంధీలు కొత్తగా 'జోడో యాత్రలు' చేస్తున్నారు.
- గాంధీ, నెహ్రూలపై విద్వేషం చిమ్ముతూ కొందరు.. నెహ్రూ కూడళ్లలో జనగణమన పాడుతూ గాంధీకి వెకిలి మకిలి పూస్తే జాగ్రత అని హెచ్చరిస్తూ మరికొందరు.. 75 ఏళ్ల తర్వాత కూడా అవే పేర్లు, అదే స్మరణ, అదే రాజకీయం..
- 75 ఏళ్ల క్రితం గీసిన విభజన రేఖలు.. ఇప్పుడా దూరాన్ని మరింత పెంచాయి. రెండు వర్గాల మధ్య అపనమ్మకాన్ని, అగాధాన్ని ఎగదోస్తూ.. 'లౌకికం' అన్న మాటను ఫక్తు రాజకీయం చేశాయి. మన మట్టి మీదే పుట్టి పెరిగినా.. త్రివర్ణ పతాకం చేతపట్టి మేమూ భారతీయులమే అని చెప్పుకోవాల్సిన దుఃస్థితికి తెచ్చాయి.
- దేశ విభజన నాటి హింసాకాండ, విధ్వంసాలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. మానిపోతున్న గాయాలను కెలుకుతూ విభేదాలకు ఆజ్యం పోస్తూనే ఉన్నాయి. నాటి దాష్టీకాన్ని నేటికీ అంటగడుతూ.. విచ్ఛిన్నకర శక్తులంటూ పాత కాలపు చర్చను లేవదీస్తూనే ఉన్నాయి.

.. ఇదీ 75 ఏళ్ల భారతం.. స్వేచ్ఛ వచ్చిందనుకున్న తొలిరోజున ఉన్నకాడే.. ఇప్పటికీ ఉన్నామని చెప్పకనే చెబుతున్న తీరు..

ఇది నిజం...
అట్టడుగు వర్గాలను అత్యున్నత పీఠంపై కూర్చోబెట్టి ఆనందపడ్డా, వారి పరిస్థితి ఉన్నకాడే ఉన్నదనడానికి ఇదొక్క 'చిత్రం' చాలదా!



(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యం)

ఇది స్వప్నం..
స్వాతంత్య్రోత్సవాల సందర్భంగా సోషల్ మీడియాలో యువతతో నడిచిన ఓ చిట్‌ఛాట్ ఇది.
'..నేను పుణెలో చదివా, నాలుగేళ్లు బెంగళూరులో, ఇప్పుడు తిరువనంతపురంలో ఉద్యోగం. రేపు ఎక్కడికి వెళ్తానో తెలియదు. నన్ను ఏ ప్రాంతం వాడని అడక్కండి..'
'..ఇదిగో వీడు అబ్దుల్లా.. అమెరికా నుంచి ఈమధ్యే దిగుమతి అయ్యాడు, ఢిల్లీ వాడే అనుకోండి. ఈ అమ్మాయి సారిక, వీడి ఫియాన్సీ. వాళ్లు రాజు, అభిషేక్, శ్రవణ్.. మేమంతా హాస్టల్ మేట్స్.. మమ్మల్ని ఏ కులం, ఏ మతం అని ప్రశ్నించకండి. అవన్నీ పాలిటిక్స్ కోసమే.. మేం భారతీయులం..'
... కెరీర్ గోలలో కొట్టుకుపోతూ దేశం గురించి పట్టించుకోవడం లేదని యువతపై వేస్తున్న అపవాదు నిజం కాదనిపిస్తోంది. వీరిని చూస్తుంటే.. కులం, ప్రాంతం, మతం హద్దులు చెరిపేసుకుని.. అన్ని వర్ణాలనూ త్రివర్ణంలో కలుపుకొని పోతారనే ఆశలు ఇంకా మిణుకుమిణుకుమంటున్నాయి.

క్లుప్తంగా

ఆవుపై పులి దాడి

మెరకముడిదాం: విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామంలో ఆవుపై పులిదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పులిగుమ్మి గ్రామంలోని బూర్లె లక్ష్మణరావుకు చెందిన ఆవు శనివారం పొలానికి మేతకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. లక్ష్మణరావు, అతని కుటుంబ సభ్యులు పొలాలు, గ్రామ పరిసరాలను వెతికినా ఆవు జాడ కనిపించలేదు. గ్రామ సమీపంలోని ఓ తోటలో సోమవారం ఉదయం ఆవు మృతిచెంది, సగభాగం మాత్రమే ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఆవు మృతిచెంది ఉన్న పరిసరాల్లో పులి అడుగులు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు, బుధరాయవలస పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారి సుధీర్‌కుమార్, గార్డులు శ్రీనివాసరావు, రుషి, కిరణ్, మంగమ్మ తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్నది పులి పాదముద్రలుగా నిర్ధారించారు. పులిజాడ తెలుసుకునేందుకు ఆ ప్రదేశంలో ఐదు సీసీ కెమెరాలను అమర్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనంతబాబుకు బెయిల్

- తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అవకాశం
- 25న మళ్లీ సెంట్రల్ జైలులో రిపోర్టు చేయాలని ఆదేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబుకు మూడు రోజులు బెయిల్ మంజూరు చేస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎమ్మెల్సీ అనంతబాబు తల్లి ఈ నెల 21న కాకినాడ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తల్లి అంత్యక్రియలకు అనంతబాబు హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని ఆయన తరఫు న్యాయవాది సోమవారం మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండు వారాలు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కోర్టు విచారణలో అనంతబాబు బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ప్రత్యర్థి న్యాయవాది తన వాదనలు వినిపించారు. అనంతరం అనంతబాబుకు మూడు రోజులు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన తిరిగి ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు సెంట్రల్ జైలులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అనంతబాబును సోమవారం రాత్రి జైలు అధికారులు విడుదల చేశారు.

మహిళల్ని కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- కాకినాడ జిల్లా ఉప్పాడలో తొలి చేయూత మహిళా మార్టు ప్రారంభం



శ్రీనిధి రుణాలను విడుదల చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

పిఠాపురం: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'చేయూత మహిళా మార్టు'లకు శ్రీకారం చుట్టిందని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. కాకినాడ జిల్లా ఉప్పాడలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే తొలి 'చేయూత మహిళా మార్టు'ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు సమీపంలో ఉండేలా.. తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించే మార్టులు ఏర్పాటు చేయాలని గతంలో సీఎం జగన్ ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాల సభ్యులను పెద్ద వ్యాపారులుగా తీర్చిదిద్దడానికి మార్టులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. స్థానికులంతా మహిళా మార్టును వినియోగించుకుని మహిళా సంఘాలకు తోడ్పాటునివ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాలతో ఇప్పటికే లక్షాధికారులుగా మారిన అక్కాచెల్లెమ్మలు.. ఈ మార్టుల ద్వారా కోటీశ్వరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టీడీపీ హయాంలో లంచాలిస్తేగాని ప్రజలకు పథకాలు మంజూరు చేసేవారు కాదని.. ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం 28,682 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.83.46 కోట్ల శ్రీనిధి రుణాలను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ చైర్మన్ వి.వేణుగోపాలరావు, స్త్రీ నిధి ఎండీ నాంచారయ్య, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత జేఏసీ పేరిట దొంగ ఉద్యమాలు చేయిస్తున్న బాబు

694వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ : ఏటా మూడు పంటలు పండే భూములను నాశనం చేసి అడవిలా చేసిన చంద్రబాబును నిలదీయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 694వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సింగపూర్, జపాన్, మలేషియా వంటి రాజధానిని నిర్మిస్తున్నానని నమ్మించిన చంద్రబాబు.. ఈ ప్రాంత ప్రజలను నిలువునా ముంచేశాడని మండిపడ్డారు. అమరావతి ఉద్యమం పేరుతో టీడీపీ ముసుగులో ఉన్న బినామీ రైతులు నిజమైన రైతుల ప్రయోజనాలకు గండి కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలను అణగదొక్కి వారి పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువులు అందకుండా, రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందకుండా అడ్డుకునేందుకు కులవాదులు వేసిన తప్పుడు కేసుల్లో మంచి న్యాయవాదులను పెట్టి వాదించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని విన్నవించారు. అమరావతి ఉద్యమానికి ఓ సామాజిక వర్గం మినహా మిగిలిన వర్గాల అండ లేకపోవడంతో బాబు దళిత దళారులను అడ్డుపెట్టుకుని ప్యాకేజీలిచ్చి మరీ దళిత జేఏసీ పేరిట దొంగ ఉద్యమాలు చేయించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వ తప్పిదం వల్లే పోలవరం జాప్యం

- కాఫర్ డ్యామ్ పూర్తి కాకుండా డయాఫ్రమ్ వాల్ చేపట్టడం చారిత్రక తప్పిదం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ఏలూరు(మెట్రో): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి తెలుగుదేశం ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదమే ప్రధాన కారణమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో తమ పార్టీకే చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. ఏలూరులో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు పరిధిలో నిర్మించిన జిల్లా డేటా కేంద్రాన్ని మంత్రి రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు తాను మూడు ప్రశ్నలు వేస్తున్నానని, విభజన చట్టం ప్రకారం కేంద్రం నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టును తామే నిర్మిస్తామని టీడీపీ ప్రభుత్వం ఎందుకు ప్రకటించిందని, ప్రాజెక్టును 2018లోగా పూర్తిచేస్తామని చెప్పి ఎందుకు పూర్తి చేయలేదని, కాఫర్ డ్యామ్ పూర్తికాకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ఎందుకు చేపట్టారని అంబటి ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం తప్పిదం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, డయాఫ్రమ్ వాల్ ఏమేర దెబ్బతిన్నదన్న విషయాన్ని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం డయాఫ్రమ్ వాల్ నిర్మించడంలో తప్పిదంతో పాటు.. భారీ వర్షాలు, వరదల కారణంగా లోయర్ కాఫర్ డ్యామ్ పూర్తి కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో ఉందని అంబటి చెప్పారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల నాని, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి

నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపు


కైలాష్ సత్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న వీఎస్ రావు, నారాయణరావు

మంగళగిరి: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన మన దేశంలో బాల కార్మికుల పరిస్థితి దారుణంగా మారకముందే సమస్య పరిష్కారానికి యువత నడుం బిగించాలని నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం 'భవిష్యత్ తరాల అభివృద్ధి–యువ నాయకత్వం' అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులు, ప్రొఫెసర్లను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని పిల్లలపై హింస అనేక రీతులలో ఇంకా కనిపిస్తోందని, పిల్లలు అమ్ముబడుతున్నారని ఈ పరిస్థితి అత్యంత దయనీయంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 160 మిలియన్ల పిల్లలు స్కూళ్లకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. 200 మిలియన్ల పిల్లలు దారిద్ర్యం బారిన పడి చదువులకు దూరమయ్యారన్నారు. ఈ నేపథ్యంలో యువతరం బాలల సంరక్షణ, వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జాతి నిర్మాణానికి, భావిభారత పునర్ నిర్మాణానికి కంకణబద్ధులు కావాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి భవిష్యత్‌లో నోబెల్ గ్రహీత ఉద్భవించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయ శిక్షణ వంటి వాటికి మరింత పెట్టుబడులు పెట్టి విద్యలో నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణన్, వీసీ వీఎస్ రావు, ప్రోవీసీ డాక్టర్ నారాయణరావు కైలాష్ సత్యార్థికి జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులను బీసీల్లో చేర్చడం హర్షణీయం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): మున్నూరు కాపులను బీసీ–డీలో చేర్చడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ నుంచి విలీనమై, తీవ్రమైన వెనుకబాటును ఎదుర్కొంటున్న మున్నూరు కాపు కులాన్ని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం ఉత్తర్వులివ్వడాన్ని ఆయన అభినందించారు. కాపుల్లోని వివిధ వర్గాల అభివృద్ధి పట్ల వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఈ నిర్ణయం అద్దం పడుతోందని తెలిపారు.

రిషికొండ వెళ్లేందుకు నారాయణకు అనుమతి ఇవ్వండి

పర్యాటక శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని రిషికొండపై పర్యాటక శాఖ చేపట్టిన రిసార్ట్ పునరుద్ధరణ పనుల పరిశీలనకు వెళ్లేందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణకు అనుమతినివ్వాలని హైకోర్టు సోమవారం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించింది. పనుల పరిశీలనకు వెళుతున్నట్లు అధికారులకు ముందస్తు దరఖాస్తు చేసుకోవాలని నారాయణను హైకోర్టు ఆదేశించింది. ఆ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని తగిన అనుమతులు ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిషికొండ రిసార్ట్ ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనుల పరిశీలన నిమిత్తం తాను అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నానని, ఈ పర్యటన సందర్భంగా ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని కోరుతూ నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం మరోసారి విచారణ జరిపిన జస్టిస్ రాయ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

కంచి పీఠాధిపతి దీక్ష మన అదృష్టం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని దర్శించుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి దంపతులు

కాకినాడ రూరల్ : కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి కాకినాడ జిల్లాలో చాతుర్మాస్య దీక్ష చేపట్టడం మన అదృష్టమని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీగోశాలలో సోమవారం కంచి పీఠాధిపతిని సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారికి స్వామీజీ ఆశీర్వచనాలిచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కొద్ది సేపు స్వామిజీతో ధార్మిక విషయాలపై సుబ్బారెడ్డి చర్చించారు. గోశాలలో గోవులకు గ్రాసం తినిపించారు. అనంతరం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉండాలని దీక్ష చేపట్టినట్లు స్వామిజీ తెలిపారని చెప్పారు. ఈ ప్రాంతంలో కొన్ని ఆలయాలు అభివృద్ధికి స్వామీజీ సూచనలిచ్చారని, శ్రీశైలం, మహానంది తదితర చోట్ల కుంభాభిషేకాలు నిర్వహించాలని చెప్పారని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ఆలయాల్లో హోమాలు చేయాలని స్వామీజీ సూచించినట్టు తెలిపారు. ఈ విషయాలను సీఎం వైఎస్ జగన్, దేవదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని సుబ్బారెడ్డి చెప్పారు. స్వామిజీని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పర్వత పూర్ణచంద్రప్రసాద్, పెండెం దొరబాబు, ఎంపీ వంగా గీత, కాకినాడ మేయర్ సుంకర శివప్రసన్న, కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తదితరులున్నారు.

మృగాడికి పదేళ్ల జైలు

- 2021లో బధిరురాలిపై అత్యాచారం
- 'దిశ' ద్వారా 50 రోజుల్లోనే చార్జిషీట్
- నేరస్తుడు మహేష్‌కు శిక్ష విధించిన కోర్టు


మహిళా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజనకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం క్రైం/పుట్టపర్తి: బధిరురాలిపై అత్యాచారం చేసిన నేరానికి మృగాడికి పదేళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో అదనపు జిల్లా సెషన్స్/ఫ్యామిలీ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి డి.తిరుమలరావు సోమవారం తీర్పు చెప్పారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గసికవారిపల్లికి చెందిన ఓ యువతికి చిన్నప్పటి నుంచి మాటలు రావు. ఆమె 2021 అక్టోబర్ 12న ఉదయం బహిర్భూమికి వెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన సాకే భద్రయ్య కుమారుడు మహేష్ (36) ఆమెపై అత్యాచారం చేశాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న గ్రామస్తుడు వెంకటనారాయణరెడ్డి గమనించి కేకలు వేయడంతో మహేష్ పరారయ్యాడు. బాధితురాలిని వెంకటనారాయణరెడ్డి ఆమె ఇంటికి తీసుకెళ్లారు. అదేరోజు బాధితురాలి తల్లి బుక్కపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరసింహుడు కేసు (సీఆర్ నంబర్ 109/2021 యు/ఎస్ 342, 376 ఐపీసీ) నమోదు చేసి బాధితురాలిని ఆస్పత్రికి పంపారు. 2021 అక్టోబర్ 14న బత్తలపల్లి మండలం ముష్టూరు క్రాస్ వద్ద నిందితుడు సాకే మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

'దిశ' విజయం

జిల్లా ఎస్పీ ఈ కేసును దిశ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసి బాధితురాలికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించడంతో దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు 2021 అక్టోబర్ 13న కేసు తదుపరి దర్యాప్తు బాధ్యతలు స్వీకరించారు. ఆరుగురు సాక్షులను విచారించి, నేరస్థలంలో సాక్ష్యాధారాలను సేకరించారు. 50 రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి డిసెంబర్ 2న పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తర్వాత కేసు విచారణ అనంతపురం నాలుగో అదనపు జిల్లా సెషన్స్/ఫ్యామిలీ కోర్టుకు బదిలీ అయింది. మొత్తం 14 మంది సాక్షులను విచారించిన తర్వాత సాకే మహేష్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి డి.తిరుమలరావు తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో మూడునెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం జరగడంలో కీలకపాత్ర పోషించిన దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, మహిళా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజన, కొత్తచెరువు సీఐ నరసింహారావు, కోర్టు పీసీ శివ, దిశ పీసీ లక్ష్మీనారాయణలను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్‌సింగ్ అభినందించారు.

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.


పశ్చిమగోదావరి జిల్లా గుమ్ములూరు శివారు తోటమెరకలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


గ్రేటర్ విశాఖ 33వ వార్డులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


అనంతపురం జిల్లా వేపచెర్లలో వృద్ధులకు అందుతున్న లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఎమ్మెల్యే వంశీ సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిక్కవరం పరిధిలోని శ్రీ బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి దేవస్థానం పరిసరాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో హైకోర్టు సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, గనుల శాఖ అధికారులు, కృష్ణా కలెక్టర్ తదితరులతో పాటు ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు వారిని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వల్లభనేని వంశీ ఆదేశాల మేరకు శ్రీ బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి దేవస్థానం పరిసరాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని.. ఈ మైనింగ్ కోసం దేవస్థానాన్ని కూల్చివేశారని, అక్కడ మళ్లీ విగ్రహాలను పునఃప్రతిష్ఠించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఎం.రవికుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని సీజే ధర్మాసనం సోమవారం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులందరికీ నోటీసులిచ్చింది.

క్లుప్తంగా...

ఇద్దరు ఐఏఎస్ అధికారులు సస్పెన్షన్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు ఎ.గోపీకృష్ణ, ఆనంద్‌కుమార్ తివారీని కేంద్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ కుంభకోణం చోటుచేసుకున్న సమయంలో గోపీకృష్ణ ఢిల్లీ ఎక్సైజ్ కమిషనర్‌గా, ఆనంద్‌కుమార్ డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్‌గా పనిచేశారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఈ ఇద్దరు అధికారుల పేర్లు ఉన్నాయి. దీంతో వారిని ప్రభుత్వం విధుల నుంచి తప్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మద్దతు ధరపై సబ్ గ్రూపులు

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధరపై కేంద్రం నియమించిన కమిటీ నాలుగు సబ్ గ్రూపులను ఏర్పాటు చేసింది. సోమవారం జరిగిన కమిటీ తొలి భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జీరో బడ్జెట్ ఆధారిత సాగు, దేశావసరాలకు అనుగుణంగా పంట విధానాల మార్పు, మద్దతు ధరను మరింత ప్రభావవంతంగా, పారదర్శకంగా మార్చడం వంటి పలు అంశాలపై చర్చ జరిగినట్టు కమిటీ సభ్యుడు బినోద్ ఆనంద్ మీడియాకు తెలిపారు. ''హిమాలయ రాష్ట్రాల్లో పంటల తీరుతెన్నులపై ఒక సబ్ గ్రూపు, సూక్ష్మ సాగును రెండోది, జీరో బేస్డ్ సాగును మూడోది, దేశవ్యాప్తంగా పంటల తీరుతెన్నులు, పంటల వైవిధ్యాన్ని నాలుగో సబ్ గ్రూపు అధ్యయనం చేసి నివేదికలు అందజేస్తాయి'' అని వివరించారు. ముందుగా ప్రకటించినట్టుగానే సంయుక్త కిసాన్ మోర్చా ఈ భేటీకి దూరంగా ఉంది.

2న నేవీలోకి ఐఏసీ విక్రాంత్

కొచ్చి: మొట్టమొదటిసారిగా దేశీయంగా నిర్మించిన విమానవాహక నౌక(ఐఏసీ)ని సెప్టెంబర్ 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. కొచ్చిన్ షిప్‌యార్డు లిమిటెడ్(సీఎస్ఎల్)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి ప్రధాని మోదీ నావికాదళంలోకి విక్రాంత్‌ను అధికారికంగా ప్రవేశపెడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశ ప్రథమ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ రిటైర్డు సిబ్బంది, నౌకా నిర్మాణ, రక్షణ శాఖల అధికారులు మొత్తం 2,000 మంది వరకు పాల్గొంటారని చెప్పారు. రూ.20వేల కోట్లతో నిర్మించిన ఈ నౌకను జూలై 28న సీఎస్ఎల్ నేవీకి అప్పగించిన విషయం తెలిసిందే.

సంజయ్ రౌత్ కస్టడీ 5 వరకు పొడిగింపు

ముంబై: శివసేన నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్(60) జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు వచ్చే నెల 5 వరకు పొడిగించింది. ముంబై చౌల్ అభివృద్ధి పనుల్లో అవకతవకలపై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఈనెల ఒకటిన ఈడీ ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆయన జ్యుడీషియల్ కస్టడీ సోమవారంతో ముగియడంతో ప్రత్యేక జడ్జి ఎంజీ దేశ్‌పాండే ఎదుట హాజరుపరిచారు. కేసు దర్యాప్తులో ఉన్నందున కస్టడీని పొడిగించాలని ఈడీ విజ్ఞప్తి చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న జడ్జి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఆయన కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు.


శ్రీలంకను వీడిన చైనా నిఘా నౌక

కొలంబో: శ్రీలంకలోని వ్యూహాత్మకంగా కీలకమైన హంబన్‌టోట పోర్టులో మకాం వేసిన చైనా నిఘా నౌక ఆరు రోజుల అనంతరం సోమవారం అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలు, శాటిలైట్ ట్రాకింగ్ సామర్థ్యం కలిగిన యువాన్ వాంగ్ 5 రాకపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ నౌక హంబన్‌టోటకు ఈనెల 11వ తేదీనే రావాల్సి ఉంది. భారత్ భద్రతాపరమైన ఆందోళనల నడుమ శ్రీలంక అధికారులు అనుమతులను వెంటనే ఇవ్వలేదు. చైనా నిర్వహణలో ఉన్న హంబన్‌టోటకు ఈ నెల 16వ తేదీన చేరుకుని ఇంధనం నింపుకునే కారణంతో సోమవారం వరకు అక్కడే లంగరేసింది. యువాన్ వాంగ్ 5 సోమవారం సాయంత్రం 4 గంటలకు చైనాలోని జియాంగ్ యిన్ పోర్టు దిశగా తిరిగి బయలుదేరి వెళ్లిపోయిందని హార్బర్ అధికారులు వెల్లడించారు. ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం పోర్టులో ఉన్న సమయంలో నౌకలోని సిబ్బందిని మార్చలేదని వివరించారు. తమ ప్రాదేశిక జలాల్లో ఉన్న సమయంలో ఈ నౌకలోని ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ వ్యవస్థ స్విచాన్ చేసి ఉంటుందని, ఎటువంటి పరిశోధనలు జరపరాదనే షరతులతోనే అనుమతులు ఇచ్చినట్లు శ్రీలంక ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే.

టెర్రరిజం కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు ముందస్తు బెయిల్

ఇస్లామాబాద్: టెర్రరిజం కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) చైర్మన్ ఇమ్రాన్ ఖాన్‌కు కొంత ఊరట లభించింది. ఆయనకు మూడు రోజుల పాటు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఇస్లామాబాద్ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వారం రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ ర్యాలీలో ఇమ్రాన్ ప్రసంగించారు. పోలీసులను, న్యాయ వ్యవస్థను, ప్రభుత్వ వ్యవస్థలను దూషిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలీసులు ఆయనపై యాంటీ టెర్రరిజం యాక్ట్ కింద కేసు పెట్టారు. దీనిపై ఆయన ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ మొహిసిన్ అక్తర్ కయానీ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించింది. ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగానే ఇమ్రాన్‌ను వేధిస్తోందని ఆయన తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇమ్రాన్‌కు బెయిల్ ఇవ్వాలని కోరారు. దీంతో ముందస్తు బెయిల్ ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

మిస్టరీ గెలాక్సీ చిక్కింది



ఇంతకాలంగా అందీ అందనట్టుగా తప్పించుకుంటూ వస్తున్న ఓ మిస్టరీ గెలాక్సీ ఆనవాలు ఎట్టకేలకు చిక్కింది. భూమికి 50 కోట్ల కాంతి సంవత్సరాల పై చిలుకు దూరంలో ఉన్న కార్ట్‌వీల్ గెలాక్సీని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా తన కెమెరా కంటిలో బంధించింది. దాని కేంద్రకం వద్ద ఉన్న భారీ కృష్ణబిలం కూడా వెబ్ కెమెరాకు చిక్కింది. ఈ గెలాక్సీని నిత్యం నక్షత్ర ధూళి భారీ పరిమాణంలో ఆవరించి ఉంటుందట. దాంతో హబుల్ వంటి కాకలు తీరిన టెలిస్కోప్‌లు ఎంతగా ప్రయత్నించినా ఇప్పటిదాకా దీన్ని ఫొటోలు తీయలేకపోయాయి. అందుకే ఈ గెలాక్సీ కంటపడటాన్ని చాలా అరుదైన విషయంగా నాసా సైంటిస్టులు అభివర్ణిస్తున్నారు. కోట్లాది ఏళ్లలో కార్ట్‌వీల్ గెలాక్సీ ఎలాంటి మార్పుచేర్పులకు గురవుతూ వచ్చిందీ తెలుసుకోవడానికి జేమ్స్ వెబ్ తీసిన ఇన్‌ఫ్రా రెడ్ చిత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెబుతున్నారు. దాని కేంద్ర స్థానం వద్ద ఏర్పడ్డ కృష్ణబిలం గురించి కూడా విలువైన సమాచారం తెలిసే వీలుందట. అంతేగాక నక్షత్రాల పుట్టుకకు సంబంధించి ఇప్పటిదాకా మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి రావచ్చన్నది సైంటిస్టుల మాట.

అచ్చం బండి చక్రంలా...

వయసు మీదపడుతున్న హబుల్ టెలిస్కోప్‌కు వారసునిగా జేమ్స్ వెబ్ ఇటీవలే అంతరిక్ష ప్రవేశం చేయడం తెలిసిందే. కాలంలో వెనక్కు చూడగల ఇన్‌ఫ్రా రెడ్ సామర్థ్యం దీని సొంతం. దాని సాయంతో మహావిస్ఫోటనం (బిగ్‌బ్యాంగ్) అనంతరం విశ్వం ఆవిర్భవించిన తొలి నాళ్లకు సంబంధించిన ఫొటోను ఇటీవలే జేమ్స్ వెబ్ మనకు అందించిన విషయం తెలిసిందే. అదే మాదిరిగా కార్ట్‌వీల్ గెలాక్సీకి సంబంధించి కూడా దాని ఇప్పటి, సుదూర, సమీప గతాలకు సంబంధించిన ఫొటోలనూ జేమ్స్ వెబ్ స్పష్టంగా అందించగలిగింది. ఈ ఫొటోల్లో కార్ట్‌వీల్ గెలాక్సీ పేరుకు తగ్గట్టుగా అచ్చం బండి చక్రం మాదిరిగానే కన్పిస్తోంది. స్కల్ప్టర్ నక్షత్ర మండలంలోని ఈ గెలాక్సీతో పాటు మరెన్నో ఇతర పాలపుంతలు కూడా నేపథ్యంలో కనిపిస్తుండటం విశేషం. ఒక అతి పెద్ద, మరో బుల్లి గెలాక్సీ ఊహాతీతమైన వేగంతో ఢీకొనడం వల్ల కార్ట్‌వీల్ గెలాక్సీ పురుడు పోసుకుందని సైంటిస్టులు సిద్ధాంతీకరించారు. కానీ దీని ఉనికి చాలాకాలం పాటు మిస్టరీగానే ఉండిపోయింది. అంతరిక్ష ధూళి తదితరాలగుండా సులువుగా పయనించగల పరారుణ కాంతిని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ పట్టుకోగలదు. దాని సాయంతోనే ఎట్టకేలకు అది కార్ట్‌వీల్ ఉనికిని నిర్ధారించి కెమెరాలో బంధించగలిగింది. ఫొటోలో కన్పిస్తున్న నీలి రంగు చుక్కలన్నీ నక్షత్రాలు. కోట్లాది ఏళ్ల కాలక్రమంలో చోటుచేసుకున్న భారీ విస్ఫోటాలు తదితరాల వల్ల కార్ట్‌వీల్ గెలాక్సీలో చోటుచేసుకుంటూ వచ్చిన కీలక మార్పులను ఈ ఫొటోల సాయంతో విశ్లేషించవచ్చట. ఈ గెలాక్సీ చుట్టూ రెండు వెలుతురు మండలాలున్నాయి. కేంద్ర స్థానంలో సంభవించిన మహా విస్ఫోటం ఫలితంగా చెరువులో అలల్లా ఇవి నానాటికీ విస్తరిస్తూ పోతున్నాయట. అందుకే అంతరిక్ష శాస్త్రవేత్తలు దీన్ని రింగ్ గెలాక్సీ అని కూడా పిలుస్తుంటారు. ఇలాంటి ఆకృతులుండే పాలపుంతలు అరుదు. దీనిలోని అంతరిక్ష ధూళికి సంబంధించి లోతైన విషయాలను జేమ్స్ వెబ్ తాలూకు మిడ్ ఇన్‌ఫ్రారెడ్ ఇన్‌స్ట్రుమెంట్ (ఎంఐఆర్ఐ) సాయంతో విశ్లేషించే పనిలో పడింది నాసా.

– నేషనల్ డెస్క్, సాక్షి

బీజేపీలో చేరితే కేసులు ఎత్తేస్తామన్నారు

ఢిల్లీ ముఖ్యమంత్రి పోస్టు ఆఫర్ చేశారు

- రాజ్‌పుత్‌ను.. తల నరుక్కోవడానికైనా సిద్ధమే
- కుట్రదారులు, అవినీతిపరుల ఎదుట తలవంచే ప్రసక్తే లేదు
- ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా స్పష్టీకరణ
- సిసోడియాను సన్మానించాల్సింది పోయి వేధింపులకు గురిచేస్తారా?: కేజ్రీవాల్



న్యూఢిల్లీ/అహ్మదాబాద్: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీని వీడి, బీజేపీలో చేరితే తనపై కేసులన్నీ ఎత్తివేయడంతోపాటు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి కట్టబెడతామంటూ ఆఫర్ ఇచ్చారని చెప్పారు. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల నుంచి విముక్తి కల్పిస్తామంటూ బీజేపీ నుంచే ఈ సందేశం వచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ట్వీట్ చేశారు. అనంతరం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన కేజ్రీవాల్‌తో కలిసి గుజరాత్‌కు వచ్చారు. ''బీజేపీకి నేను ఇచ్చే సమాధానం ఇదే. నేను మహారాణా ప్రతాప్ వారసుడిని. రాజ్‌పుత్‌ను. తల నరుక్కోవడానికైనా సిద్ధమే గానీ, కుట్రదారుల ఎదుట, అవినీతిపరుల ఎదుట తలవంచే ప్రసక్తే లేదు. నాపై పెట్టినవన్నీ తప్పుడు కేసులే. మీకు చేతనైంది చేసుకోండి'' అని ట్విట్టర్‌లో తేల్చిచెప్పారు. బీజేపీ ఇచ్చిన రెండు ఆఫర్లతో తన వద్దకు వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యానికి గురయ్యానని మీడియాతో చెప్పారు. నాయకులను బీజేపీలో చేర్పించడమే ఆ వ్యక్తి పని అన్నారు. ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తనకు రాజకీయ గురువు అని, ఆయన వద్దనే రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నానని, ముఖ్యమంత్రో, ప్రధానమంత్రో కావడానికి రాజకీయాల్లోకి రాలేదంటూ అతడికి తేల్చిచెప్పానని సిసోడియా వెల్లడించారు. తాను నిజాయితీపరుడినని, కేసులతో భయపెట్టలేరని తేల్చిచెప్పారు. దేశంలో ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య నందించాలన్నదే తన కల అని, అందుకోసం కృషి చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు. అయితే, తనకు ఆఫర్ ఇచ్చిన వ్యక్తి ఎవరన్నది సిసోడియా బహిర్గతం చేయలేదు. కాగా, బీజేపీ ఆఫర్‌కు సంబంధించి తమ వద్ద ఆడియో టేపులున్నాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బయటపెడతామని పార్టీలోని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

సిసోడియా భారతరత్నకు అర్హుడు: కేజ్రీవాల్

విద్యాశాఖ మంత్రిగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను మెరుగుపర్చిన మనీశ్ సిసోడియా భారత రత్న పురస్కారానికి అర్హుడని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టంచేశారు. కానీ, కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఆయనను వెంటాడుతోందని ఆక్షేపించారు. సన్మానించాల్సింది పోయి వేధింపులకు గురిచేయడం ఏమిటని నిలదీశారు. కేజ్రీవాల్ సోమవారం అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ విద్యా విధానాన్ని న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రశంసించిందని గుర్తుచేశారు. ఐదేళ్లలో అద్భుతాలు చేసిన వ్యక్తిపై సీబీఐ దాడులు చేయడం మీకు సిగ్గనిపించడం లేదా? అని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 ఏళ్లలో ప్రభుత్వాలు చేయని అద్భుతాలను సిసోడియా చేశారని, ఆయనకు భారతరత్న దక్కాలని ఉద్ఘాటించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిసోడియాతోపాటు తనను కూడా అరెస్టు చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో 27 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపిస్తే నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు

ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాని సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చినట్లుగానే తమ ప్రభుత్వాన్ని సైతం పడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా సీబీఐ, ఈడీతో సోదాలు చేయించారని విమర్శించారు. నిజానికి లిక్కర్ పాలసీకి, సీబీఐ–ఈడీ సోదాలకు సంబంధం లేదన్నారు. 'ఆపరేషన్ కమలం' విఫలమైందని ట్విట్టర్‌లో కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

దమ్ముంటే పేరు బయటపెట్టండి: బీజేపీ

మనీశ్ సిసోడియా ఆరోపణలను బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ఖండించారు. బీజేపీ తరఫున ఆఫర్ ఇచ్చిన వ్యక్తుల పేర్లను దమ్ముంటే బయటపెట్టాలని సిసోడియాకు సవాలు విసిరారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా స్పందిస్తూ.. సిసోడియా మతి భ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. లిక్కర్ పాలసీ వ్యవహారంలో అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఆప్ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఆరోపణలకు సమాధానం చెప్పలేక ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దూరంగా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. మీరు నిజంగా నిజాయితీపరులైతే 24 గంటల్లోగా స్పందించండి అని కేజ్రీవాల్‌కు సూచించారు.

కేజ్రీవాల్ నివాసం వద్ద బీజేపీ ధర్నా

ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ నివాసం వద్ద బీజేపీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఎక్సైజ్ పాలసీని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా ప్రసంగించారు. సీబీఐ నమోదు చేసిన కేసులో మొదటి నిందితుడైన డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును దోచుకొనేందుకు లిక్కర్ మాఫియాకు అనుమతులు ఇచ్చారన్నారు.

భారత పాలకవర్గం నేత హత్యకు ఐసిస్ కుట్ర

రష్యాలో ఆత్మాహుతి దళ సభ్యుడి అరెస్ట్

మాస్కో: భారత పాలక వర్గానికి చెందిన ఒక కీలక నేత హత్యకు కుట్ర పన్నిన ఐసిస్ ఆత్మాహుతి దళ సభ్యుడొకడు రష్యాలో పట్టుబడ్డాడు. మహ్మద్ ప్రవక్తను కించపరిచినందుకే ఐసిస్ ఈ పథకం పన్నినట్లు తేలిందని రష్యా నిఘా సంస్థ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్(ఎఫ్ఎస్‌బీ) సోమవారం తెలిపింది. ఇందుకు సంబంధించి మధ్య ఆసియా దేశానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించినట్లు వివరించింది. ఈ సూసైడ్ బాంబర్‌కు ఏప్రిల్–జూన్ మధ్యలో ఐసిస్ నేత ఒకరు టర్కీలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. ఐసిస్ ప్రతినిధి ఒకరు ఇతడికి టెలిగ్రామ్ మెసెంజర్‌లో చాటింగ్ ద్వారా, టర్కీలో ఉన్న సమయంలో వ్యక్తిగతంగా సైద్ధాంతిక పరమైన బోధనలు చేసినట్లు ఎఫ్ఎస్‌బీ పేర్కొంది. టర్కీ నుంచి రష్యాకు, అవసరమైన పత్రాలు సమకూర్చుకుని అక్కడి నుంచి భారత్‌కు వెళ్లి ఉగ్రచర్యకు పాల్పడాలని ఐసిస్ పురమాయించిన విషయాన్ని ఇతడు అంగీకరించాడని తెలిపింది. ఇందుకు అవసరమైన వస్తుసామగ్రి భారత్‌లోనే అందుతాయని ఐసిస్ నేతలు తెలిపినట్లు కూడా పేర్కొంది. ఇతడి పేరు, ఇతర వివరాలను మాత్రం ఎఫ్ఎస్‌బీ వెల్లడించలేదు. అయితే, విచారణ సమయంలో ఇతడు తెలిపిన వివరాలతో ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేసింది. బీజేపీ ప్రతినిధి నుపుర్ శర్మ, ఆపార్టీ ఢిల్లీ మీడియా చీఫ్ నవీన్ కుమార్ జిందాల్ మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు ముస్లిం ప్రపంచంలో తీవ్ర దుమారం రేపాయి. దీంతో, బీజేపీ నుపుర్ శర్మను సస్పెండ్ చేయడంతోపాటు జిందాల్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. ఉగ్ర సంస్థ ఐసిస్‌పై భారత్ నిషేధం విధించింది.

కేంద్రం–ఢిల్లీ రగడపై సుప్రీం ధర్మాసనం


న్యూఢిల్లీ: దేశ రాజధానికి సంబంధించిన పలు శాఖలపై శాసన, పాలనాపరమైన పెత్తనం విషయమై కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నడుస్తున్న వివాదంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. ఇందుకోసం జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. జస్టిస్ రమణ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ఢిల్లీ ప్రభుత్వం తరఫు న్యాయవాది సోమవారం లేవనెత్తారు. ఈ అంశంపై 2019 ఫిబ్రవరి 14న ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భిన్నమైన తీర్పు వెలువరించారు.

విచారణకు స్వీకరిస్తాం

మనీ లాండరింగ్ చట్టంపై తీర్పును పునఃపరిశీలించాలంటూ దాఖలైన పిల్ విచారణ స్వీకరణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. దాన్ని విచారణ కేసుల జాబితాలో చేరుస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సారథ్యంలోని ధర్మాసనం తెలిపింది.

పార్లమెంటులో లాయర్లు తగ్గుతున్నారు

ఉపరాష్ట్రపతి సన్మాన కార్యక్రమంలో సీజేఐ


ధన్‌ఖడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

న్యూఢిల్లీ: ''పార్లమెంటులో గతంలో న్యాయ కోవిదులు ఎక్కువగా ఉండేవారు. రాజ్యాంగ పరిషత్తులోనూ, స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో కొలువుదీరిన పలు పార్లమెంటుల్లోనూ చాలామంది వాళ్లే. ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని, తిరుగులేని చట్టాలను మనకందించారు. కానీ కొంతకాలంగా పార్లమెంటులో న్యాయ కోవిదుల సంఖ్య బాగా తగ్గుతోంది. ఆ స్థానాన్ని ఇతరులు భర్తీ చేస్తున్నారు. ఇంతకు మించి మాట్లాడబోను'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఉపరాష్ట్రపతిగా ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ గౌరవార్థం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయవాదిగా అపార అనుభవం ధన్‌ఖడ్ సొంతమన్నారు. ''గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఆయన ఎలాంటి రాజకీయ గాడ్‌ఫాదర్లూ లేకుండానే దేశ రెండో అత్యున్నత రాజ్యాంగ పదవిలో కొలువుదీరే స్థాయికి ఎదిగారు. ఇది మన ప్రజాస్వామ్య గొప్పదనానికి, ఉన్నత రాజ్యాంగ విలువలకు తార్కాణం'' అన్నారు. ''ప్రతి సభ్యుడినీ సంతృప్తి పరచడం తేలిక కాదు. కానీ ధన్‌ఖడ్ తన అపార అనుభవం సాయంతో రాజ్యసభ చైర్మన్‌గా రాణిస్తారని, అందరినీ కలుపుకునిపోతారని నాకు నమ్మకముంది. న్యాయవాదిగా అపార అనుభవం, గతంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖను నిర్వహించి ఉండటం ఆయనకెంతో ఉపయోగపడతాయి. అతి త్వరలో రిటైరవుతున్న నేను ధన్‌ఖడ్ పర్యవేక్షణలో రాజ్యసభలో జరిగే నాణ్యమైన చర్చలను టీవీలో చూస్తానని ఆశిస్తున్నా'' అన్నారు. ధన్‌ఖడ్‌ను ఆయన సన్మానించారు. న్యాయ మంత్రి కిరెన్ రిజిజు, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంబార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొంతకాలంగా పార్లమెంటులో చర్చల కంటే అంతరాయాలే ఎక్కువయ్యాయని రిజిజు ఆవేదన వెలిబుచ్చారు. ''చర్చల నాణ్యత బాగా పడిపోయింది. ఇటీవలి దాకా లోక్‌సభతో పోలిస్తే రాజ్యసభ కాస్త ప్రశాంతంగా ఉండేది. ఈ మధ్య అక్కడా గలాభా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సభను అదుపు చేసేందుకు ధన్‌ఖడ్ అనుభవం పనికొస్తుంది'' అని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేసిన ఓ లాయర్ ఉపరాష్ట్రపతి కావడం ఇదే తొలిసారని తుషార్ మెహతా అన్నారు.

కాంగ్రెస్ చీఫ్ ఎన్నికకు 3–4 రోజుల్లో షెడ్యూల్!

అధ్యక్ష బాధ్యతలను రాహుల్ స్వీకరించాలి: గహ్లోత్

న్యూఢిల్లీ/జైపూర్: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధినేతను ఎన్నుకొనేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ ఎన్నికకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్ మరో 3–4 రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు సోమవారం తెలిపాయి. సెప్టెంబర్ 20లోగా నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెప్పారు. ఎన్నిక తేదీపై తుది నిర్ణయం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీదేనని(సీడబ్ల్యూసీ) వెల్లడించారు. కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను రాహుల్ గాంధీ చేపట్టాలని తాము కోరుకుంటున్నట్లు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ వ్యాఖ్యానించారు. రాహుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొనేందుకు పార్టీ నేతలంతా సానుకూలంగా ఉన్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని, పార్టీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించాలని రాహుల్ గాంధీకి అశోక్ గహ్లోత్ విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆయన నిరాకరిస్తే కార్యకర్తలు అసంతృప్తికి లోనవుతారని చెప్పారు.

ఆనంద్ శర్మను బుజ్జగించే యత్నాల్లో కాంగ్రెస్

హిమాచల్ కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ చీఫ్ పదవికి రాజీనామా చేసిన ఆనంద్ శర్మను శాంతింపజేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి రాజీవ్ శుక్లా సోమవారం ఆయన్ను కలిసి, పార్టీ పదవిలో కొనసాగాలని కోరారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా శర్మతో ఫోన్‌లో మాట్లాడి, అనేక అంశాలపై చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో పార్టీ అధినేత్రి సోనియా గాంధీయే అంతిమ నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నాయి.


స్థానికేతరులకు ఓటు హక్కు ఇస్తే ఖబడ్దార్

నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా హెచ్చరిక

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఓటర్ల జాబితాలో స్థానికేతరుల పేర్లను చేరుస్తూ నిర్ణయం తీసుకుంటే సహించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా హెచ్చరించారు. కోర్టుకు వెళ్లయినా సరే కచ్చితంగా అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. స్థానికేతరులకు ఓటు హక్కును ఎలా అడ్డుకోవాలన్న అంశంపై చర్చించేందుకు ఆయన సోమవారం అఖిలపక్ష నాయకులతో సమావేశమయ్యారు. ఈ భేటీకి 9 పార్టీల నేతలు హాజరయ్యారు. జమ్మూకశ్మీర్ ప్రత్యేకతను, గుర్తింపును దెబ్బతీసే చర్యలకు పాల్పడొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఇక్కడ బయటి వ్యక్తులు ఓటు హక్కు ఇవ్వడం తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీని స్థానికేతరుల చేతుల్లో పెట్టొద్దని డిమాండ్ చేశారు.

'పద్మ' నామినేషన్లకు ఆఖరు తేదీ 15

న్యూఢిల్లీ: పద్మ అవార్డులు–2023కు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు, సిఫారసుల స్వీకరణకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు అవకాశం ఉంటుందని కేంద్ర హోం శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డులకు ఆన్‌లైన్ పోర్టల్ https://awards.gov.in ద్వారా మాత్రమే సిఫారసులు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. విశిష్ట సేవలందించిన వారికి దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీలను కేంద్రం ఏటా గణతంత్ర దినోత్సవం నాడు ప్రకటిస్తుంది. ప్రతిపాదనలను, నామినేషన్లను ఇతరుల గురించి, లేదా తమకు తాముగా 800 పదాల్లో వివరిస్తూ పంపుకోవచ్చునని హోం శాఖ తెలిపింది. అదే విధంగా, నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఫారెస్ట్రీ–2022కు, నేషనల్ గోపాలరత్న–2022కు, నేషనల్ వాటర్ అవార్డ్స్‌కు సెప్టెంబర్ 30 ఆఖరు తేదీ అని తెలిపింది. నారీశక్తి పురస్కార్–2023కి అక్టోబర్ 31 చివరి తేదీ అని వివరించింది.



మన సౌరవ్యవస్థలో అతి పెద్ద గ్రహమైన బృహస్పతి ఆనుపానులను పట్టిస్తున్న అత్యంత స్పష్టమైన ఫొటో ఇది. దీన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇటీవల తీసింది. బృహస్పతి తాలూకు వలయాలు, ధ్రువ కాంతులు ఇంత స్పష్టంగా కెమెరాకు చిక్కడం ఇదే తొలిసారి. అంతేగాక దాని తాలూకు బుల్లి ఉపగ్రహాలు, పాలపుంతలు కూడా నేపథ్యంలో కనువిందు చేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఒకే ఫ్రేమ్‌లో వస్తాయని అస్సలు అనుకోలేదని నాసా సైంటిస్టులు సంబరపడిపోతున్నారు. ఫొటోలోని వివరాలన్నీ స్పష్టంగా కన్పించేందుకు దాన్ని డిజిటల్‌గా మెరుగు పరచడంతో పాటు కృత్రిమంగా రంగులద్దారు.

రైతుల 'మహాపంచాయత్'

- ఢిల్లీకి తరలివచ్చిన వేలాదిమంది అన్నదాతలు
- ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన


నిరసనలో పాల్గొన్న రైతులు

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరకు(ఎంఎస్పీ) చట్టబద్ధత, వ్యవసాయ రుణాల మాఫీ, విద్యుత్ (సవరణ) చట్టం–2022 రద్దుతోపాటు ఇతర డిమాండ్ల సాధనే ధ్యేయంగా మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు రైతు సంఘాల పిలుపు మేరకు వేలాది మంది రైతులు ఢిల్లీకి తరలివచ్చారు. సోమవారం జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్నారు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి రైతన్నలు తరలివచ్చారు. నగరంలో ఎక్కువ రోజులు ఉండేందుకే వారు సిద్ధపడి వచ్చినట్లు తెలుస్తోంది. తమ వెంట సంచులు, దుస్తులు తెచ్చుకున్నారు. రైతు సంఘాల నేతలు ఇచ్చిన జెండాలను చేతబూనారు. టోపీలు ధరించారు. జన్‌పథ్ మార్గంలోనూ తిరుగుతూ కనిపించారు. అన్నదాతల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. హామీలను నెరవేర్చడం లేదంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. జంతర్‌మంతర్‌కు చేరుకోకుండా రైతులను పోలీసులు అడ్డుకుంటున్నారని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నేతలు ఆరోపించారు. పోలీసులు మాత్రం ఖండించారు. మహాపంచాయత్ సందర్భంగా దేశ రాజధానిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాము ఎవరినీ అడ్డుకోవడం లేదని చెప్పారు. డిమాండ్లు నెరవేరేదాకా తమ పోరాటం ఆగదని, అందుకోసం పూర్తిస్థాయి సిద్ధమై ఢిల్లీకి చేరుకున్నానని పంజాబ్ రైతు మాఘా నిబోరీ చెప్పారు. ప్రముఖ రైతు సంఘం నేత రాకేశ్ తికాయత్ ఢిల్లీలోకి ప్రవేశించకుండా ఆదివారమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ జామ్

రైతుల మహాపంచాయత్ సందర్భంగా ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు పలు మార్గాల్లో రాకపోకలపై ఆంక్షలు విధించారు. వాహనాలకు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఢిల్లీ బోర్డర్ పాయింట్ల వద్ద 2020 నవంబర్ నాటి దృశ్యాలే మళ్లీ కనిపించాయి. ఘాజీపూర్, సింఘూ, తిక్రీ తదితర బోర్డర్ పాయింట్ల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేసిన తర్వాతే నగరంలోకి అనుమతించారు. సరిహద్దుల్లో వాహనాలు గంటల తరబడి బారులు తీరాయి.

సాక్షి విజయనగరం

మంగళవారం । 23 । ఆగస్టు । 2022

ఐదు అడుగుల అరటిగెల..



చీపురుపల్లిరూరల్(గరివిడి): అరటిగెల సాధారణంగా 3 నుంచి నాలుగు అడుగుల పొడవు ఉంటుంది. అయితే, గరివిడి పట్టణంలోని బద్రీప్రసాద్ కాలనీలో ఓ విశ్రాంత ఫేకర్ ఉద్యోగి ఇంటి పెరటిలోని అరటిచెట్టు ఐదు అడుగుల గెల వేసింది. 300కు పైబడిన పండ్లతో చూపరులను ఆకర్షిస్తోంది.



జన్‌జీవన్ కోసం జల్‌జీవన్

ప్రతి పల్లెకు రక్షిత జలం సరఫరా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. విజయనగరం జిల్లాలో రూ.200.82 కోట్లతో ఇంటింటికీ కుళాయి పనులు శరవేగంగాసాగుతున్నాయి.

- 8లో



బాలుడికి బ్రెయిన్ ట్యూమర్

అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడికి బ్రెయిన్ ట్యూమర్ అని తెలియడంతో ఆ పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వైద్యఖర్చులకు చేతిలో డబ్బులు లేక దాతల సాయం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

24న ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్–2022లో భాగంగా ఫస్టియర్ విద్యార్థులకు ఈ నెల 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షను నిర్వహిస్తామని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షలకు ఫస్టియర్ విద్యార్థులందరూ వారు చదువుతున్న కళాశాలలో హాజరయ్యేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతకుముందు ఈ రెండు పరీక్షలకు హాజరుకాని/అర్హత పొందని విద్యార్థులు కూడా పాత రిజిస్టర్డ్ నంబర్‌తో హాజరుకావచ్చన్నారు. పరీక్షకు హాజరుకాని విద్యార్థులకు ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ ఇవ్వబడదన్నారు.

పెండింగ్ బిల్లులపై ఆరా



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

రామభద్రపురం: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన వివిధ పనుల పెండింగ్ బిల్లులపై జెడ్పీసీఈఓ అశోక్ కుమార్ ఆరా తీశారు. రామభద్రపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణి, ఏపీఓ సుశీలతో సోమవారం మాట్లాడారు. పనులు పూర్తిచేసి ఏడాది అవుతున్నా బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడంపై ప్రశ్నించారు. రూ.కోటి విలువైన బిల్లులకు నాలుగు స్లాట్‌లలో రెండు స్లాట్‌లలో సిమెంట్‌తో పాటు కొంత మొత్తంలో నిధులకు బిల్లులు అప్‌లోడ్ చేశామని, నాలుగో స్లాట్ ఓపెన్ అయ్యేసరికి సర్వర్ పనిచేయక బిల్లులు అప్‌లోడ్ చేయలేకపోయామని ఎంపీడీఓ చెప్పిన సమాధానంపై సీఈఓ అసహనం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అప్‌లోడ్ అయిన రూ.62 లక్షల బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ, ఏపీఓ నిర్లక్ష్యంతో పాటు సాంకేతిక కారణాల వల్ల మిగిలిన బిల్లులు అప్‌లోడ్ చేయలేకపోయారన్నారు. వారం రోజుల్లో స్లాట్ ఓపెన్ అవుతుందని, మొత్తం పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని స్పష్టంచేశారు.

బాధ్యతల స్వీకరణ



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ వీసీ శ్యామలరావు ఆదేశాల మేరకు ఆయన విధుల్లో చేరారు. ఆయన 2003లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జేఎన్‌టీయూ కాకినాడ ఉద్యోగంలో చేరారు. 2004 నుంచి ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేశారు. 2007వ సంవత్సరంలో డిప్యూటేషన్‌పై జేఎన్‌టీయూలో ట్రిపుల్ ఈ విభాగాధిపతిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా, ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జి అధికారిగా, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషిచేస్తానని చెప్పారు. శ్రీకుమార్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వీఎస్ వకుళ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ గురునాథ్ తదితరులు అభినందించారు.

ప్రతి పంటను నమోదు చేయండి

- కలెక్టర్ సూర్యకుమారి



పెంట శ్రీరాంపురం గ్రామంలో వ్యవసాయ సహాయకుడిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

గంట్యాడ: రైతులు పండించిన ప్రతి పంటను ఈ–పంటలో నమోదు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. మండలంలోని నరవ, పెంట, శ్రీరామపురం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌బీకే సిబ్బంది, రైతులతో మాట్లాడారు. ఈ పంట నమోదుపై ఆరా తీశారు. సమగ్ర భూ సర్వే వివరాలపై సర్వే సిబ్బందిని ప్రశ్నించారు. సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలును సాగుచేసేలా ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పుడమితల్లి ఒడిలో...



డైనింగ్ టేబుల్ లేదు.. వడ్డించే వారూ ఉండరు.. కూర్చొనేందుకు సరైన సౌకర్యమూ ఉండదు. అయితేనేం.. తినే ప్రతీ మెతుకులోను అంతులేని ఆనందం వారి సొంతం. పుడమితల్లి ఒడిలో.. చేలగట్లపై సమయానికి తినే పట్టెడు అన్నమే వారికి బలం. ఆ శక్తితోనే ఎంతో మందికి అన్నం పెట్టేందుకు పొలంలో శ్రమిస్తారు. శ్రామిక జీవన సౌందర్యానికి మించినది లేదని చాటిచెబుతారు. విజయనగరం జిల్లా కుమిలి రోడ్డులో పొలం గట్లపై సామూహికంగా భోజనాలు చేస్తూ సోమవారం 'సాక్షి' కెమెరాకు చిక్కిన మహిళా రైతుల చిత్రమే దీనికి సజీవ సాక్ష్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

● ముందస్తు వైద్యం

వర్షాలు కురిసే వేళ.. కలుషిత మేత, నీరు తాగడంతో జీవాలు వ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. జీవాల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ముందస్తుగా ఉచిత వైద్యసేలందిస్తోంది. ఊరూరా పశువైద్య శిబిరాలు నిర్వహించి నట్టల నివారణ మందు వేయిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 6,04,665 జీవాలు ఉండగా వీటిలో గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511 ఉన్నాయి. జీవికి రూ.2.50 పైసల చొప్పున సుమారు రూ.18 లక్షల విలువైన డోసులను సరఫరా చేసింది. ఈ నెల 16న ప్రారంభమైన నట్టనివారణ మందు వేసే ప్రక్రియ ఈ నెల 31 వరకు సాగనుందని పశుసంవర్ధకశాఖ జేడీ వైవీ రమణ తెలిపారు.

– రామభద్రపురం



ఎస్.చింతలవలసలో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

● చకచకా ఈ-క్రాప్



నెల్లిమర్ల మండలం సీతారామునిపేటలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ

జిల్లాలో ఈ–క్రాప్ నమోదు చకచకా సాగుతోంది. సచివాలయ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంటల నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ, పంట రుణాలు, నష్ట పరిహారం, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు వంటి ప్రయోజనాలు రైతులకు చేరాలంటే ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి. రైతులు కూడా బాధ్యతగా ఈ నెల 31లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకునేందుకు చొరవచూపాలని అధికారులు సూచిస్తున్నారు.

– నెల్లిమర్ల రూరల్

వరి సాగుకు మద్దతు

మంచి ధర..



ఈ ఏడాది ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.100 పెంచింది. రైతులు మద్దతు ధర పొందాలంటే ముందుగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. దీనివల్ల ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమవుతాయి. ఈ క్రాప్ సేవలు ఆర్‌బీకేలలో అందిస్తున్నారు.

– కె.మీనాకుమారి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ, విజయనగరం

- వరి ధాన్యం క్వింటాకు రూ.100 పెంపు
- కామన్ రకం రూ.2,040లు
- ఎ–గ్రేడ్ రకం రూ.2,060లు
- తొలిసారిగా క్వింటా రూ.2 వేలు దాటిన ధర
- ఆర్‌బీకేల ద్వారానే కొనుగోలు
- కోటి గోనెసంచుల సేకరణకు యంత్రాంగం చర్యలు
- జిల్లాలో 4.30 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా
- 4 లక్షల టన్నుల కొనుగోలు చేయాలన్నది లక్ష్యం
- ఈ క్రాప్ చేయించుకోవాలని అధికార యంత్రాంగం సూచన



కలుపు తీస్తున్న మహిళలు



బొబ్బిలి:

వర్షాలు అనుకూలిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు నిండడం, సాగునీరు సమృద్ధిగా అందుతుండడంతో జిల్లాలో వరి ఉభాలు చివరి దశకు వచ్చాయి. కొన్నిచోట్ల కలుపు తీత పనులు ప్రారంభమయ్యాయి. ఎరువులు, క్రిమిసంహారక మందులు, ప్రకృతి వ్యవసాయ సేవలు ఆర్‌బీకేల నుంచి అన్నదాతకు అందుతున్నాయి. పొలం పనుల్లో మరింత ఉత్సాహంగా సాగేలా ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర ప్రకటించింది. క్వింటాకు ఒకేసారి రూ.100 ధర పెంచడంతో రైతులు సంతోషపడుతున్నారు. ఈ ఏడాది క్వింటా ధాన్యం ఎ–గ్రేడ్ రకం 2,060లు, కామన్ వెరైటీ రూ. 2,040లు మద్దతు ధరకు ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయనుంది. తొలిసారిగా క్వింటా ధాన్యం రూ.2వేలకు మించి ధర పలకనుండడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

లక్ష్యం.. 4 లక్షల టన్నుల ధాన్యం సేకరణ...

జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఈ ఏడాది 2.30 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 4 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అధికారులు ప్రాథమికంగా లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. మరో వైపు ఖరీఫ్ వరి సాగుకు ఆర్‌బీకేల ద్వారా ఎరువులను సమృద్ధిగా సమకూర్చుతున్నారు. అధిక దిగుబడి సాధించేలా సాగుసూచనలు ఇస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ...

గతంలో వరి మద్దతు ధర ఎప్పుడూ క్వింటాకు రూ.40, రూ.50, రూ.60లు చొప్పున పెరిగేది. ఈ ఏడాది నేరుగా క్వింటాకు రూ.100లు ధర పెరగడంతో రైతుల్లో ఆదాయ ఆశలుచిగురిస్తున్నాయి. గత ఏడాది కామన్ రకం క్వింటా రూ.1940లు, ఏ–గ్రేడ్ రూ.1960లు ధర పలికింది. దీనికి ఈ ఏడాది అదనంగా రూ.100 పెరగనుంది.



వరి చేలు

కోటి గోనె సంచులు అవసరం...

ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం సేకరణకు కోటి గోనె సంచులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 5 లక్షలు మాత్రమే ఉండడంతో పొరుగు జిల్లాల నుంచి గోనె సంచులను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పంట చేతికొచ్చే సమయానికి ఆర్‌బీకేలు, సహకార సంఘాల ద్వారా రైతులకు గోనెలు అందజేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రైతు తను సాగుచేసిన పంటను ఈ క్రాప్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ



కోడూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, అధికారులు

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- కోడూరులో సచివాలయ భవనం ప్రారంభించిన మంత్రి బొత్స

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, దీర్ఘకాలిక ప్రణాళిక, దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గరివిడి మండలంలోని కోడూరు పంచాయతీలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగులతో పలు అంశాలపై సమీక్షించారు. ఉద్యోగుల విధులు, ప్రజలకు అందించాల్సిన సేవలను సభాముఖంగా ఉద్యోగులతో తెలియజేశారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దిశయాప్ పనితీరును పరిశీలించారు. సచివాలయ వ్యవస్థతో నీతివంతమైన పాలన అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం ఉద్దేశంగా పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే తప్ప సంక్షేమ పథకాలు అందేవి కాదని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఉండే ప్రతీ ఒక్కరూ బాగా చదువుకుని ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబం ఆర్థిక స్థితిగతులు మారుతాయని, గౌరవం పెరుగుతుందన్నారు. మూడేళ్లలో కోడూరు గ్రామ ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల కింద సుమారు రూ.15కోట్ల ఆర్థిక లబ్ధి కల్పించినట్టు వెల్లడించారు. అవినీతి రహిత ఆదర్శపాలన అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మీ ఆశీస్సులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ రైతు తాను సాగుచేసిన ప్రతీ పంటను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల విపత్తుల సమయంలో నష్టపరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర లభిస్తుందని చెప్పారు.

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి వద్దకు ప్రభుత్వ సేవలందించేకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అర్హులందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలను చేరవేస్తోందని చెప్పారు. ప్రతీనెల ఒకటో తేదీన పింఛన్ అందించడంతో పాటుగా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, సర్పంచ్ గేదెల కృష్ణవేణి, మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాములునాయుడు, వెంకట అప్పలరాజు, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీఓ అప్పారావు, జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి వైవీ రమణ, ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పులిగుమ్మిలో అలజడి





పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు, (ఇన్‌సెట్లో) పులిగుమ్మిలో పులి పాదముద్ర

- మూడురోజుల కిందట ఆవుపై దాడి
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం
- భయాందోళనలో గ్రామస్తులు

మెరకముడిదాం: మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామంలో పులి అలజడి రేపింది. మేతకోసం వెళ్లిన ఆవును సంహరించింది. ఈ విషయం సోమవారం వెలుగు చూడడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం తలపెడుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గ్రామానికి చెందిన బూర్లెలక్ష్మణరావుకు చెందిన ఆవు శనివారం మేతకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పొలాలతో పాటూ గ్రామ పరిసరాలను వెతికినా ఆవు జాడ కనిపించలేదు. గ్రామ సమీపంలోని ఒక తోటలో ఆవు మృతిచెంది, సగభాగం మాత్రమే ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే లక్ష్మణరావుకు సమాచారమందించారు. అక్కడికి వెళ్లిన గ్రామస్తులకు పులి పాదముద్రలు కనిపించడంతో వెంటనే అటవీ శాఖాధికారులకు, బుధరాయవలస పోలీసులకు సమాచారమిచ్చారు. అటవీ సిబ్బంది హుటాహుటిన చేరుకుని పులిపాదముద్రలు పరిశీలించారు. పులి సంచరిస్తున్నట్టుగా నిర్ధారించారు. గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రాత్రివేళల్లో ఇంటినుంచి బయటకు రావద్దని సూచించారు.



పులి కాలిముద్రలను పరిశీలిస్తున్న వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పెర్ట్ అమర్‌నాథ్

గండి పూడ్చివేత



గండిపడిన ప్రాంతం వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలంలోని మందరాడ–కాకరాపల్లి గ్రామాల పంటపొలాల వద్ద నారాయణపురం కుడికాలువకు పడిన గండిని రైతులతో కలిసి అధికారులు తాత్కాలికంగా పూడ్చివేయించారు. కాలువకు హెచ్చుస్థాయిలో నీటిని విడిచిపెట్టడంతో ఆదివారం నీరు వంతెన మీదుగా ప్రవహించి కాలువగట్టు కోతకు గురైంది. వందల ఎకరాల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఈఈ సుధాకర్ కాలువ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. డీఈఈ మురళీమోహన్, ఏఈలు జీవీ రమణ, వెంకటరావులతో పాటు ఐజీలు, లష్కర్‌లు గండిపడిన ప్రాంతానికి సోమవారం చేరుకున్నారు. దగ్గర్లో ఉన్న రైతుల సాయంతో ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. శివారు భూములకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో కాలువలో 400 క్యూసెక్కులు నీటిని విడిచిపెట్టడంతో కాలువకు గండిపడిందని అధికారులు పేర్కొన్నారు. రైతులు సకాలంలో తెలియజేస్తే ఈ ప్రమాదం ఉండేది కాదన్నారు. గండి పడిన ప్రాంతాన్ని సంతకవిటి తహసీల్దార్ సులోచనారాణి పరిశీలించారు. ముంపునకు గురైన పంటపొలాల రైతులతో మాట్లాడారు. కాలువగట్టు పటిష్టం చేయిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

డీఎంహెచ్‌ఓ సంతకం ఫోర్జరీ

● అభ్యర్థిపై పోలీసులకు ఫిర్యాదు

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ మెడికల్ కళాశాలల్లో 192పోస్టులకు ఈనెల 6వ తేదీన వెలువడిన నోటిఫికేషన్ గడువు ఈనెల 20తో గడువు ముగిసింది. ఈ సందర్భంగా వచ్చిన అభ్యర్థుల దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలనలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థి ఒకరు డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ సంతకాలను ఫోర్జరీ చేసినట్లు ఓ వైద్యాధికారి గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

పార్వతీపురం టౌన్: గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పెద్దింటి ప్రసాద్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి వైద్యులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దింటి ప్రసాద్ బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పాము కాటువేసింది . గమనించిన ఆయన కుటుంబ సభ్యులతో చెప్పగా వెంటనే వారు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు సేకరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


కలగాటి పారం నాయుడు (ఫైల్)

రేగిడి: మండల పరిధిలోని లింగాలవలస గ్రామానికి చెందిన కలగాటి పారంనాయుడు (44) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఏఎస్సై మన్మథరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం పారంనాయుడు మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. నిత్యం పనులకు వెళ్లకుండా ఆరుబయటే తిరుగుతుండేవాడు. ఈ నెల 21న ఉదయం ఇంటికి వచ్చి భార్య కుమారిని మద్యం కోసం డబ్బులు అడిగాడు. పిల్లలతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉందని, నీకు బాధ్యత లేకుండా ఇలా తిరగడం మంచి పద్ధతి కాదని, కష్టపడి పనిచేసుకుంటే కుటుంబం హాయిగా ఉంటుందని నచ్చజెప్పింది. దీంతో మనస్తాపం చెందిన పారంనాయుడు బయటకు వెళ్లి పురుగు మందుతాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండడంతో ఏమైందని భార్య అడగ్గా పురుగు మందు తాగానని చెప్పడంతో వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు 108 ద్వారా రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడని ఏఎస్సై తెలిపారు. ఆయనకు హరిత, వాగ్దేవి, లత అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కారు కోసమేనా షెడ్ నిర్మాణం..!


సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ ప్రాంగణంలోని షెడ్‌లో ఉన్న కారు

శృంగవరపుకోట: ప్రభుత్వ కార్యాలయాలకు అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆయాశాఖాధిపతులపై ఉంది. అయితే స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే జనం కూర్చోవడానికి కనీస సదుపాయం లేదు. ఎండకాసినా, వర్షం వచ్చినా కార్యాలయంలోని చెట్ల నీడే వారికి గతి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసమే అంటూ ఇటీవల కార్యాలయం ప్రాంగణంలో ఒక షెడ్ నిర్మించారు. అయితే ఆ షెడ్‌లో ఎప్పుడూ అధికారి కారుకు తప్ప క్షక్షిదారులకు చోటుండదు. కారుపై చూపిస్తున్న ప్రేమ కార్యాలయానికి వచ్చే జనంపై కాస్తంత చూపిస్తే, రోజంతా నిలబడే యాతన తప్పుతుందని ప్రజలు వాపోతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 438.00
విజయనగరం	రూ. 441.00
శ్రీకాకుళం	రూ. 441.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	51,930–00
బంగారం(22కి. 10గ్రా.)	47,600–00
వెండి (కిలో)	61,100–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

జన్‌జీవన్ కోసం జల్‌జీవన్

- ప్రతి పల్లెకు రక్షిత జలం లక్ష్యం
- ఇంటింటికీ ప్రత్యేక కుళాయి
- జిల్లాకు రూ.200.82కోట్లు


ఇంటింటి కుళాయి ప్రారంభించి గమనిస్తున్న ఈఈ సౌందర్ రాజన్

శృంగవరపుకోట: ప్రజారోగ్యంలో ప్రధానపాత్ర పోషించే జలాన్ని జనానికి మరింత స్వచ్ఛంగా, అందిస్తూ, వారిలో సామాజిక బాధ్యతను పెంచాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం. అందుకోసం ప్రభుత్వాలు జలజీవన్‌మిషన్ పథకానికి రూపకల్పన చేశాయి. ఈ పథకంలో ప్రతి ఇంటికి ఒక తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. జిల్లాలో జలజీవన్ మిషన్ శరవేగంగా పనిచేస్తోంది.

రూ.200కోట్ల కేటాయింపులు

జలజీవన్ మిషన్ కోసం జిల్లాకు ఇప్పటికే తొలివిడతగా రూ.200.82కోట్లు నిధులు మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1621 ఆవాసాల్లో తొలివిడతగా 1111 ఆవాసాలకు మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పథకం ప్రారంభించారు. కాగా ఇప్పటికే 537 ఆవాసాల్లో ఇంటింటి కుళాయి ఏర్పాటు చేసి రక్షిత జలాన్ని అందిస్తున్నారు. తొలి విడతగా రక్షిత పథకాలు, పైప్‌లైన్లు ఉన్న గ్రామాలు, తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో కుళాయిలు ఏర్పాటు చేశారు.

రూ.720కోట్లు కావాలన్న డీడీఆర్‌సీ

జలజీవన్ మిషన్‌కు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 45శాతం నిధులు కేటాయిస్తున్నా, ప్రజల వాటాగా 10శాతం నిధులు జమచేయాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ప్రభుత్వ నిధులతో పనులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జనావాసాల్లో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేయాలంటే అదనంగా రూ.720కోట్లు కావాలన్న అధికారుల ప్రతిపాదనలను ఇటీవల డీడీఆర్‌సీ ఆమోదించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పలుచోట్ల కాలం చెల్లిన పైప్‌లైన్లు, నీరులేని వాటర్ సోర్స్, మూలకు చేరిన పథకాల మరమ్మతుల కోసం మరిన్ని నిధులు అవసరం ఉంది.

వీడబ్ల్యూఎస్ కమిటీలు

ప్రతి గ్రామంలో విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, తద్వారా తాగునీటి పథకాలను నిర్వహించాలన్నది జలజీవన్‌మిషన్ లక్ష్యం. 50శాతం మహిళలతో 15మంది సభ్యుల కమిటీలో సర్పంచ్‌ను అధ్యక్షుడిగా, పంచాయతీ కార్యదర్శిని సెక్రటరీగా నియమించి, ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఆరంభించి యూజర్ చార్జీలు, ప్రభుత్వ నిధులు ఆ ఖాతాలో ఉంచి పథకం నిర్వహణ, నీటి పరీక్షల్లో శిక్షణ, టెస్టింగ్ కిట్లు ఇచ్చి మహిళలను భాగస్వాములను చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.

జవాబుదారీ తనం పెరగాలి



జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి కుళాయి ఇవ్వడంతో నీటి వృథా తగ్గుతుంది. ఈ పథకం మనది అన్న జవాబుదారీ తనం, బాధ్యత పెంచాలని, మహిళలు మంచినీటి కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ఆత్మగౌరవం కాపాడాలని, జలం ప్రాముఖ్యం జనానికి తెలియ చెప్పాలని ప్రభుత్వ ప్రయత్నం. ఈ మేరకు 4 స్వచ్ఛంద సంస్థలకు బాధ్యతలు అప్పగించి డీఎంసీతో పర్యవేక్షిస్తూ అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

–ఏపీ సౌందర రాజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ

అర్జీదారులకు సంతృప్తికర సమాధానమివ్వాలి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

- కలెక్టర్ సూర్యకుమారి
- స్పందనకు 251 వినతులు

విజయనగరం అర్బన్: స్పందన వినతులను పరిష్కరించే ముందు అర్జీదారులతో మాట్లాడి వారికి సంతృప్తికరమైన సమాధానాన్ని ఇవ్వాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 251 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 195, వైద్యశాఖకు 34, డీఆర్‌డీఏ చెందినవి 32 వినతులు వచ్చాయి. వినతులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఉప కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఏ ఒక్క స్పందన దరఖాస్తు కూడా గడువు దాటి ఉండకుండా చూడాలన్నారు. అధికారులు స్పందన లాగిన్‌లో స్వయంగా వినతులు పరిశీలించి సమాధానంలో నాణ్యత ఉండేలా పరిష్కరించాలని స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమం ప్రాధాన్యాన్ని గుర్తించాలని శాఖల ఉన్నతాధికారులే స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని వీలైనంతవరకు సోమవారం సెలవులు పెట్టరాదని సూచించారు. మండల ప్రత్యేకధ కారులు వారి తనిఖీలలో గుర్తించిన అంశాలను, రిమార్కులను తెలియజేయాలని ఆదేశించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

సమస్యల సత్వర పరిష్కారమే స్పందన లక్ష్యం

విజయనగరం క్రైమ్: సమస్యలతో సతమవుతున్న వారికి సత్వర పరిష్కారం అందించడమే స్పందన కార్యక్రమం లక్ష్యమని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. స్పందనలో భాగంగా 55 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్బీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, ఎస్సై వాసుదేవ్ పాల్గొన్నారు.

స్పందనకు 115 అర్జీలు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఆర్థికేతర దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ఆర్థిక పరమైన సమస్యలపై నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ ఆనంద్, డీఆర్‌ఓ వెంకట్రావు ప్రజల నుంచి 115 అర్జీలు స్వీకరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సామాజిక, వ్యక్తిగత సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కిరణ్‌కుమార్, డీఏహెచ్‌ఓ ఈశ్వరరావు, డీఈఓ బ్రహ్మాజీ, డ్వామాపీడీ రామచంద్రరావు, డీఎస్‌ఓ ఎం.డి నాయక్, డీపీఓ బి.సత్యనారాయణ, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, డీఏఓ రాబర్ట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

స్పందన వినతులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరాములు, ఎస్సై దినకర్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి.

స్పందన ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిరాయదులు స్వీకరించారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికారులో అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

- గనులు, భూగర్భశాఖ ఎ.డి మల్లేశ్వరరావు


మైన్స్ ఎ.డి ఎస్‌పీకే మల్లేశ్వరరావు

విజయనగరం పూల్‌బాగ్: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, వివిధ శాఖల సమన్వయంతో విరివిగా తనిఖీలు చేపడుతున్నామని గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు ఎస్‌పీకే మల్లేశ్వరరావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. అధికారుల నుంచి పొందిన రశీదు, అనుమతి పత్రం లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 130 కేసులు నమోదు చేసి, రూ.38లక్షల 54వేలు అపరాధ రుసుం వసూలు చేశామని వివరించారు. ఇటీవల కాలంలో పలు పత్రికల్లో వెలువడిన కథనాలపై ఆయన స్పందించి ఇసుక విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు, అనుసరిస్తున్న విధానాల గురించి వివరించారు. గజపతినగరం, గరివిడి, గుర్ల, బొబ్బిలి, మండలాల్లో ఎక్కువగా ఇసుక తరలిపోతున్నట్లు కథనాలు వెలువడ్డాయని ఈ మేరకు స్థానిక అధికారులతో పరిశీలన చేయించామని వెల్లడించారు. ప్రభుత్వం మంజూ రు చేసిన గృహనిర్మాణాలు, ప్రభుత్వ భవనాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీల్లో జరిగే నిర్మాణాలకు ఇసుక తరలించేందుకు ప్రత్యేకంగా కూపన్లు జారీ చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రం, కూపన్లు లేకుండా ఇసుక తరలించే వారిపై రెవెన్యూ, ఎస్ఈబీ, పోలీసు శాఖల సహాయంతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైల్వే ట్రాక్ వద్ద మృతి చెందిన దుర్గారావు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తి రైలు ఢీకొట్టిన సంఘటనలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన కొర్రాయి దుర్గారావు(27) పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టి ఉండవచ్చని స్థానికులు, రైల్వే పోలీసులు అభిప్రాయపడుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్సై రవివర్మ, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దుర్గారావు ట్రాక్టర్ కలాసీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమార్తె చిన్మయి(4), సాయి తేజ(6 నెలల బాబు) ఉన్నారు. రైల్వే ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లారీ, బైక్ ఢీకొని మరొకరు..

పార్వతీపురం టౌన్: రాయగడ నుంచి పార్వతీపురం వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న పార్వతీపురం పట్టణానికి చెందిన తాడొ ధర్మారెడ్డి(60) మృతిచెందారు. ఈ సంఘటనపై పట్టణ ఎస్సై ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ప్రమాద విషయం తెలుసుకున్న సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.


ప్రమాదంలో మృతిచెందిన ధర్మారెడ్డి

తోటపల్లి ప్రాజెక్టును సందర్శించిన 'దువ్వూరి'


తోటపల్లి ప్రాజెక్టువద్ద రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి


విశ్రాంత ఐఏఎస్ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గరుగుబిల్లి: రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తోటపల్లి నీటిపారుదల ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. ఆయన పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా గతంలో పనిచేయడంతో ఈ ప్రాంతమంటే మక్కువ. ఇందులో భాగంగా పార్వతీపురం సబ్ కలెక్టర్ భావనతో కలిసి ఈ ప్రాంత అందాలను తిలకించారు. ప్రాజెక్టు ఆయకట్టు వివరాలను ఏఈ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

దువ్వూరికి స్వాగతం

దువ్వూరి సుబ్బారావు సోమవారం పార్వతీపురంలో పర్యటించిన సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. 1974 నుంచి 1976 మధ్య పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు గత స్మృతులను నెమరవేసుకున్నారు. దువ్వూరి సుబ్బారావును కలెక్టర్ నిషాంత్ కుమార్, సబ్ కలెక్టర్ భావన మర్యాద పూర్వకంగా కలిశారు. మంచి పాలన అందించి ప్రజల హదయాల్లో చెరగని ముద్ర వేయాలని యువ ఐఏఎస్‌లకు ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సూచించారు. మంచి పాలనాధ్యదక్షుడిగా ఉండి, మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కోరారు.

బాలుడికి బ్రెయిన్ ట్యూమర్

- సహాయం కోసం పేద తల్లిదండ్రుల ఎదురు చూపులు

నెల్లిమర్ల రూరల్: అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడికి బ్రెయిన్ ట్యూమర్ అని తెలియడంతో ఆ పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఆటో నడుపుతూ వచ్చిన సొమ్ముతో సాఫీగా సాగుతున్న జీవిత ప్రయాణంలో అనుకోకుండా వచ్చిన కష్టంతో శారీరకంగా, మానసికంగా కుంగిపోయారు. నెల్లిమర్ల మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన సారిపల్లి గౌతమ్ కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. చిన్న మెదడును ఆనుకుని పెద్ద ట్యూమర్ ఏర్పడడంతో రెండు సర్జరీలు చేయాల్సి వస్తుందని వైద్యులు సూచించారు. ఎలాగైనా కుమారుడిని బతికించుకోవాలని సంకల్పించిన తల్లిదండ్రులు తెలిసిన వారి దగ్గర అప్పు చేసి రూ.5లక్షలతో ఇటీవల సర్జరీ చేయించారు. ప్రస్తుతం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గౌతమ్ ఫిజియోథెరపీ చికిత్స పొందుతున్నాడు. ఇంకా నెల రోజులు ఆస్పత్రిలోనే చికిత్స పొందాల్సి ఉంది. మందులతో పాటు ఇతర ఖర్చులకు రోజుకు రూ.5వేలు పైగా ఖర్చు అవుతుండడంతో తల్లిదండ్రులు దాతల సహాయాన్ని కోరుతున్నారు. స్పందించి ఆ గ్రామానికి చెందిన యువత విరాళాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా వేదికగా బాలుడి పరిస్థితిని తెలియజేస్తూ విరాళాలు సేకరిస్తున్నారు.

ఎవరైనా దాతలు ఆదుకోవాలనుకున్న వారు పూర్తి వివరాలకు 6305042755 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమ్

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే స్పందన


వినతులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందనలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రెండు, నగర ప్రణాళికా విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రసాద్, గణాంక అధికారి రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అరికట్టాలి..


తహసీల్దార్ భాస్కరరావుకు ఫిర్యాదు చేస్తున్న కొప్పెర్ల గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని పాత కొప్పెర్లలో జరుగుతున్న ఆక్రమణలను అరికట్టి విద్యుత్ సబ్‌స్టేషన్ భూములను కాపాడాలని సర్పంచ్ పైడి రమణతో పాటు పలువురు రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఇ. భాస్కరరావును సోమవారం ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో సర్వే నంబర్ 170-2లో సబ్‌స్టేషన్‌కు చెందిన భూములను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ప్రభుత్వభూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పి. లక్ష్మీనారాయణ, ఎల్.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వైద్యం


పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి రామరాజు

భోగాపురం రూరల్: మండలంలోని చాకివలస రైతుభరోసా కేంద్రంలో 22 పశువులకు గర్భకోశ చికిత్స అందించినట్లు పశు వైద్యాధికారి యు. రామారాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30 వరకు మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పాడి పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్సలు అందించేందుకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పశు పోషకులు, మేకలు, గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు పి. గోపాలరాజు, జి. వెంకటేష్, టి.దేవి, తిరుమరెడ్డి పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

మెగా అభిమానుల రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్: అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సినీ నటుడు చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక న్యూ లైఫ్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గురాన అయ్యలు మాట్లాడుతూ, మెగా అభిమానులు సేవకు మారుపేరన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.కృష్ణారావు, రాజు, పవన్, శివ, హేమంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌తో ప్రయోజనాలెన్నో..

- వ్యవసాయాధికారి హరికృష్ణ


ఈ-క్రాప్ నమోదచు చేస్తున్న వీఏఏ లక్ష్మి

భోగాపురం రూరల్: రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని మండల వ్యవసాయాధికారి హరికృష్ణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తు సహాయం, ఎరువులు, విత్తనాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ రుణాలు, పంటల కొనుగోళ్లు, రైతుభరోసా, తదితర పథకాలు అందాలంటే పంటలకు ఈ క్రాప్ తప్పనిసరన్నారు. మండలంలో ఇప్పటివరకు 840 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని, మిగిలిన వారు కూడా త్వరగా ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


23వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నగర మేయర్

- రూ.12.65 లక్షలతో కాలువ, కల్వర్టు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

విజయనగరం: నగరంలోని 23వ డివిజన్ బొండాడ వీధి ప్రాంతంలో రూ.12.65 లక్షలతో నిర్మించనున్న కాలువలు, కల్వర్టు పనులకు ఎమ్మెల్యే కొలగట్ల వీరభద్రస్వామి సోమవారం శంకుస్థాపన చేశారు. కాళ్లనాయుడు మందిరం ప్రాంతంలో కాలువ పనులకు.. బొండాడవీధి జంక్షన్‌లో కల్వర్టు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. రూ. 5.85 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు, రూ.6.80 లక్షలతో కాలువ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ కేదారిశెట్టి సీతారామమూర్తి మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రజా సమస్యలతో పాటు నగర సుందరీకరణకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేషన్ డీఈ అప్పారావు, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కుమ్మరిగుంటి శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు లక్ష్మణరావు, కాళ్ళ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంకటహర ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

విజయనగరం: నగరంలోని 12వ డివిజన్ రింగ్ రోడ్డు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సంకటహర ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్ రేగాన రూపాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు డొంకాడ పద్మావతి, బొంగ భానుమూర్తి, తదితరులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. సంకటహర ఆంజనేయ స్వామి ఆశీస్సులు నగర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే కోలగట్ల ఆకాంక్షించారు.


సంకట హర ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కోలగట్ల

గోకుల్‌పార్క్‌లో రాధాకృష్ణులకు పూజలు

విజయనగరం: కొత్తపేట జంక్షన్ గోకుల్ పార్క్‌లో ఉన్న రాధాకృష్ణులను కోలగట్ల వీరభద్రస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అఖిల భారత యాదవ మహాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంఘ అధ్యక్షుడు ముద్దాడ మధు, మాజీ కౌన్సిలర్ గదుల సత్యలత మాట్లాడుతూ, గోవధ శాలలను తక్షణమే మూయించి వేయాలని కోరారు. గో సంరక్షణకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ అల్లు చాణక్య, పార్టీ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, ఇప్పిలి శ్రీనివాసరావు, ముచ్చు రామలింగస్వామి, బొంగ భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


ప్రసాద వితరణ చేసున్తన్న మేయర్, డిప్యూటీ మేయర్, తదితరులు

గడప గడపకూ సంక్షేమ ఫలాలు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోలగట్ల , పక్కన నగర మేయర్

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారం ప్రాంతంలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరుతో పాటు, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతిరహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, నగరాభివృద్ధికి శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, డివిజన్ నాయకులు తాత్రాజు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సమాజ స్థితిగతులపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీఓ అశోక్‌రెడ్డి

- ఎన్ఎస్ఎస్ పీఓ అశోక్‌రెడ్డి

డెంకాడ: ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థి దశ నుంచే సమాజంలోని స్థితిగతులపై అవగాహన కలుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్‌రెడ్డి అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు. యువత జాతి నిర్మాణం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేయడం వలన సమాజానికి సేవా చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ పీఓ తమ్మినేని హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, పలు కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తరలిపోతున్న సముద్రపు ఇసుక


ఇసుక తవ్వకాల వల్ల కోతకు గురైన ముక్కాం తీరం

- ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

భోగాపురం: తీర ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో సముద్రపు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రపు ఇసుకలో ఖనిజాలు పుష్కలంగా ఉండడంతో ఇక్కడి ఇసుకను ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నారు. గతంలో విశాఖపట్నం జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ వ్యాపారానికి తెర తీశాడు. ఆయనతో కలిసి మండంలోని దిబ్బలపాలెం, తూడెం గ్రామాలకు చెందిన కొందరు జేసీబీతో తవ్వకాలు ప్రారంభించారు. ట్రాక్టర్ ఇసుక లోడు వేల రూపాయలు పలుకుతుండడంతో గుట్టుగా తరలించేశారు. అయితే అప్పట్లో అక్రమార్కుల మధ్య వివాదం తలెత్తడం.. అది కాస్తా పోలీస్ ఫిర్యాదుల దాకా వెళ్లడంతో ఎస్సై యు.మహేష్ రంగంలోకి దిగి ఇసుక తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మళ్లీ తాజాగా తీరప్రాంతానికి చెందిన కొంతమంది రాత్రిపూట సముద్రపు ఇసుకను తరలిస్తున్నారు. స్థానిక పెద్దల అండదండలతోనే ఇసుక రవాణా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజును వివరణ కోరగా ఈ విషయమై ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. అయినప్పటికీ సముద్రపు ఇసుక తరలింపు చట్టరీత్యా నేరమని, భూగర్భ గనుల శాఖాధికారులతో మాట్లాడి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: బియ్యాలపేట గ్రామ శివారులో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 13,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు



త్రిసితను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 15న ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో (ఎస్ఎన్ఐసీ) పాల్గొన్న సీతమ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కె.త్రిసితను యాజమాన్యం సోమవారం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.దామోదరనాయుడు, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్ సబార్డినేట్స్ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

విజయనగరం అర్బన్: కమర్షియల్ టాక్స్ ఆఫీస్ సబార్డినేట్స్ ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీను, ఉపాధ్యక్షులుగా వి.సాయికుమార్, సీహెచ్ శంకరరావు, ఎల్.పద్మ.. కార్యదర్శిగా ఎ.వెంకట రాజు, ఆఫీస్ సెక్రటరీగా పి.ఉమామహేశ్వర రావు, జాయింట్ సెక్రటరీలుగా ఎల్‌వీ ప్రసాద్, పి.గంగారావు.. కోశాధికారిగా జి.అలేఖ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు.

నేడు టంగుటూరి జయంతి

విజయనగరం అర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

ఆలయాల్లో చోరీ

భోగాపురం: మండలంలోని రాజాపులోవ, ముంజేరు గ్రామాల్లోని అంజనేయస్వామి ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి హుండీలను పగలుగొట్టి రూ.5వేల నగదు కాజేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలసకు చెందిన మైలపల్లి శ్రీను నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంవీఆర్ అప్పారావు సోమవారం తెలిపారు. గ్రామంలో తనిఖీలు చేపడుతుండగా, నిందితుడి నుంచి మద్యం పట్టుబడిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఇ. రామకృష్ణ, సిబ్బంది పోలినాయుడు, పరిమలా గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

భూరీసర్వే వేగవంతం చేయండి

జామి: కుమరాంలో సమగ్ర భూరీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ జి.హేమంత్ కుమార్ సర్వే సిబ్బందికి సూచించారు. గ్రామంలో చేపడుతున్న రీసర్వేను సోమవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆ గ్రామ సచివాలయంలో పంచాయతీ, రెవెన్యూ, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే చేస్తున్నప్పుడు తక్కువ మంది రైతులే పాల్గొంటున్నారని, దీని వల్ల సర్వేలో జాప్యం జరుగుతోందని అన్నారు. సర్వే చేసే సమయంలో సంబంధిత భూముల రైతులు విధిగా పాల్గొనాలని కోరారు.

భూసారంతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్

డెంకాడ: భూసారం ఎంత పెరిగితే మనం పండించే పంట అంత దిగుబడి ఇస్తుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కో ఆర్డినేటర్ జి.హేమసుందర్ అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌వైఎస్ఎస్ వ్యవసాయ సిబ్బందికి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చిరొట్ట వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. దీంతో నేలలో సూక్ష్మ జీవులు పెరిగి జీవ రసాయన చర్యలు జరిగి భూసారం పెరుగుతుందని తెలిపారు. అలాగే కలుపు మొక్కలు పెరగకుండా ఇవి నివారిస్తాయన్నారు. భూమి లోతుల్లో ఉన్న పోషకాలను కూడా ఉపరితలానికి తీసుకురావడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సూరిబాబు సేవలు మరువలేనివి..


సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: కామ్రేడ్ బుగత సూరిబాబు సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. కామేశ్వరరావు అన్నారు. కామ్రేడ్ బుగత సూరిబాబు ద్వితీయ వర్ధంతి సభ స్థానిక అమర్‌భవన్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా నాయకులు రంగరాజు, టి.జీవన్, బుగత పావని, కె. స్రవంతి, కేవీరమణ, పి. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో కార్మిక సంఘాల నాయకులు

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల డిమాండ్

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయాలని ప్రయత్నిస్తే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. బ్రిటిష్‌కాలం నాడు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి యజమానుల కింద కట్టు బానిసలుగా చేస్తే కార్మిక సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐఎఫ్‌టీయు న్యూ, ఇఫ్టూ నాయకులు మొదిలి శ్రీనివాసరావు, టీవీ రమణ, బెహరా శంకరరావు, పి.మల్లిక్, నారాయణరావు, జగన్మోహన్, రమణ, వి.అప్పలరాజు, పైడినాయుడు, సన్యాసినాయుడు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

26న గ్రీన్ అంబాసిడర్ల జిల్లా మహాసభ

శృంగవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని గ్రీన్ అంబాసిడర్లు కోరా రు. గ్రీన్ అంబాసిడర్స్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ మద్దిల రమణ ఆధ్వర్యంలో మహాసభల గోడ పత్రికలను ఎస్.కోటలో సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ జీఓ నంబర్ 132 ప్రకారం ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు ఇవ్వాలని, ప్రకటించిన వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సీఐటీయూ ఆఫీస్ వరకు ర్యాలీ, అనంతరం మహాసభ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మద్దిల సత్యనారాయణ, పి.నాగరాజు, బి.అప్పారావు, ఈ.శ్యామ్‌సుందరరావు, జి.ప్రకాష్, జి.అప్పారావు, బి.జగ్గారావు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

బొండపల్లి: జిల్లా కేంద్రంలో 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గ్రీన్ అంబాసిడర్ల జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రం వద్ద మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను గ్రీన్ అంబాసిడర్లతో కలిసి సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బొండపల్లి నారాయణరావు, అచ్యుతరావు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

- కావలిలో కరుణాకర్ ఆత్మహత్యే ఇందుకు నిదర్శనం
- డీజీపీకి టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీలు, ఎస్సీలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. నెల్లూరు జిల్లా కావలిలో కరుణాకర్ ఆత్మహత్యే శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కరుణాకర్ మునునూరులో రెండు చేపల చెరువులను సబ్ లీజుకు తీసుకుని భారీగా పెట్టుబడి పెట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి ఆ చెరువుల్లో చేపలు పట్టకుండా అడ్డంకులు సృష్టించి కరుణాకర్‌ను వేధించారని లేఖలో ఆరోపించారు. వాళ్ల వేధింపులు తాళలేక కరుణాకర్ లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుంటేనే దళితులకు రక్షణ దొరుకుతుందన్నారు.

ఎంపీ రఘురామ కుమారుడిపై బలవంతపు చర్యలొద్దు

తెలంగాణ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌పై దాడి చేశారంటూ ఎంపీ రఘురామ కుమారుడు భరత్‌పై గచ్చిబౌలి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ మేరకు బలవంతపు చర్యలొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలంటూ ఎంపీ రఘురామ, భరత్‌లు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆగస్టు 12న ఇదే పిటిషన్ విచారించి కొట్టివేశామని, ఆర్డర్ ఇచ్చే సమయంలో మరికొన్ని ఆర్డర్‌లు కనిపించాయని ధర్మాసనం పేర్కొంది. అవి కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం, అనంతరం సుప్రీంకోర్టు ఆర్మీ ఆసుపత్రిలో చికిత్సకు అనుమతివ్వడానికి సంబంధించిన ఆర్డర్‌లని ఎంపీ రఘురామ తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు తెలిపారు. రెండూ ఒకే అంశానికి చెందినవా? అని ధర్మాసనం ప్రశ్నించింది. వేర్వేరు కేసులని న్యాయవాది స్పష్టం చేశారు. అనంతరం గచ్చిబౌలి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ మేరకు పిటిషనర్లపై తదుపరి ఆదేశాలవరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని పేర్కొంటూ.. ధర్మాసనం హైదరాబాద్ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.



గిరిజనులకు పీఎంఏవై ఇళ్లు ఇవ్వండి

కేంద్రాన్ని కోరిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ

- పీఎంఏవై ద్వారా పూర్తి సబ్సిడీ ఇళ్లకు ప్రయత్నం
- రాష్ట్రంలో 92 వేల గిరిజన కుటుంబాలకు ఇళ్ల ప్రతిపాదనలు
- వారిలో 15 వేలమందికి ఇళ్ల మంజూరుకు సాంకేతిక సమస్య
- ఆ సమస్యను పరిష్కరించి ఇళ్లు ఇచ్చేందుకు కసరత్తు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గిరిజనులకు పూర్తిస్థాయి సబ్సిడీతో ఇచ్చే ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కేంద్రాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పేదలకు 31 లక్షలకుపైగా ఇళ్లస్థలాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇళ్ల పట్టాలు ఇచ్చిన పేదలు దశలవారీగా ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సొంతంగా పక్కా ఇల్లు లేని 92 వేల గిరిజన కుటుంబాలు ఉన్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వీటిలో 15 వేలకుపైగా కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు సాంకేతిక సమస్య ఎదురైంది. వారికి గతంలో రేకుల షెడ్లు, పెంకుటిల్లు నిర్మాణానికి ప్రభుత్వం గృహనిర్మాణ పథకంలో నిధులు ఇచ్చింది. అప్పట్లో గృహనిర్మాణ పథకంలో డబ్బులు ఇచ్చినందున ఆ రేకుల షెడ్లు, పెంకుటింటి స్థానంలో పక్కా ఇల్లు నిర్మించుకోవాలంటే మళ్లీ ప్రభుత్వం సాయం అందించేందుకు నిబంధనల ప్రకారం కుదరదు. ఈ నిబంధనలను సవరించి వారికి కూడా పక్కా భవనం నిర్మించుకునేలా ప్రత్యేక మినహాయింపు ఇచ్చి పీఎంఏవై మంజూరు చేయించేలా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రయత్నాలను కొనసాగిస్తోంది. పేదలందరితోపాటు గిరిజనులకు కూడా ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం వారికి కూడా పక్కా ఇల్లు నిర్మించేలా పీఎంఏవై కోసం ప్రతిపాదించింది.

కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిని కోరాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవాప్తంగా గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేశాం. గతంలో 15 వేలమంది గిరిజనులకు రేకుల షెడ్లు, పెంకుటింటి కోసం ప్రభుత్వం సాయం అందించడంతో ఇప్పుడు పక్కా భవనం కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం వారు అనర్హులు అని వస్తోంది. సాంకేతికంగా వచ్చిన ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. వారికి కూడా పూర్తిస్థాయి సబ్సిడీతో పీఎంఏవై కింద ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అర్జున్‌ముండాను కోరాం. ఆర్థికంగాను, సామాజికంగాను అత్యంత వెనుకబడిన 92 వేల గిరిజన కుటుంబాలకు దశలవారీగానైనా పీఎంఏవై ఇళ్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సమర్పించాం.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి

అది తప్పుడు వార్త

- విద్యా దీవెన, వసతి దీవెనల కింద ప్రభుత్వం పూర్తి మొత్తం ఇచ్చింది
- అవనిగడ్డ విద్యార్థిని తల్లి లత స్పష్టీకరణ
- లత, ఆమె కుటుంబీకుల అకౌంట్లలో రూ.1.72 లక్షలు జమ
- ఏఏ తేదీలో ఎంత జమయ్యాయో వివరించిన అధికారులు

సాక్షి, అమరావతి: జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలపై తప్పుడు వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడుతున్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం సీతాయిలంకలోని తుమాటి లత అనే మహిళ జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల నిధులు పూర్తిగా అందలేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో నిలదీసినట్లు ఆ పత్రిక సోమవారం ఒక వార్త ప్రచురించింది. ఆ కార్యక్రమంలో జరిగిన దానికి భిన్నంగా తప్పుడు సమాచారాన్ని వండి వార్చింది. వాస్తవానికి తుమాటి లత బ్యాంకు అకౌంట్లో ప్రభుత్వం వివిధ పథకాల కింద రూ.1.72 లక్షలు జమ చేసినట్లు పేర్కొంటూ గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆమెకు కరపత్రాన్ని అందించారు. విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ. 1.40 లక్షల వరకు అందినట్లు, బ్యాంకు అకౌంట్ పుస్తకంలో ఆమేరకు జమ చేసినట్లు అందులో వివరించారు. అయితే ఈ రెండు పథకాల కింద తమకు రూ.82 వేలు మాత్రమే అందినట్లు లత చెప్పడంతో ఆమెకు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అధికారులు వెంటనే 1.72 లక్షల నిధులు లత, ఆమె కుటుంబీకులకు చెందిన ఏయే బ్యాంకు అకౌంట్లలోకి ఏ తేదీల్లో జమ అయ్యాయో వివరంగా చూపించారు. అలాగే విద్యా దీవెన, వసతి దీవెన కింద 1.40 లక్షలు ఏయే తేదీల్లో జమ అయ్యాయో రికార్డులు చూపి మరీ చెప్పారు. తన అకౌంట్లో, తన కుమార్తె అకౌంట్లో మొత్తం నిధులు జమ అయ్యాయని, తానే పొరపాటున పూర్తిగా రాలేదని అనుకున్నానని లత వివరించారు. పూర్తి మొత్తం అందించినట్లు బ్యాంకు అకౌంట్లలో జమ అయిన మొత్తాలను చూపి మరీ అధికారులు తమకు వివరించారని చెప్పారు. అయితే, ఆంధ్రజ్యోతి పత్రికలో తప్పుడు వార్త రావడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.

శిక్ష పూర్తవ్వకముందే నేరస్తుల విడుదలా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- తదుపరి విచారణ 25కి వాయిదా

సాక్షి, అమరావతి: హత్య కేసుల్లో 14 ఏళ్ల పాటు జీవితఖైదు అనుభవించాల్సిన ఖైదీలను ఆ శిక్ష పూర్తి కాక ముందే స్వాతంత్ర్య దినోత్సవం నాడు విడుదల చేస్తుండటంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. చట్ట నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. 14 ఏళ్ల జీవిత ఖైదు అనుభవించిన వారే క్షమాభిక్షకు అర్హులని స్పష్టం చేసింది. 14 ఏళ్ల శిక్ష పూర్తి కాకుండానే వారిని విడుదల చేయడమంటే.. వారికి కోర్టులు విధించిన శిక్షను కుదించడమే అవుతుందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి వాదనలు వినిపించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన భర్త పార్థమరెడ్డి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న 8 మంది నేరస్తులను శిక్షాకాలం పూర్తి కాక ముందే స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన ముడి నవనీతమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ 8 మందిని విడుదల చేస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని ఆమె కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై సోమవారం న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గవర్నర్ తన విచక్షణాధికారం మేరకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ఇలా విడుదల చేయడం ఎన్నో ఏళ్లుగా వస్తోందన్నారు. ఇదేమీ కొత్త, అసాధారణ విషయం కాదని చెప్పారు. నిబంధనల ప్రకారమే జీవో జారీ చేశామన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో విప్లవాత్మక మార్పులు

సాక్షి, అమరావతి:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. సోమవారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, పీహెచ్‌సీ వైద్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణబాబు మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు అవసరమైన వసతులను సమకూరుస్తున్నామన్నారు. పీహెచ్‌సీలన్నింటిలో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించామన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే బాధ్యతను క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ స్థాయిలో వైద్య సేవలను అందించేందుకు ఇప్పటికే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. డిసెంబర్ నాటికి అన్ని క్లినిక్‌లకు సొంత భవనాలు సమకూరుతాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఆరోగ్యశ్రీ, సీఈవో హరీంద్రప్రసాద్, డీహెచ్ డాక్టర్ ఉప్పాడ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై రాళ్లేయడమే టీడీపీ లక్ష్యం

- పలాసలో లోకేశ్ సృష్టించిన వీరంగమే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై సరైన కారణం లేకుండా రాళ్లేయడానికి లోకేశ్ అండ్ కంపెనీ విశ్వప్రయత్నాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో అలజడి సృష్టించడానికి వారు చేస్తున్న హడావుడే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలాసలోని ఒక కాలనీలో అక్రమ నిర్మాణాలను కోర్టు ఆదేశాల ప్రకారం తొలగించడానికి ప్రభుత్వాధికారులు చేసిన ప్రయత్నాన్ని బ్రహ్మాస్త్రంగా మార్చుకోవాలని టీడీపీ పథకం రచించిందన్నారు. దీన్ని అమలు చేసే బాధ్యతను లోకేశ్‌కు అప్పగించిందన్నారు. టీడీపీ సృష్టిస్తున్న అరాచకాలను ప్రభుత్వ యంత్రాంగం అనుమతించకపోవడంతో ఆందోళన చేయడానికి చినబాబు విశాఖపట్నం వరకు వచ్చారని దుయ్యబట్టారు. టీడీపీ అనుకూల మీడియా తోడ్పాటుతో ఓ గొప్ప ప్రజాందోళన నిర్వహించినట్టు స్థానిక ప్రజలకు చిన్న సినిమా చూపించారని ఎద్దేవా చేశారు. విజయసాయిరెడ్డి ఇంకా ఏమన్నారంటే..

ఏదో ఒక సాకుతో ఆందోళనకు పథకాలు..

'చంద్రబాబు, లోకేశ్‌కు పగలూ, రాత్రీ అసెంబ్లీ ఎన్నికలే కనిపిస్తున్నాయట. శాసనసభ ఎన్నికలకు



20 నెలల సమయం ఉండడంతో తండ్రీకొడుకులిద్దరూ ఏదో ఒక సాకుతో ఆందోళనకు పకడ్బందీగా పథకాన్ని అమలు చేస్తున్నారు. సాధారణ పరిపాలనకు సంబంధించిన చిన్న విషయాలను సైతం సమస్యలుగా చూపించి లోకేశ్ టీడీపీ నేతలతో కలిసి రాజకీయ వీధి యుద్ధాలకు సిద్ధమవుతున్నారు. పలాస మునిసిపాలిటీ పరిధిలో 'అర్ధరాత్రి కూల్చివేతలు.. అక్రమ అరెస్టులు' అంటూ ఉత్తరాంధ్రలో లోకేశ్, ఆయన భజన బృందం, అమరావతిలో చంద్రబాబు వేస్తున్న వీరంగాలు కేవలం నాటకాలే. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రలో చట్టవిరుద్ధంగా తీసుకుంటున్న అక్రమ చర్యలు ఏవీ లేవు. ప్రతిపక్ష నేతలను ఎక్కడా అణచివేయలేదు. ప్రశాంతంగా ఉన్న ఉత్తరాంధ్రలో నిప్పురాజేసి దాన్ని రాష్ట్రమంతటా అంటించడానికి టీడీపీ చేసిన ప్రయత్నం పారలేదు. విశాఖపట్టణాన్ని రాష్ట్ర పాలనా రాజధానిగా చేయడాన్ని టీడీపీ సర్వశక్తులూ ఒడ్డి అడ్డుకోవడానికి ప్రయత్నించింది. ఈ విషయాలు ప్రజలకు తెలియనివి కావు. చిన్న అంశాన్ని పట్టుకుని చంద్రబాబు, లోకేశ్.. రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మహా ఉద్యమం నిర్మించడానికి ఎక్కడ లేని ఎత్తుగడలతో రంగంలోకి దిగుతున్నారు. వారి ఆటలు సాగడం లేదనే దుగ్ధతో అసత్యాలు, అర్ధసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజానీకం టీడీపీ ఆగడాలకు తమ నేలను ప్రయోగశాలగా మార్చుకోవడానికి అనుమతించదు.' అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.

సీపీఐ సీనియర్ నేత సిద్ది వెంకటేశ్వర్లు కన్నుమూత

హైదరాబాద్: సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీలో తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లాలో జన్మించిన వెంకటేశ్వర్లు విద్యార్థి, యువజనోద్యమాల్లో కీలకపాత్రతో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది.

ఆదిత్యాలయానికి రూ.లక్ష విరాళం



ఈవోకు చెక్ అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక విశాఖ-ఎ కాలనీకి చెందిన బి.హరిప్రసాదరావు, జయలక్ష్మి దంపతులు రూ.1,00,101 విరాళాన్ని ఈవో వి.హరి సూర్యప్రకాష్‌కు చెక్కురూపంలో సోమవారం అందజేశారు. ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఈ మొత్తాన్ని వినియోగించాలని దాతలు కోరారు. అనంతరం ఈవో మాట్లాడుతూ రూ.లక్ష కు మించి విరాళాలిచ్చిన దాతలకు ప్రత్యేక పర్వదినాల్లో దర్శనాల పాసులు ఇస్తామని చెప్పారు.

వెండి కిరీటం బహూకరణ



కిరీటాన్ని అందజేస్తున్న దాతలు

కొత్తూరు : మండల కేంద్రం కొత్తూరుకు చెందిన పాగిరి అర్జున పార్వతి దంపతులు రెండు కిలోల వెండి కిరీటాన్ని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం బహూకరించారు. ముందుగా ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు వేదమంత్రాల మధ్య వెండి కిరీటంతో ఆలయ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో పాగిరి వినోద్, మౌనిక పాల్గొన్నారు.

క్షేత్ర ప్రచారాధికారిగా తారక్‌ప్రసాద్



శ్రీకాకుళం పాత బస్టాండ్: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (కేంద్ర సంచార విభాగం), శ్రీకాకుళం క్షేత్ర కార్యాలయ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ (క్షేత్ర ప్రచార అధికారి)గా బి.తారక్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు క్షేత్ర కార్యాలయం నుంచి శ్రీకాకుళానికి బదిలీ చేస్తూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.


ఓటరు కార్డుకు.. ఆధార్ అనుసంధానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- అమల్లోకి వచ్చిన నూతన మార్గదర్శకాలు

ఆమదాలవలస రూరల్: ఓటర్ల జాబితా సవరణకు నూతన మార్గదర్శకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే ఓటరుగా ఉన్న వారు, ఓటరుగా నమోదు కావాలనుకున్నవారు తమ ఆధార్ నంబరును పొందుపరచాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి పేరు ఎక్కువ నియోజకవర్గాల్లో నమోదు కాకుండా, ఒకే నియోజకవర్గంలో ఒకటి కంటే ఎక్కువ సార్లు నమోదు కాకుండా చూసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారు. కొత్తవారు ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే ఓటు ఉన్నవారు ఆధార్ అనుసంధానానికి ఫారం 6బీ పూర్తి చేయాలి. ఆన్‌లైన్‌లో ఎన్నికల సంఘానికి సమర్పించవచ్చు.

ఎన్‌వీఎస్‌పీలో నమోదు..

- కాస్తంత కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే ఎవరైనా సరే ఆన్‌లైన్‌లో 6బీ ద్వారా ఓటు కార్డుకు ఆధార్ నంబరును అనుసంధానం చేసుకోవచ్చు.
- మొదటిగా ఓటరు నేషనల్ ఓటర్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్.వి.ఎస్.పి)లో నమోదై ఉండాలి. ఒక వేళ నమోదు చేసుకోపోయినా తాజాగా ఎన్‌వీఎస్‌పిలో నమోదు చేసుకోవచ్చు.
- ముందుగా ఓటరు https://www.nvsp.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. దాన్ని క్లిక్ చేస్తే ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ తెరుచుకుంటుంది. ఇందులో ఫారం 6, ఫారం 6ఏ, ఫారం 6బీ, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులు ఉంటాయి.
- ఈ సేవలు పొందాలంటే ముందుగా లాగిన్, రిజిస్టర్ అనే దానిపై క్లిక్ చేస్తే కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. రిజిస్టర్ చేసుకున్న వారు తమ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో పోర్టల్‌లోకి వెళ్లవచ్చు.
- రిజిస్టర్ చేసుకోని వారు కింద ఉన్న లింక్‌ను క్లిక్ చేస్తే మరో పేజీ ఓపెన్ అవుతుంది. దానికి మీ సెల్ నంబర్ ఇచ్చి, వివరాలు నింపి క్లిక్ చేస్తే కొత్త పేజీ వస్తుంది. దానిలో మీ ఓటరు నంబరు, ఇతర వివరాలు నమోదు చేసి, పాస్‌వర్డ్ ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం యూజర్ నేమ్, పాస్‌వర్డ్ సాయంతో ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లోకి లాగిన్ కావచ్చు.



ఆన్‌లైన్‌లో ఉన్న ఎన్‌వీఎస్‌పీ పోర్టల్



రిజిస్ట్రేషన్ కావడానికి పోర్టల్

అనుసంధానం ఇలా..

- యూజర్ నేమ్, పాస్‌వర్డ్ సాయంతో ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. పేరు, ఓటరు కార్డు నంబర్, నియోజకవర్గం వంటి వివరాలతో దరఖాస్తు ఉంటుంది. దానిలో సెల్ నెంబర్, మెయిల్ ఐడీ వివరాలు నమోదు చేయాలి.
- ఆధార్ డీటెయిల్స్ అనే విభాగంలో ఆధార్ నెంబర్ నమోదు, నివాస ప్రాంతం, బాక్సులో ఉన్న క్యాప్చా నమోదు చేయాలి. పక్కనే ఉన్న ప్రివ్యూ క్లిక్ చేస్తే వివరాలతో కూడిన 6బి ఫారం కనిపిస్తుంది. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే సబ్మిట్ చేస్తే మీ 6బీ దరఖాస్తు ఎన్‌వీఎస్‌పీకి చేరినట్లే. వెంటనే రిఫరెన్స్ ఐడీ వస్తుంది. దాన్ని నమోదు చేసుకుని జాగ్రత్త చేసుకోవాలి. దాని ద్వారా భవిష్యత్‌లో మీ దరఖాస్తు స్టేటస్ తెలుసుకోవచ్చు.

ప్రత్యామ్నాయ పత్రాలు..

కొంతమంది ఆధార్ నంబర్ ఇవ్వడానికి ఇష్టపడరు. అలాంటి వారు 11 రకాల ప్రత్యామ్నాయ పత్రాల్లో ఏదో ఒకటి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎంజీఎన్ఆర్ఈజీఏ జాబ్‌కార్డు, బ్యాంకులు, పోస్టాఫీసులు ఇచ్చే ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలు, కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, ఫించన్ డాక్యుమెంట్, ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల సర్వీస్ గుర్తింపు కార్డు, భారత ప్రభుత్వ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ జారీ చేసిన గుర్తింపు కార్డులు వంటివి ఇవ్వవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. ఇప్పటికే బీఎల్ఓల ద్వారా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారు ఫారం 6బి ద్వారా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. మార్పులు, చేర్పులు ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. లేదా బీఎల్‌ఓలకు తెలియజేసినా ఫరవాలేదు.

– మురళీధర్‌నాయక్, ఎలక్షన్ డీటీ, ఆమదాలవలస మండలం

ఏఓ సువర్ణ బాధ్యతల స్వీకరణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి (ఏఓ)గా గ్రూప్-1 అధికారి పరపటి సువర్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షికి నియామక పత్రాలను ఆమె సమర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కీలక సమయంలో విధుల్లోకి రావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా వైద్యశాఖలో ప్రస్తుతం జరుగుతున్న పలు పోస్టుల నియామకాలకు సంబంధించి స్క్రూటినీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఓ మాట్లాడుతూ తనవంతు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు.



డీఎంహెచ్ఓకు నియామకపత్రాలు అందజేస్తున్న ఏఓ సువర్ణ

పటిష్టంగా పోలీసు గస్తీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నేర నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసు గస్తీలు మరింత పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆస్తి నేరాలు, రోడ్డు ప్రమాదాల కేసులపై వర్చువల్ విధానం ద్వారా సీఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న గ్రేవ్ ప్రాపర్టీ కేసులపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని సూచించారు. మహిళా పోలీసుల ద్వారా ఎల్.హెచ్.ఎం.ఎస్ సీసీ కెమెరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులపై సకాలంలో దర్యాప్తు చేపట్టాలన్నారు. పాత కేసుల్లో నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై విజిబుల్ వైట్ పెయింటింగ్స్, జీబ్రా మార్క్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అతి వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నివారణ చర్యల్లో భాగంగా 1903 టోల్ ఫ్రీ నంబర్‌పై గ్రామస్థాయిలో ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, సీఐలు ఆదాం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారైంది. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2022 పోటీలు జరగనున్నాయి. ఇందులో జిల్లా నుంచి పాల్గొనే 55 మంది క్రీడాకారుల జాబితాను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు (వాసు), ప్రధాన కార్యదర్శి నొపడ విజయ్‌కుమార్ సోమవారం వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 26న ఉదయం 8 గంటలకు గుంటూరులోని యూనివర్సిటీ క్రీడామైదానం వద్దకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు సంఘ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.సాంబమూర్తి(సెల్:8500271575)ను సంప్రదించాలని కోరారు.

ఎంపికైంది వీరే..

అండర్-14: ఎం.కృపాసింధు, జి.నిఖిల్, కె.రోహిత్, జి.లింగప్రధాన్, ఎస్.గోపాల్, బి.సోనియా, కె.తేజేశ్వని, కె.హారిక.

అండర్-16: పి.రాజ్‌కుమార్, సీహెచ్ రాజేష్, డి.చాణక్య, కె.కిషోర్, కె.వినోద్, బి.కృష్ణ, ఎస్.ధనరాజ్, ఓ.నాగరాజు, ఎం.బాలాంజలి, బి.లక్ష్మిభాయ్, బి.రమాభాయ్, సీహెచ్ భార్గవి, ఎం.శిరీష, జి.భాగ్యశ్రీ.

అండర్-18 : జె.రవి, టి.శ్యామ్‌సుందరరావు, బి.కాళి, జి.రాకేష్, ఆర్.మహేష్, జి.శ్యామ్, కె.ఉదయ్‌కిరణ్, జి.నేతాజి, జె.ఈశ్వరరావు, ఎస్.చైతన్య, జె.శివాని, బి.వెంకటలక్ష్మి, డి.నీలిమ, బి.ఝాన్సీ.

అండర్-20: బి.జయరామ్, కె.ప్రవీణ్, కె.వల్లభ, సీహెచ్ సురేష్, బి.మహేష్, బి.దుర్గాప్రసాద్, బి.గౌరీశంకర్, ఐ.మనోజ్‌కుమార్, పి.ప్రశాంత్, ఎ.సాహస్, జె.గణేష్, ఎం.కృష్ణంరాజు, బి.సోను, జి.భార్గవి, కె.సూర్యప్రభ, ఎ.విజయ, పి.ధనలక్ష్మి, పి.లావణ్య.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
మంగళవారం
23-8-2022





ఆమె మనసుకు రుచి తెలుసు

**ఆమెకు చూపు సరిగా లేదు.
కాని అద్భుతంగా వండుతుంది.
ఇలా వండమని యూ ట్యూబ్‌లో
వంటలు చేస్తూ అందరినీ
అభిమానులుగా మార్చుకుంది.
ఒకరు కాదు... ఇద్దరు కాదు
రెండున్నర లక్షల మంది సబ్‌స్క్రయిబర్లతో
స్టార్‌గా వెలుగుతున్న తెలుగు చెఫ్
బొడ్డు నాగలక్ష్మి.
ఈమె వీడియోలు చూశారా మీరు?**

'అందరికీ నమస్తే. నేను నాగలక్ష్మి, ఈమె కవిత. మేమిద్దరం వదిన మరదళ్ళం' అని మొదలవుతుంది నాగలక్ష్మి చేసే వీడియో. నిజానికి ఆమె చేసేది జంట వీడియో. ప్రతి వీడియోలోనూ వదిన కవిత ఉంటుంది. ఇద్దరి పేరు మీద 'కవిత నాగ వ్లోగ్స్' పేరుతో యూట్యూబ్ చానల్ ఉంది. 2020 వ సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలైన చానల్ రెండేళ్ల లోపే రెండున్నర లక్షల సబ్‌స్క్రయిబర్లను సాధించింది. నాగలక్ష్మికి ఆర్థిక ప్రోత్సాహం లభిస్తోంది. ఇంతచేసి నాగలక్ష్మికి చూపు లేదు. కాని అది ఆమె విజయానికి అడ్డంకి కాలేదు.

బతికిన పసిగుడ్డు

నెల్లూరు జిల్లా వరికుంటపాడుకు చెందిన రైతు కృష్ణారెడ్డి ఆఖరు కూతురు నాగలక్ష్మి. పుట్టుకతోనే చూపు లేదు. పురిట్లో చూసిన బంధువులు 'ఎందుకు కృష్ణారెడ్డి అవస్థ పడతావు. వడ్లగింజ వేసెయ్' అని సలహా ఇచ్చారు. కాని నాగలక్ష్మి తల్లి బిడ్డను గుండెలకు హత్తుకుంది. 'చూపులేకపోతే నా బిడ్డ కాకుండా పోతుందా' అంది. వయసు పెరిగాక అర్థమైన విషయం ఏమిటంటే నాగలక్ష్మికి ఎడమ కన్ను పూర్తిగా కనిపించదు. కుడికన్ను ఏదైనా వస్తువు దగ్గరగా పెట్టుకుంటే 5 శాతం కనిపిస్తుంది. అంటే ఆమె కుడికన్ను చాలా కొద్దిగా అతి దగ్గరి వస్తువులు (రెండు అంగుళాల దూరంలో) ఉంటే చూస్తుంది. అయినా సరే నాగలక్ష్మి బెదరలేదు. ఐదు వరకు బడికి వెళ్లింది. ఆ తర్వాత ఇంట్లో తల్లికి చేదోడు వాదోడుగా ఉండిపోయింది. నీళ్లు మోయడం మామూలు పనులు చేయడం చూపు లేకపోయినా అడుగుల అంచనాను బట్టి అలవాటు చేసుకుంది. కాని సమస్యలు ఆమెను వదల్లేదు.

తల్లి వియోగం

18 ఏళ్ల వయసులో తల్లి మరణించింది. అప్పటికి అక్కకు పెళ్లయి వెళ్లిపోవడంతో ఇంటిలో వంట పని నాగలక్ష్మి బాధ్యత అయ్యింది. తండ్రికి, అన్నయ్యకు ఆమే వండి పెట్టాల్సి వచ్చింది. కాని అన్నం వండటం తప్ప నాగలక్ష్మికి ఏమీ రాదు. అప్పుడు పక్కనే ఉండే ఒక అవ్వ ఆమెకు సాయం చేసింది. 'నువ్వు వండుతూ ఉండు. నేను పక్కన ఉండి సలహా ఇస్తుంటాను' అని పక్కన ఉండి వంట నేర్పించింది. ఆ అవ్వకు బాగా వండటం వచ్చు. అది నాగలక్ష్మికి కూడా వచ్చేసింది. అయినప్పటికీ ఇంట్లో ఆడతోడు లేకపోవడం వల్ల శారీరకంగా మానసికంగా వచ్చే ఇబ్బందులకు తోడు కోసం నాగలక్ష్మి బాధలు పడింది. అయితే ఆమె అన్న ఆదిరెడ్డి వివాహం చేసుకుని ప్రకాశం జిల్లాకు చెందిన బోండాల కవితను కోడలిగా తేవడంతో ఆమె జీవితానికి పెద్ద ఆసరా దొరికింది.



అన్న ఆదిరెడ్డితో నాగలక్ష్మి

యూట్యూబ్ ప్రయోగాలు

2018లో నాగలక్ష్మి అన్న ఆదిరెడ్డి యూట్యూబ్ చానల్ ప్రారంభించి 'బిగ్‌బాస్' షో మీద కామెంటరీ చెప్పేవాడు. ఆ వీడియోలు హిట్ అయ్యి అతనికి పేరు వచ్చింది. ఆ సందర్భంలో ఒకరోజు నాగలక్ష్మి చేత సరదాగా కామెంటరీ చెప్పిస్తే ఆ వీడియో అందరూ బాగుందన్నారు. అప్పటికి నాగలక్ష్మికి సీరియల్స్ పిచ్చి బాగా ఉండేది. టీవీలో సీరియల్స్‌ను చూసేది (వినేది). ఫోన్‌లో అయితే కంటికి దగ్గరగా పెట్టుకుంటే సీరియల్ బూజరగా కనిపిస్తుంది. అందువల్ల ఆదిరెడ్డి ఆమె చేత 'సీరియల్ పిచ్చి' అనే షో చేయించాడు. కాని దానికి పెద్ద స్పందన రాలేదు. కాని 2020లో లాక్‌డౌన్ సమయంలో నాగలక్ష్మి, కవిత కలిసి వంట వీడియోలు మొదలెట్టారు. ఇద్దరూ మంచి మాటకారులు కావడంతో రెండు రోజుల్లోనే 10 వేల మంది సబ్‌స్క్రయిబర్లు వచ్చారు. 'కవిత నాగ వ్లోగ్స్' అలా మొదలైంది.

జామకాయ రోటి పచ్చడి నెల్లూరు పప్పుచారు

తనకు చూపు లేదని ఈసురోమనడం నాగలక్ష్మి స్వభావంలో లేదు. ప్రతి వీడియోలో వదినతో కలిసి హుషారుగా కబుర్లు చేస్తుంది. చూపున్నట్టే వంటగదిలో కదలుతూ వంట చేస్తుంది. వదిన మరదలు కలిసి స్థానిక వంటలు రకరకాలుగా చేస్తూ భారీగా అభిమానులను కూడగట్టుకున్నారు. నాగలక్ష్మి చేసే పప్పుచారుకు పెద్ద గిరాకీ ఉంది. అలాగే చుక్కకూర పచ్చడి వీడియో పెద్ద హిట్ అయ్యింది. పచ్చి జామకాయ రోటి పచ్చడి కూడా ఈమె రుచి చూపించింది. చపాతీ లడ్డు మరో వెరైటీ. నెల్లూరు చేపల పులుసును అథెంటిక్‌గా చేసి చూపిస్తుంది. 'నేను నూనె ఎక్కువ వేశానని ఒక్కరు కూడా అనరు. అంత సరిగ్గా వేస్తాను' అంటుంది నాగలక్ష్మి.



వదిన కవితతో నాగలక్ష్మి

రకరకాల కామెంట్లు

నాగలక్ష్మి వీడియోలకు 40 ఏళ్లు దాటిన అభిమానులు ఎక్కువ. అయితే ఈ వదిన మరదళ్ల మధ్య కూడా తంపులు పెట్టడానికి అన్నట్టు వీడియోల కింద కొందరు కామెంట్లు పెట్టారు. వీరు విడిపోయారని కూడా అన్నారు. కాని వదిన మరదళ్లు కలిసి వీడియోలు చేస్తూనే ఉన్నారు. తమ ఇంట్లో జరిగే ప్రతి విశేషాన్ని దాపరికం, శషభిషలు లేకుండా వ్యూయెర్స్‌తో పంచుకోవడమే వీరి వీడియోలలో విశేషం.

'చిన్న చిన్న సమస్యలతో ఆత్మహత్యలు చేసుకునేవారి వార్తలు వింటుంటాను. ఎటువంటి సవాలునైనా ఎదుర్కోవాలనేదే నా సలహా' అని నాగలక్ష్మి అంటుంది. తన సంపాదన నుంచి సోనూసూద్ ఫౌండేషన్‌కు, సిఎం రిలీఫ్ ఫండ్‌కు డొనేట్ చేసింది నాగలక్ష్మి.

అపజయం ఆమె కంట పడలేదు. ఆమె తన ప్రతి అడుగులోనూ వినేది గెలుపు పిలుపునే.

మిస్ యూనివర్స్

అందమైన ముందడుగు

'స్వీయ-వ్యక్తీకరణకు వేదిక' అంటూ తన గురించి ఘనంగా పరిచయం చేసుకుంటుంది మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ (ఎంయూఓ)

అయితే స్వీయ-వ్యక్తీకరణకు ఆర్గనైజేషన్ రూల్‌బుక్‌లో కొన్ని నిబంధనలు అడ్డుపడుతున్నాయని, పరిమితులు విధిస్తున్నాయనే విమర్శ ఉంది.

మొన్నటి వరకు-

'ఆ నిబంధనలు అంతే. అప్పుడూ ఉన్నాయి. ఎప్పుడూ ఉంటాయి' అన్నట్లుగా వ్యవహరించిన ఆర్గనైజేషన్ ఒక చారిత్రక మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది...

మిస్ యూనివర్స్ 2023 పోటీలో వివాహితులు, మాతృమూర్తులు కూడా నిరభ్యంతరంగా పాల్గొనవచ్చు. నిబంధనను సవరించడానికి శ్రీకారం చుట్టడం ద్వారా విప్లవాత్మకమైన, చారిత్రాత్మక మార్పు దిశగా అడుగు వేసింది ఎంయూవో. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం విశ్వసుందరి పోటీల్లో వివాహితులు, మాతృమూర్తులు పాల్గొనడానికి అనర్హులు. టైటిల్ దక్కించుకున్నవారు కొత్త విజేత ఆగమనం వరకు సింగిల్‌గానే ఉండాలి.

'ఎంయూవో'లో వచ్చిన మార్పుపై తన సంతోషాన్ని వ్యక్తపరిచింది ఆండ్రియా మెజా. మెక్సికోకు చెందిన ఆండ్రియా 'మిస్ యూనివర్స్ 2020' కిరీటాన్ని దక్కించుకున్న విజేత. 'సమాజంలో రోజురోజుకు ఎన్నో మార్పులు వస్తున్నాయి. అవి ఆయా రంగాలలో ప్రతిఫలిస్తున్నాయి. మహిళలు నాయకత్వ స్థానాల్లోకి వెళుతున్నారు. తమను తాము నిరూపించుకుంటున్నారు. మార్పు అన్ని రంగాలలోనూ రావాలి. దీని ప్రకారం చూసినప్పుడు మిస్ యూనివర్స్ పోటీలో వివాహితులు, తల్లులకు ప్రవేశం కల్పించడం అనేది ఆహ్వానించదగిన, హర్షించాల్సిన మార్పు. అయితే ఈ నిర్ణయం కొద్దిమందికి రుచించక పోవచ్చు. దీనికి కారణం వారి వ్యక్తిగత స్వార్థం తప్ప మరేదీ కాదు. ప్రస్తుత మార్గదర్శకాలలో అవాస్తవికత కనిపిస్తుంది. పెళ్లి, మాతృత్వంలాంటి వ్యక్తిగత నిర్ణయాలు వారి ప్రతిభకు అడ్డంకి కావడం అనేది సమర్థనీయం కాదు. ఇరవై ఏళ్లకే పెళ్లై పిల్లలు ఉన్నవారు ఉన్నారు. వారిలో ఎంతోమందికి మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనాలనే కల ఉండవచ్చు. నిబంధనల వల్ల తమ కలను సాకారం చేసుకునే అవకాశం దక్కి ఉండకపోవచ్చు. తాజా మార్పు వల్ల ఇలాంటి మహిళల జీవితాల్లో అనూహ్యమైన మార్పు వస్తుంది' అంటుంది ఆండ్రియా మెజా.

'ఇది మొదటి అడుగు. ఇంకా ఎన్నో అడుగులు పడాలి' అంటుంది బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త అక్షర.

విడాకులు తీసుకున్నవారు, అబార్షన్ చేయించుకున్నవారు పోటీలో పాల్గొనడానికి అనర్హులు అనేది ఒకప్పుడు 'మిస్ అమెరికా' నిబంధనలలో ఉండేది. మోడల్ వెరోనిక 2018లో 'మిస్ ఉక్రెయిన్' టైటిల్‌ను గెల్చుకుంది. అయితే ఆమె అయిదు సంవత్సరాల పిల్లాడికి తల్లి అని ఆలస్యంగా తెలుసుకున్న ఆర్గనైజేషన్ ఆ టైటిల్‌ను వెనక్కి తీసుకుంది. టైటిల్‌ను వెనక్కి తీసుకోవడంపై మండిపడడమే కాదు న్యాయపోరాటానికి కూడా సిద్ధపడింది వెరోనిక. 'రూల్ అంటే రూలే అనుకునే రోజులకు కాలం చెల్లింది. కాలంతోపాటు అవి మారితేనే కాలానికి నిలబడతాయి' అంటుంది జైపూర్‌కు చెందిన శాన్వి.



హర్నాజ్ సంధు, ఆండ్రియా మెజా

తాజాగా 70 వసంతాల ప్రత్యేక సంచికను ఆవిష్కరించింది మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్. ఇది డిజిటల్ సంచిక. '175, 000 పేపర్ పేజీల అవసరం లేకుండా ఈ డిజిటల్ సంచిక తీసుకువచ్చాం' అంటుంది ఆర్గనైజేషన్ పర్యావరణహిత స్వరంతో. ఇది బాగానే ఉంది గానీ, మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్‌లోని నిబంధనలు, భావజాలానికి సంబంధించి (వర్ణం, ఒడ్డూపొడుగు...ఇలాంటివి మాత్రమే అందానికి నిర్వచనాలా!) ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శిబిరాల నుంచి ఎన్నో అభ్యంతరాలు ఉన్నాయి. చెవియొగ్గి, వాటిని సానుకూలంగా అర్థం చేసుకొని ముందుకు కదిలితే సంస్థకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభించడానికి అట్టే కాలం పట్టదు.



మిస్ యూనివర్స్ 2021: హర్నాజ్ సంధు

సాగుబడి
మఘ కార్తె : ఆగస్టు 17 నుంచి 29 వరకు



కొబ్బరి పొట్టుతో సేంద్రియ ఎరువు!

● ముడి కొబ్బరి పొట్టును శిలీంధ్రంతో కుళ్లబెట్టి... కొబ్బరి పొట్టు కంపోస్టు తయారు చేసుకోవచ్చు ● గ్రోబాగ్స్‌లో మట్టి లేని ఇంటిపంటల (కోకోపోనిక్స్) సాగు... నర్సరీ మొక్కల పెంపకంతో పాటు... పంటపొలాల భూసారం పెంపుదలకు ఉపయోగకరం

కొబ్బరి పొట్టుతో తయారు చేసిన సేంద్రియ ఎరువు 'మట్టి లేని సేద్యాని'కి ఉపయోగపడుతోంది. నిస్సారమైన భూముల్లో లేదా సాగుకు నేల అందుబాటులో లేని అర్బన్ ప్రాంతాల్లో నివాస గృహాల పైన, మిద్దెలపైన, గేటెడ్ కమ్యూనిటీల్లోని ఖాళీ స్థలాల్లో.. గ్రో బ్యాగ్‌లలో కొబ్బరి పొట్టు ఎరువు (కంపోస్టు)తో.. కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కల సాగుకు మట్టి లేని సేద్యం ఉపకరిస్తుంది. తామర తంపరగా పట్టణీకరణ విస్తరిస్తున్న నేపథ్యంలో ఎక్కువ జనం కూడే పట్టణాలు, నగరాల దగ్గర్లోనే తాజా కూరగాయలు, ఆకుకూరల లభ్యతను పెంచడానికి ఈ సేద్యం ఉపయోగకరమని బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) చెబుతోంది. ఆ విశేషాలు ఈ నెల 16న 'సాక్షి సాగుబడి'లో ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొబ్బరి పొట్టుతో చక్కటి సేంద్రియ ఎరువు తయారీ పద్ధతి గురించి తెలుసుకుందాం..

కొబ్బరి డొక్కల నుంచి ఒక కేజీ పీచును వేరు చేసే క్రమంలో 6 నుంచి 8 కేజీల కొబ్బరి పొట్టు వస్తుంది. ఈ ముడి పొట్టును నేరుగా వ్యవసాయంలో వినియోగించకూడదు. ముడి కొబ్బరి పొట్టులోని 'కర్బనం-నత్రజని' నిష్పత్తి మొక్కలకు అనుకూలం కాదు. దీనిలో 'లెగ్నిన్' కూడా అధిక మోతాదులో ఉంటుంది. అందువల్ల దీన్ని కుళ్లబెట్టకుండా నేరుగా వాడితే మొక్కలకు హాని జరుగుతుంది. కొబ్బరి పొట్టును ఒక శిలీంధ్రం కలిపి కుళ్లబెడితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. మట్టి లేని సేద్యానికే కాకుండా.. సాధారణ పొలాల్లో పంటల సాగులో కూడా సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చు. కొబ్బరి పొట్టును సులువుగా సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను సెంట్రల్ కాయిర్ బోర్డు ప్రమాణీకరించింది. 'ప్లూరోటస్ సాజర్ కాజు'అనే శిలీంద్రాన్ని ఉపయోగించి పొట్టును వేగంగా కుళ్లబెట్టే ప్రక్రియను కాయిర్ బోర్డు రైతులకు పరిచయం చేసింది. రసాయనిక పదార్థాలు వాకుండా ప్లూరోటస్ సాజర్ కాజు, అజొల్లా, వేప పిండిని వినియోగిస్తూ వేగంగా కొబ్బరి పొట్టును కుళ్లబెట్టే విధానం ఇది. కోనసీమ రైతుల 'కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ' కొబ్బరి పొట్టు ఎరువును తయారు చేస్తోంది.



కాయిర్ బోర్డు సరఫరా చేస్తున్న శిలీంధ్రం ప్యాకెట్

కొబ్బరి పొట్టు ఎరువు తయారీకి కావలసిన పదార్థాలు:

● టన్ను కొబ్బరి పొట్టు (బేబీయార్న్ తొలగించినది) ● 10 కేజీల అజొల్లా ● 30 కేజీల వేప పిండి. ● 5 కేజీల ప్లూరోటస్ సాజర్ కాజూ శిలీంధ్రం. వీటిని పొరలు, పొరలుగా వేసి తడుపుతూ ఉంటే నెల రోజుల్లో బాగా చివికిన కొబ్బరి పొట్టు ఎరువు తయారవుతుంది. ● ప్లూరో టస్ సాజార్ కాజూ శిలీంధ్రం ధవళేశ్వరంలోని కాయిర్ బోర్డు రీజనల్ కార్యాలయంలో లభిస్తుంది.


– నిమ్మకాయల సతీష్‌బాబు, సాక్షి అమలాపురం

కొబ్బరి పొట్టుతో కంపోస్టు తయారీ ఇలా..

● ఒక టన్ను కొబ్బరి పొట్టుకు 12 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు, 2 అడుగుల ఎత్తున బెడ్ తయారు చేసుకోవాలి. ముందుగా 200 కేజీల కొబ్బరి పొట్టును సమతలంగా, నీడగా ఉన్న ప్రదేశంలో ఒక పొరలా వేయాలి. దీనిపై నీరు చిలకరించి (సుమారు 20 లీటర్లు) ఒక కేజీ ప్లూరోటస్ సాజర్ కాజూ శిలీంద్రాన్ని వెదజల్లాలి. దీనిపై మళ్లీ 200 కేజీల పొట్టు వేయాలి. పొట్టు వేసిన తరువాత అజోల్లా, వేపపిండి మిశ్రమం 20 కేజీలు వేయాలి. 20 లీటర్ల నీరు పోసి మళ్లీ 200 కేజీల పొట్టు వేయాలి ● తరువాత ప్లూరోటస్ సాజర్ కాజు 2 కేజీలు వేసి నీరు చల్లి, తిరిగి 200 కేజీల పొట్టు వేయాలి. తరువాత నీటితో తడపాలి. మరోసారి మిగిలిన 20 కేజీల అజొల్లా, వేప పిండి మిశ్రమం, ప్లూరోటస్ శిలీంధ్రం 2 కేజీలు చల్లి.. దానిపై నీరు చిలకరించి, మిగిలిన 200 కేజీల కొబ్బరి పొట్టును వేసి నీరు చల్లాలి. కనీసం 30 రోజులు దీనిపై ప్రతి రోజూ స్వల్పమోతాదులో నీరు చల్లి తడపాల్సి ఉంది. నెల రోజుల్లో పొట్టు బాగా కుళ్లి మంచి ఎరువుగా తయారవుతుంది.

కొబ్బరి పొట్టు ఎరువు తయారీకి మరో పద్ధతి కూడా ఉంది. గ్లైరిసీడియా (గిరిపుష్పం) చెట్ల ఆకులు, గోమూత్రం కలిపిన పశువుల పేడ, ముడి కొబ్బరి పొట్టును పొరలుపొరలుగా వేసి కుళ్లబెట్టినా కొబ్బరి పొట్టు కంపోస్టు తయారవుతుంది. అయితే, ఈ పద్ధతిలో రెండు నెలల సమయం పడుతుంది.

అతివృష్టిలోనూ ఆశాకిరణం



1



2



3

ఎత్తుమడులపై పత్తి.. సేఫ్!

● ఏడాది కురవాల్సిన వాన రెండు నెలల్లో కురిసినా పత్తి పంటను కాపాడిన ఎత్తుమడులు (రైజ్డ్ బెడ్స్) ● ఎత్తుమడులపై విత్తిన పత్తి పెరుగుదల ఆశాజనకం ● సంతృప్తికరమైన దిగుబడిపై రైతుల్లో భరోసా ● సాధారణంగా విత్తిన పొలాల్లో గిడసబారి కునారిల్లుతున్న పంట

వానాకాలం మొత్తం కురిసే వర్షపాతం రెండు నెలల్లోనే కురిసిన అతివృష్టి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పంటలను చావు దెబ్బ తీసింది. అయితే, సంతోషకరమైన విషయం ఏమిటంటే.. ఎత్తుమడులు లేదా బోదెలపై పత్తి, సోయా వంటి పంటలు సాగు చేసిన రైతులు అతివృష్టి నష్టాల బారి నుంచి చాలా వరకు తప్పించుకోగలిగారు.

సాధారణ పత్తి పొలాలు అధిక వర్షాలకు దెబ్బతిని ఎదుగుదల లేక కునారిల్లుతుండగా.. ఎత్తుమడులపై విత్తిన పత్తి పెరుగుదల చాలా బాగుంది. ఈ రెండు రకాల పొలాల్లో పంట ఎత్తులో భారీ తేడా కనిపిస్తున్నది. ఈ తేడా దిగుబడిలో కూడా ప్రతిఫలిస్తుందనటంలో సందేహం లేదు.

ఈ వానాకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం జిల్లాలో 572 మి.మీ.లు కాగా, 1041 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇది 82 శాతం అధికం. ఈ అతివృష్టి కారణంగా జిల్లాలో 67,945 ఎకరాల్లో పత్తి పంటను రైతులు నష్టపోయారు. మొత్తంగా సోయా, కందులు, ఇతర పంటలు కలిపి లక్షకు పైగా ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు నష్టపోయారు.

నీటి ముంపులో నుంచి కొన్ని రోజుల తర్వాత బయటపడ్డ పత్తి మొక్కల్లో ఎదుగుదల లోపించింది. అయితే, ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో 7 ఎకరాల్లో ఎత్తుమడుల పద్ధతిలో గత నాలుగేళ్లుగా శాస్త్రవేత్తలు పత్తి సాగు చేస్తున్నారు. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా ఎత్తుమడులు పంటను ఆదుకుంటాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. శాస్త్రవేత్తల సలహామేరకు ఈ వానాకాలంలో పలువురు రైతులు ఎత్తుమడుల పద్ధతిలో పత్తి సాగు చేయగా పంట ఏపుగా పెరుగుతోంది. సాధారణ పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో పంట దెబ్బతినటం స్పష్టంగా కనిపిస్తోంది.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, సాక్షి ప్రతినిధి, ఆదిలాబాద్,
ఫొటోలు: చింతల అరుణ్ రెడ్డి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

(ఫొటో:01) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఎత్తుమడుల(రైజ్డ్ బెడ్స్)పై సాగవుతున్న పత్తి పంట జూన్, జూలై నెలల్లో అతివృష్టితో చాలా రోజుల పాటు నీట మునిగినప్పటి దృశ్యం. ఆదిలాబాద్ అర్బన్‌లో సాధారణ వర్షపాతం 562 మి.మీ.లు కాగా, 790 మి.మీ.లు కురిసింది. ఇది సాధారణం కంటే 40% అధికం. (ఫొటో:02, 03) కృషి విజ్ఞాన కేంద్రంలో ఎత్తుమడులపై ఏపుగా పెరిగిన పత్తి పంట. పత్తి మొక్క ప్రస్తుతం 60-65 సెం.మీ.ల ఎత్తు పెరిగింది. పూత, కాత మామూలుగానే ఉంది. దిగుబడి ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు రావచ్చు

సగం దిగుబడైనా వస్తుందా?



ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 15 కిలో మీటర్ల దూరంలో ఉండే తాంసి మండలం వడ్డాడి గ్రామానికి చెందిన రైతు అరవింద్ సాధారణ పద్ధతిలో 9 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. జూన్, జూలైలలో సాధారణ వర్షపాతం 518 మి.మీ.లు కాగా, 857 మి.మీ.లు కురిసింది. 65% అధికం. అతివృష్టి కారణంగా పొలంలో నీరు నిలిచి పంట దెబ్బతింది. ఎత్తు 35-40 సెం.మీ.ల మధ్య ఉంది. దిగుబడి సగమైనా వస్తుందా అన్నది ప్రశ్నార్థకమే!

ఎత్తుమడుల సాగు పద్ధతిపై రైతులు మొగ్గు చూపుతున్నారు

ఎత్తుమడుల పద్ధతిలో పత్తి, సోయా పంటలను సాగు చేయవచ్చు. ఆదిలాబాద్ కేవీకే సూచనలు, సలహాలు పాటిస్తూ జిల్లాలో ప్రస్తుతం తలమడుగు మండలంలో 25 మంది రైతులు ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లోనూ ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. సాధారణ పద్ధతి, ఎత్తుమడుల పద్ధతిలో పత్తి సాగు చేసిన క్షేత్రాలను పరిశీలిస్తే.. అధిక వర్షాల్లో ఎత్తుమడులతో ప్రయోజనం ఏమిటో స్పష్టంగా తెలుస్తున్నది.



– డా.వై.ప్రవీణ్ కుమార్ (99896 23829)
సమన్వయకర్త, కేవీకే, ఆదిలాబాద్



ఎత్తుమడులతో ఫలితం మిన్న

ఎత్తుమడులపై కేవీకే శాస్త్రవేత్తల సలహా ప్రకారం పదెకరాల్లో ఈ వానాకాలంలో పత్తి సాగు చేపట్టాను. జూలైలో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వర్షం నీళ్లు వచ్చినట్టే వెళ్లిపోయాయి. నా పక్కన ఉన్న సాధారణ పత్తి చేనుతో పోల్చితే తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అధిక వర్షాలు కురిసినా పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా.

– మారుతి (99897 02160),
పత్తి రైతు, సకినాపూర్ గ్రామం,
తలమడుగు మం., ఆదిలాబాద్ జిల్లా

భారీ వర్షాలతోనూ పెద్ద నష్టం లేదు

కేవీకే శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాతో ఎత్తుమడుల పద్ధతిలో పత్తి సాగు చేశాను. మల్చింగ్ షీట్ కూడా వేశాను. భారీ వర్షాలు కురిసినప్పటికీ నా పత్తి పంటకు పెద్దగా నష్టం జరగలేదు. మొక్క ఏపుగా పెరిగింది. పూత వస్తున్నది. మొత్తంగా ఈ సీజన్‌లో పత్తి దిగుబడి బాగా వస్తుందని ఆశిస్తున్నాను.



– కరుణాకర్ రెడ్డి (99893 48444),
పత్తి రైతు,
తలమడుగు,
ఆదిలాబాద్
జిల్లా

కోకోపోనిక్స్/మట్టిలేని సేద్యంపై శిక్షణ రేపు

కొబ్బరి పొట్టు ఎరువులో పోషక ద్రావణంతో గ్రోబాగ్స్‌లో ఇంటిపై కూరగాయలు, ఔషధ మొక్కలను పెంచే కొత్త పద్ధతే కోకోపోనిక్స్ లేదా మట్టిలేని సేద్య పద్ధతి. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) ఈ నెల 24(బుధవారం)న ఆంగ్లంలో ఆఫ్‌లైన్/ ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది (ఈ సాగు పద్ధతిపై ఈ నెల 16న 'సాగుబడి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే). కొబ్బరి పొట్టు ఎరువును ఉపయోగించి టెర్రస్/ బాల్కనీలో వివిధ ఉద్యాన పంటలను పండించడానికి అవసరమైన నైపుణ్యం, పరిజ్ఞానాన్ని ఈ శిక్షణ అందిస్తుందని ఐఐహెచ్ఆర్‌లో కోకోపోనిక్స్ నిపుణుడు డా. కరైవానన్ తెలిపారు. ఎవరైనా అర్హులే. బెంగళూరులోని ఐఐహెచ్ఆర్‌కు వెళ్లి స్వయంగా హాజరయ్యే వారికి ఫీజు రూ. 2 వేలు. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందగోరే వారికి ఫీజు రూ.500. **పేర్ల నమోదు కోసం, క్రింది లింక్‌ను సందర్శించండి:**
https://forms.gle/tx4i5BJnqDVUZGed6 ఇతర వివరాలకు: 77608 83948



టిమ్ పెయిన్ పునరాగమనం

ఆస్ట్రేలియా జట్టు మాజీ కెప్టెన్ టిమ్ పెయిన్ మళ్లీ క్రికెట్ మైదానంలోకి అడుగు పెడుతున్నాడు. 2017లో ఒక మహిళకు అసభ్యకర సందేశాలు పంపిన వివాదం వెలుగులోకి రావడంతో గత ఏడాది నవంబర్‌లో ఆసీస్ టెస్టు కెప్టెన్సీ పదవికి రాజీనామా చేయడంతో పాటు ఆటనుంచి కూడా అతను విరామం తీసుకున్నాడు. ఇప్పుడు తాజాగా తన దేశవాళీ జట్టు టాస్మేనియా ప్రాక్టీస్ సెషన్‌లో అతను కూడా పాల్గొన్నాడు. అక్టోబర్ 6 నుంచి జరిగే షెఫీల్డ్ షీల్డ్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో పెయిన్ బరిలోకి దిగే అవకాశం ఉంది.

షాహిన్ స్థానంలో హస్‌నైన్‌కు చోటు



ఆసియా కప్‌లో పాల్గొనే పాకిస్తాన్ జట్టులో పేస్ బౌలర్ మొహమ్మద్ హస్‌నైన్‌కు స్థానం లభించింది. గాయంతో టోర్నీకి దూరమైన షాహిన్ అఫ్రిది స్థానంలో అతడిని ఎంపిక చేశారు. పాక్ తరఫున 8 వన్డేల్లో 12 వికెట్లు, 18 టి20ల్లో 17 వికెట్లు తీసిన హస్‌నైన్ అంతర్జాతీయ టి20ల్లో 'హ్యాట్రిక్' కూడా నమోదు చేశాడు. మరో వైపు శ్రీలంక కీలక పేసర్ దుష్మంత చమీరా కూడా గాయం కారణంగా ఆసియా కప్‌నుంచి తప్పుకున్నాడు.

'క్లీన్‌స్వీప్'

- జింబాబ్వేపై ఆఖరి వన్డేలోనూ భారత్ గెలుపు
- శుబ్‌మన్ గిల్ సెంచరీ
- 3–0తో సిరీస్ సొంతం




రజా

హరారే: తొలి వన్డేలో భారత ఓపెనర్ల ధాటికే జింబాబ్వే చేతులెత్తేసింది. రెండో వన్డేలో ఆతిథ్య జట్టు కాస్త ప్రతిఘటించింది. కానీ ఆఖరి పోరులో మాత్రం భారత బృందాన్ని వణికించింది. భారీస్కోరు... ఇక గెలుపు సులువనుకున్న మ్యాచ్‌లో సికందర్ రజా (95 బంతుల్లో 115; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) ఒంటరి పోరాటం రాహుల్ సేనలో గుబులు రేపింది. ఆఖర్లో కళ్లు తెరిచిన భారత బౌలర్లు ఆలౌట్ చేయడంతో ఊపిరి పీల్చుకుంది. చివరి దాకా శ్రమించిన భారత జట్టు 13 పరుగుల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. మొదట భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (97 బంతుల్లో 130; 15 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా, ఇషాన్ కిషన్ (61 బంతుల్లో 50; 6 ఫోర్లు) రాణించాడు. బ్రాడ్ ఇవాన్స్ 5 వికెట్లు తీశాడు. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన జింబాబ్వే 49.3 ఓవర్లలో 276 పరుగుల వద్ద ఆలౌటైంది. సికందర్ రజాతో పాటు సియాన్ విలియమ్స్ (46 బంతుల్లో 45; 7 ఫోర్లు) రాణించాడు.

'శతక' శుబ్‌మన్

ఓపెనర్లు ధావన్ (68 బంతుల్లో 40; 5 ఫోర్లు), రాహుల్ (46 బంతుల్లో 30; 1 ఫోర్, 1 సిక్స్) తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు. వీళ్లిద్దరు అవుటయ్యాక పరుగుల బాధ్యత శుబ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ పంచుకున్నారు. జింబాబ్వే బౌలర్ల సహనానికి పరీక్ష పెడుతూ ఏకంగా 21.1 ఓవర్ల పాటు క్రీజులో నిలిచి మూడో వికెట్‌కు 140 పరుగులు జోడించారు. ఈ క్రమంలో గిల్ (51 బంతుల్లో; 6ఫోర్లు), కిషన్ (61 బంతుల్లో; 6 ఫోర్లు) ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. జట్టు స్కోరు 224 వద్ద కిషన్ రనౌట్ కాగా, స్వల్ప వ్యవధిలో


గిల్

దీపక్ హుడా (1), సంజూ సామ్సన్ (15) అవుటయ్యారు. వేగం పెంచిన గిల్ (82 బంతుల్లో; 12 ఫోర్లతో) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి ఓవర్లో గిల్‌తో పాటు శార్దుల్ (9)ను ఇవాన్స్ అవుట్ చేశాడు.

వణికించిన

భారీ లక్ష్యం కావడంతో పోటీ ఇవ్వలేని జట్టుతో ఏకపక్ష విజయం ఖాయమనుకున్నారంతా! అనుకున్నట్లే టీమిండియా బౌలర్లు ఓపెనర్లు కై టానో (13), ఇన్నోసెంట్ కైయా (6), టోని (15)లను త్వరగానే పెవిలియన్ చేర్చారు. సియాన్ విలియమ్స్ మెరుగ్గా ఆడటంతో 100 పరుగులు దాటింది. కానీ కెప్టెన్ చకాబ్వా (16), రియాన్ బర్ల్ (8), జాంగ్వే (14)లను కూడా అవుట్ చేయడంతో 169 పరుగుల వద్ద 7 వికెట్లు కూలాయి. ఈ దశలో సికందర్ రజా, ఇవాన్స్(28)తో కలిసి ఊహించని విధంగా జట్టును నడిపించాడు. 8వ వికెట్‌కు 104 పరుగులు జోడించడంతో జింబాబ్వే గెలుపువాకిట నిలిచింది. 88 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో రజా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇవాన్స్‌ను అవేశ్ అవుట్ చేయడంతో మ్యాచ్ చేతుల్లోకి వచ్చింది. కాసేపటికే రజా కూడా భారీ షాట్‌కు యత్నించి బౌండరీ లైను వద్ద గిల్ చేతికి చిక్కాడు. విక్టర్ (0)ను అవేశ్ బౌల్డ్ చేయడంతో జింబాబ్వే ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) విలియమ్స్ (బి) ఇవాన్స్ 40; రాహుల్ (బి) ఇవాన్స్ 30; గిల్ (సి) కైయా (బి) ఇవాన్స్ 130; ఇషాన్ కిషన్ రనౌట్ 50; దీపక్ హుడా (బి) ఇవాన్స్ 1; సామ్సన్ (సి) కైటనో (బి) జాంగ్వే 15; అక్షర్ (సి) రజా (బి) న్యాచి 1; శార్దుల్ (సి) న్యాచి (బి) ఇవాన్స్ 9; దీపక్ నాటౌట్ 1; కుల్దీప్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు)** 289.

వికెట్ల పతనం: 1–63, 2–84, 3–224, 4–227, 5–256, 6–272, 7–282, 8–286.

బౌలింగ్: రిచర్డ్ 9–0–58–0, విక్టర్ న్యాచి 10–1–48–1, బ్రాడ్ ఇవాన్స్ 10–0–54–5, సికందర్ రజా 10–1–39–0, జాంగ్వే 5–0–49–1, సియాన్ విలియమ్స్ 5–0–30–0, మున్యోంగా 1–0–10–0.

జింబాబ్వే ఇన్నింగ్స్: కైటానో (స్టంప్) ఇషాన్ (బి) కుల్దీప్ 13; కై యా (ఎల్బీ) (బి) చహర్ 6; విలియమ్స్ (ఎల్బీ) (బి) అక్షర్ 45; మున్యోంగా (సి) రాహుల్ (బి) అవేశ్ 15; రజా (సి) గిల్ (బి) శార్దుల్ 115; చకాబ్వా (సి) అండ్ (బి) అక్షర్ 16; బర్ల్ (సి) ధావన్ (బి) చహర్ 8; జాంగ్వే (సి) గిల్ (బి) కుల్దీప్ 14; ఇవాన్స్ (ఎల్బీ) (బి) అవేశ్ 28; రిచర్డ్ (నాటౌట్) 2; విక్టర్ (బి) అవేశ్ 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్)** 276.

వికెట్ల పతనం: 1–7, 2–82, 3–84, 4–120, 5–122, 6–145, 7–169, 8–273, 9–275, 10–276.

బౌలింగ్: దీపక్ చహర్ 10–0–75–2, అవేశ్ 9.3–1–66–3, శార్దుల్ 9–0–55–1, కుల్దీప్ 10–0–38–2, దీపక్ హుడా 1–0–9–0, అక్షర్ 10–1–30–2.

శ్రీకాంత్, లక్ష్యసేన్ ముందంజ

- సాయిప్రణీత్ నిష్క్రమణ
- బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్



టోక్యో: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్లలో విజయాలు సాధించి ముందంజ వేయగా, మరో భారత ఆటగాడు బి.సాయిప్రణీత్ పోరు మొదటి మ్యాచ్‌లోనే ముగిసింది. మహిళల సింగిల్స్‌లో కూడా మాళవిక బన్సోద్ తొలి రౌండ్‌ను దాటలేకపోయింది.

2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన సాయిప్రణీత్ 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో నాలుగో సీడ్ చౌ టీన్ చెన్ (చైనీస్ తైపీ) ముందు తలవంచాడు. చెన్ 21–15, 15–21, 21–15 స్కోరుతో సాయిప్రణీత్‌ను ఓడించాడు. 51 నిమిషాల పాటు ఆసక్తికరంగా సాగిన మరో పోరులో 12వ సీడ్ శ్రీకాంత్ 22–20, 21–19 తేడాతో ఎన్‌హట్ గుయెన్ (ఐర్లాండ్)పై విజయం సాధించాడు. 9వ సీడ్ లక్ష్య సేన్ 21–12, 21–11తో క్రిస్టియాన్ సోల్‌బర్గ్ (డెన్మార్క్)ను చిత్తు చేయగా, ప్రణయ్ 21–12, 21–11 స్కోరుతో ల్యూకా రాబర్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 14–21, 12–21తో లైన్ క్రిస్టోఫర్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓటమిపాలైంది.

మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి– అశ్విని పొన్నప్పతో పాటు పూజ దండు–సంజనా సంతోష్ జోడి కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో సిక్కి–అశ్విని 21–7, 21–19తో అమీనత్ నబీహా – ఫాతిమా నబాహా (మాల్దీవులు)ను చిత్తుగా ఓడించారు. పూజ–సంజన 21–6, 10–21, 21–14తో లూసియా సలాజర్–పౌలా రీగల్ (పెరూ)పై గెలుపొందారు. పురుషుల డబుల్స్‌లో భారత జంట ఎంఆర్ అర్జున్–ధ్రువ్ కపిల జోడి 21–17, 17–21, 22–20తో సుపాక్ జోమ్‌కో– కిటునుపాంగ్ (థాయిలాండ్)ను ఓడించి ముందంజ వేయగా, మను అత్రి–సుమీత్ రెడ్డి ద్వయానికి నిరాశ ఎదురైంది. మను–సుమీత్ 11–21, 21–19, 15–21తో హిరోకి ఒకమురా–మసాయుకి ఒనొడెరా (జపాన్) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో 21–12, 21–13తో ప్యాట్రిక్ షీల్–ఫ్రాన్సిస్కా వోక్‌మన్ (జర్మనీ)పై గెలుపొంది రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.


విజేతలు కొరిక్, గార్సియా





మేసన్ (అమెరికా): సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ పురుషుల విభాగంలో బోర్నా కొరిక్ (క్రొయేషియా), మహిళల విభాగంలో కరోలిన్ గార్సియా (ఫ్రాన్స్) చాంపియన్లుగా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్లో కొరిక్ 7–6 (7/0), 6–2తో స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)పై విజయం సాధించాడు. కొరిక్ కెరీర్‌లో ఇదే తొలి 1000 మాస్టర్స్ టైటిల్ కావడం విశేషం. కొరిక్ 7 ఏస్‌లు కొట్టగా, సిట్సిపాస్ 22 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేయడం కూడా కలిసొచ్చింది. మరో వైపు తుది పోరులో గార్సియా 6–2, 6–4తో పెట్రో క్విటోవా (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. తద్వారా డబ్ల్యూటీఏ 1000 టోర్నీ గెలిచిన తొలి క్వాలిఫయర్‌గా ఘనత సాధించింది.

'మాస్ట్రో' అమల్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్, గత తరం దిగ్గజాల్లో ఒకడైన విక్టర్ అమల్‌రాజ్ బయోగ్రాఫీ పుస్తక రూపంలో వచ్చింది. 'మిడ్‌ఫీల్డ్ మాస్ట్రో' పేరుతో వచ్చిన ఈ పుస్తకాన్ని సీనియర్ క్రీడా పాత్రికేయులు అభిజిత్‌సేన్ గుప్తా రచించారు. హైదరాబాద్‌నుంచి 21 మంది ఫుట్‌బాలర్లు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించగా...అందులో ఆరుగురు కెప్టెన్లుగా వ్యవహరించారు. వీరిలో విక్టర్ అమల్‌రాజ్ కూడా ఒకరు. 80వ దశకంలో మిడ్‌ఫీల్డర్‌గా భారత జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న అమల్‌రాజ్... కోల్‌కతాకు చెందిన ప్రఖ్యాత క్లబ్‌లు ఈస్ట్‌బెంగాల్, మొహమ్మదాన్ క్లబ్‌లకు కూడా సారథ్యం వహించారు.

కార్ల్‌సన్‌కు 'చెక్'

- దిగ్గజంపై ప్రజ్ఞానంద విజయం
- క్రిప్టో కప్‌లో రన్నరప్




మయామి: ఎఫ్‌టీఎక్స్ క్రిప్టో కప్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు. వరల్డ్ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)ను కంగుతినిపించినప్పటికీ ప్రజ్ఞానంద ఒక్క పాయింట్ తేడాతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. ఆఖరి రౌండ్ మ్యాచ్‌లో భారత ఆటగాడు 4–2తో కార్ల్‌సన్‌పై విజయం సాధించాడు. ఒక మ్యాచ్ నాలుగు గేములుగా జరిగే ఈ టోర్నీలో ఇద్దరు హోరాహోరీగా తలపడటంతో 2–2తో సమమైంది. ఈ దశలో విజేతను నిర్ణయించేందుకు బ్లిట్జ్‌లో రెండు టైబ్రేక్స్‌ను నిర్వహించగా రెండు గేముల్లోనూ ప్రజ్ఞానందే గెలిచాడు. అయితే ఓవరాల్‌గా నార్వే సూపర్ గ్రాండ్‌మాస్టర్ 16 మ్యాచ్ పాయింట్లతో టోర్నీ విజేతగా నిలువగా, భారత టీనేజ్ సంచలనం 15 పాయింట్లతో రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. మేటి ర్యాంకింగ్ ఆటగాళ్లను కంగుతినిపించిన భారత ఆటగాడికి 5, 6వ రౌండ్ గేమ్‌ల్లో ఎదురైన ఓటములు ప్రతికూలమయ్యాయి.

హైదరాబాద్ ఎఫ్‌సీ విజయం

ఇంఫాల్: ప్రతిష్టాత్మక డ్యురాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ ఎఫ్‌సీ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 2–0 గోల్స్ తేడాతో టిడిమ్ రోడ్ అథ్లెటిక్ యూనియన్ (టీఆర్‌ఏయూ)పై విజయం సాధించింది. హైదరాబాద్ తరఫున హలిచరణ్ నర్జరే 27వ నిమిషంలో, బోర్జా హెరె 52వ నిమిషంలో గోల్స్ సాధించారు.

సిరీస్ కివీస్ సొంతం

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ 2–1తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో కివీస్ 5 వికెట్ల తేడాతో విండీస్‌పై విజయం సాధించింది. ముందుగా విండీస్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 301 పరుగులు చేసింది. కైల్ మేయర్స్ (110 బంతుల్లో 105; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... కెప్టెన్ నికోలస్ పూరన్ (55 బంతుల్లో 91; 4 ఫోర్లు, 9 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగాడు. అనంతరం న్యూజిలాండ్ 47.1 ఓవర్లలో 5 వికెట్లకు 307 పరుగులు చేసి విజయాన్నందుకుంది. టామ్ లాథమ్ (75 బంతుల్లో 69; 6 ఫోర్లు), డరైల్ మిచెల్ (49 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్), మార్టిన్ గప్టిల్ (64 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), డెవాన్ కాన్వే (63 బంతుల్లో 56; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీలు సాధించారు.



రజనీకాంత్

జైలర్ ఆన్ డ్యూటీ

జైలుకి వెళ్లారు రజనీకాంత్. ఖైదీగా కాదు.. జైలర్‌గా. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. సోమవారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో రజనీకాంత్ జాయిన్ అయ్యారు. అంటే.. జైలర్ ఆన్ డ్యూటీ అన్నమాట. షూటింగ్ ప్రారంభమైన సందర్భంగా 'జైలర్' చిత్రంలోని రజనీకాంత్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. చెన్నైలో వేసిన ఓ పోలీస్‌స్టేషన్ సెట్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోందని తెలిసింది. ఈ చిత్రంలో రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. 'నరసింహా' చిత్రం తర్వాత రజనీకాంత్, రమ్యకృష్ణ కలిసి నటిస్తున్న చిత్రం 'జైలర్'నే కావడం విశేషం. ఇక ఇదే చిత్రంలో ఐశ్వర్యా రాయ్, కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్ కుమార్, ప్రియాంకా అరుళ్ మోహనన్ నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.


అల్లు అర్జున్

తగ్గేదే లే అంటూ సందడి

భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అమెరికాలో జరిగిన 'ఇండియా డే పరేడ్ న్యూయార్క్ 2022' వేడుకలకు ఈ ఏడాది గ్రాండ్ మార్షల్ హోదాలో అల్లు అర్జున్ ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా న్యూయార్క్ మేయర్ ఎడిక్ ఆడమ్స్ అల్లు అర్జున్‌ను సన్మానించారు. 'పుష్ప'లోని 'తగ్గేదే లే' సిగ్నేచర్ మూమెంట్‌తో సందడి చేశారు అల్లు అర్జున్. ఈ వేడుకలో అల్లు అర్జున్ భార్య స్నేహా పాల్గొన్నారు.


పుష్పరాజ్ రూల్ స్టార్ట్

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' మంచి హిట్ అయింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'పుష్ప: ది రూల్' ఆరంభమైంది. తొలి షాట్‌కి మారిశెట్టి ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, శ్రీమాన్ క్లాప్ కొట్టారు. తోట శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. వీరు ముగ్గురూ సుకుమార్ అసోసియేట్ డైరెక్టర్లు కావడం విశేషం. రష్మికా మందన్నా ఇందులోనూ నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది.



చెర్రీ, రవిశంకర్, సుకుమార్, తబిత, వెంకట్ కిలారు, విజయ్

ఉగ్రం ఆరంభం


'అల్లరి' నరేష్, 'దిల్' రాజు

హీరో 'అల్లరి' నరేష్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో వచ్చిన 'నాంది' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇదే కాంబినేషన్‌లో తాజాగా 'ఉగ్రం' సినిమా షురూ అయింది. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత దామోదర్ ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మొదటి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడి తల్లిదండ్రులు రామకోటేశ్వరరావు కనకమేడల, లోకేశ్వరి కనకమేడల స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందజేశారు. ''న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సిద్.

కమర్షియల్ ఎంటర్‌టైనర్ షురూ


యుక్తి తరేజా, నాగశౌర్య, రాఘవేంద్ర రావు

నాగశౌర్య హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. పవన్ బాసంశెట్టి ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. నాగశౌర్యకు జోడీగా యుక్తి తరేజా నటిస్తున్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. ముహూర్తం సన్నివేశానికి 'దసరా' చిత్రదర్శకుడు శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. పవన్ బాసంశెట్టి, సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ– ''కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. నాగచైతన్య 'లవ్ స్టోరీ' చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించిన ఏఆర్ రెహమాన్ శిష్యుడు పవన్ సీహెచ్ మా మూవీకి సంగీతం అందించనున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వంశీ పచ్చిపులుసు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.


శర్వానంద్, జానీ, శ్రష్ఠి, వికాస్

రాజకీయం.. వినోదం

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ హీరోగా 'యథా రాజా తథా ప్రజా' సినిమా ఆరంభమైంది. శ్రీనివాస్ విట్టల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో 'సినిమా బండి' ఫేమ్ వికాస్ మరో హీరోగా, శ్రష్టి వర్మ నాయికగా నటిస్తున్నారు. శ్రీనివాస్ విట్టల, హరీష్ పటేల్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సల్మాన్ ఖాన్ బావమరిది ఆయుష్ శర్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో శర్వానంద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విట్టల మాట్లాడుతూ– ''పొలిటికల్ డ్రామా నేపథ్యంలో వినోదాత్మకంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. సెప్టెంబర్ 15న రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''జానీ మాస్టర్ అంటే డ్యాన్స్, కమర్షియల్ అంశాలు కాకుండా మంచి కథతో వస్తే బాగుంటుందని 'యథా రాజా తథా ప్రజా'లో నటిస్తున్నాను. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అన్నారు జానీ. ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: సునోజ్ వేలాయుధన్.

వింత జీవులతో పోరాటం


ఆర్య

వెండితెరపై వింత జీవులతో కెప్టెన్‌గా పోరాటం చేస్తున్నారు తమిళ హీరో ఆర్య. 'టెడ్డీ' (2021) చిత్రం తర్వాత హీరో ఆర్య, దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'కెప్టెన్'. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మీ, సిమ్రాన్, హరీష్ ఉత్తమన్, కావ్యా శెట్టి, గోకుల్‌నాథ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. థింక్ స్టూడియోస్ అసోసియేషన్‌తో ది స్నో పీపుల్ పతాకంపై ఆర్య నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేసి, చిత్రాన్ని సెప్టెంబరు 8న విడుదల చేస్తున్నట్లుగా చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను తెలుగులో ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'కెప్టెన్' తెలుగు ట్రైలర్‌ను నితిన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''ఈ చిత్రంలో ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ కెప్టెన్ విజయ్ కుమార్ పాత్రలో ఆర్య నటించారు. ఓ అడవిలో వింత జీవులను ఎదుర్కోవడానికి విజయ్, అతని టీమ్ ఏ విధంగా పోరాటం చేశారన్నదే కథ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

కోటీశ్వరులు ఎలా అయ్యారు?

కృష్ణ (కమెడియన్ గౌతం రాజు కుమారుడు) హీరోగా, సుమీత హీరోయిన్‌గా అంజన్ చెరుకూరి దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. రావుల గౌరమ్మ సమర్పణలో రావుల లక్ష్మణ్ రావ్, రావుల శ్రీను నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత రామసత్య నారాయణ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు బి. గోపాల్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. అంజన్ చెరుకూరి మాట్లాడుతూ– ''ఓ ప్రేమజంట తమకు వచ్చిన చాన్స్‌ని చేజిక్కించుకొని కోటీశ్వరులు ఎలా అయ్యారు? అనేదే ఈ చిత్రకథ'' అన్నారు. ''మా అభిమాన హీరో చిరంజీవి గారి బర్త్ డే రోజు మా సినిమా ప్రారంభించడం హ్యాపీ. మా తొలి చిత్రం 'రుద్రవీణ' రిలీజ్‌కు రెడీగా ఉంది'' అన్నారు రావుల లక్ష్మణ్ రావ్, రావుల శ్రీను. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.రాజశేఖర్, సంగీతం: త్రినాథ్ మంతెన.



కృష్ణ, సుమీత, బి. గోపాల్

కామెడీ బ్రహ్మచారి

గుంట మల్లేష్ హీరోగా నర్సింగ్ దర్శకత్వంలో రమేష్ మాస్టర్ శ్రీ కిరణ్, విష్ణుష్ నిర్మించిన చిత్రం 'బ్రహ్మచారి'. ఈ చిత్రం ఫస్ట్ లుక్, ట్రైలర్‌ను తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె. బసిరెడ్డి రిలీజ్ చేశారు. ''దుబాయ్‌కి వెళ్లొచ్చిన ఒక అబ్బాయి పెళ్లి చేసుకుందామనుకున్న టైమ్‌లో అమ్మాయి దొరక్క ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు? అన్నదే కథ. కావాలని కామెడీ కోసం ఏదో ఒకటి క్రియేట్ చేయకుండా, నిజ జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో ఈ 'బ్రహ్మచారి' తీశాం'' అన్నారు దర్శకుడు నర్సింగ్ రావు. ''నేను ఒగ్గు కథ కళాకారుణ్ణి'' అన్నారు హీరో గుంట మల్లేష్.


బసిరెడ్డి, నర్సింగ్

విలన్ వచ్చేశాడు


నాగబాబు

శరణ్ కుమార్ (సూపర్‌స్టార్ కృష్ణ, విజయ నిర్మల ఫ్యామిలీ) హీరోగా, జాహ్నవి కపూర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సాక్షి'. శివ కేశనకుర్తి దర్శకత్వం వహించారు. మునగాల సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇందులో నాగబాబు విలన్ పాత్ర చేశారు. సోమవారం (ఆగస్టు 22) చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సాక్షి' టైటిల్ లోగోను, నాగబాబు ఫస్ట్ లుక్‌ని నిర్మాతలు 'దిల్' రాజు, బెక్కం వేణుగోపాల్, దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. మునగాల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ– ''సినిమా చాలా బాగా వచ్చింది. భీమ్స్ సిసిరోలియో ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. త్వరలోనే మా సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: బేబీ లలిత, కెమెరా: చైతన్య కందుల.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	872	58,774
నిఫ్టీ ▽	268	17,491

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	12,403	▽	302
డోజోన్స్	33,088	▽	618
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,534	▽	17
డాక్స్	13,231	▽	314
షాంఘై	3,278	△	20
నికాయ్	28,794	▽	136

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

మూతబడిన మరో స్టార్టప్‌.. షాప్‌ఎక్స్



న్యూఢిల్లీ: వ్యాపార నిర్వహణ లాభసాటిగా లేక పోవడంతో మరో స్టార్టప్‌ సంస్థ మూతబడింది. టెక్‌ దిగ్గజం నందన్‌ నీలేకని ఇన్వెస్ట్‌ చేసిన షాప్‌ఎక్స్‌ కార్యకలాపాలు నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దివాలా పిటిషన్‌ దాఖలు చేసినట్లు పేర్కొన్నాయి. అత్యంత స్వల్ప మార్జిన్ల వల్ల వ్యాపార నిర్వహణ లాభసాటిగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించాయి. ఈ ఏడాది ఇప్పటికే ఎడ్‌టెక్‌ స్టార్టప్‌లు క్రైజో డాట్‌ఫన్, సూపర్‌లెర్న్, ప్రోటాన్‌ తదితర స్టార్టప్‌లు మూతబడ్డాయి. కిరాణా స్టోర్స్, ఇతర చిన్న తరహా రిటైలర్లకు లాజిస్టిక్స్, కొనుగోళ్లపరమైన సహకారం అందించేందుకు 2014లో అమిత్‌ శర్మ, అపూర్వ జోయిస్‌ కలిసి షాప్‌ఎక్స్‌ ఏర్పాటు చేశారు. నందన్‌ నీలేకనితో పాటు ఫంగ్‌ స్ట్రాటెజిక్‌ హోల్డింగ్స్, రాజేశ్‌ రణావత్, కేవల్‌ నోరియా తదితర ఇన్వెస్టర్ల నుంచి ఈ సంస్థ 2020 నాటికి 60 మిలియన్‌ డాలర్లు సమీకరించింది. తీవ్రమైన పోటీతో తరచూ వ్యాపార వ్యూహాలను మార్చుకున్నప్పటికీ మార్కెట్లో నిలదొక్కుకోలేకపోయింది. నిధుల కొరత కారణంగా తీసుకున్న రుణాలను చెల్లించడంలో విఫలమైంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	51,396
బంగారం (99.5 స్వచ్ఛత)	51,190
వెండి (కిలో)	55,100

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌/100కు రూ.లలో)

23-8-2022	
విశాఖ	438-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్‌ ధర (డజను)	66.00
22-8-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్	411-00
వరంగల్	413-00
రిటైల్‌ ధర	4.70

ఎల్‌ఐసీ, బజాజ్‌ హౌసింగ్‌ సంస్థల రుణ రేట్లు పెంపు

ముంబై: ఎల్‌ఐసీ హౌసింగ్‌ ఫైనాన్స్, బజాజ్‌ హౌసింగ్‌ ఫైనాన్స్‌ సంస్థలు తమ గృహ రుణ రేటును 50 బేసిస్‌ పాయింట్ల (0.50 శాతం) వరకూ పెంచాయి. బజాజ్‌ హౌసింగ్‌ ఫైనాన్స్‌ విషయానికి వస్తే, అరశాతం వడ్డీ పెంపుతో వేతనం, వృత్తి పరమైన వ్యక్తులకు గృహ రుణ రేటు 7.70 శాతంగా ఉండనుంది. ఇక ఎల్‌ఐసీ హౌసింగ్‌ ఫైనాన్స్‌ ప్రైమ్‌ లెండింగ్‌ 7.50 శాతం నుంచి 8 శాతానికి చేరింది.

రెండునెలల్లో అతిపెద్ద నష్టం



- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం
- సెన్సెక్స్‌ 872 పాయింట్లు మైనస్
- 17,500 స్థాయి దిగువకు నిఫ్టీ
- సూచీలకు రెండోరోజూ నష్టాలే


ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ సోమవారం రెండునెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. సెన్సెక్స్‌ 872 పాయింట్లు పతనమై 59 వేల దిగువన 58,774 వద్ద స్థిరపడింది. ఈ సూచీలో 30 షేర్లలో నెస్లే, ఐటీసీ మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీ 17,500 స్థాయిని కోల్పోయింది. మార్కెట్‌ ముగిసే సరికి 268 పాయింట్లు క్షీణించి 17,491 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ ఇండెక్సులు వరుసగా 1%, రెండుశాతం క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.454 కోట్ల షేర్లను, దేశీ ఇన్వెస్టర్లు రూ.85 కోట్ల షేర్లను అమ్మేశారు. అమెరికా ఫెడ్‌ రిజర్వ్‌ మరో దఫా వడ్డీ రేట్లను పెంచవచ్చనే భయాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాలతో ట్రేడ్‌ అవుతున్నాయి. డాలర్‌ మారకంలో రూపాయి విలువ ఎలాంటి లాభ, నష్టాలకు లోనవకుండా 79.84 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.

ఆద్యంతం అమ్మకాలే

ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్‌ ఉదయం నష్టంతో మొదలైంది. సెన్సెక్స్‌ 285 పాయింట్ల పతనంతో 59,361 వద్ద, నిఫ్టీ 75 పాయింట్ల నష్టంతో 17,758 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ట్రేడింగ్‌ ఆద్యంతం ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపడంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 941 పాయింట్లు క్షీణించి 58,705 వద్ద, నిఫ్టీ 269 పాయింట్లు దిగజారి 17,467 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. రోజంతా నష్టాల్లో కదలాడిన సూచీలు చివరికి నెలరోజుల్లో అతిపెద్ద పతనాన్ని మూటగట్టుకొని ట్రేడింగ్‌ను ముగించాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ ఐటీసీ షేరు రాణించింది. ట్రేడింగ్‌లో ఒకటిన్నర శాతం ర్యాలీ చేసి రూ.317 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి అరశాతానికి పైగా లాభంతో రూ.314 వద్ద నిలిచింది.
- డీబీ పవర్‌ను రూ.7,017 కోట్లకు చేజిక్కించుకుంటున్నామనే ప్రకటనతో అదానీ పవర్‌ కంపెనీ షేరుకు భారీ డిమాండ్‌ నెలకొంది. ట్రేడింగ్‌ ప్రారంభంలోనే అయిదు శాతం లాభపడి రూ.433 వద్ద అప్పర్‌ సర్క్యూట్‌ను తాకి ఫ్రీజ్‌ అయ్యింది.



నష్టాలు ఎందుకంటే

జాక్సన్‌ హోల్‌ సింపోజియం వార్షిక చర్చా కార్యక్రమానికి ముందు(బుధవారం ప్రారంభం) డాలర్‌ బలపడింది. యూఎస్‌ ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరిగాయి. చైనా కేంద్ర బ్యాంకు కీలక వడ్డీ రేట్లను తగ్గించడంతో అక్కడి ప్రాపర్టీ మార్కెట్‌ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశీయంగా ఆగస్టు డెరివేటివ్‌ కాంట్రాక్టులు ముగియనున్న నేపథ్యంలో అప్రమత్తత చోటు చేసుకుంది. ఈ ప్రతికూలతలతో దేశీయ సూచీలు కుప్పకూలాయి.

రెండు రోజుల్లో రూ.6.57 లక్షల కోట్లు మాయం

సూచీల రెండు రోజుల పతనంతో స్టాక్‌ మార్కెట్లో రూ.6.57 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.273.95 లక్షల కోట్లకు దిగివచ్చింది. గడిచిన రెండు ట్రేడింగ్‌ సెషన్లలో సెన్సెక్స్‌ 1,524 పాయింట్లు, నిఫ్టీ 466 పాయింట్లు చొప్పున క్షీణించాయి. ''ఇటీవల వరుస ర్యాలీతో మార్కెట్‌ ఓవర్‌బాట్‌లోకి వెళ్లడంతో గరిష్ట స్థాయి వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. నిఫ్టీ 21.5 పీఈ వద్ద ట్రేడ్‌ అవుతోంది. ఇది దీర్ఘకాలిక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు రిస్క్‌ రివార్డు వైఖరికి దూరంగా ఉండాలి'' అని జియోజిత్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ రీసెర్చ్‌ హెడ్‌ వినోద్‌ నాయర్‌ తెలిపారు.

రేపటి నుంచి డ్రీమ్‌ఫోక్స్‌ ఐపీవో

విమానాశ్రయ సర్వీసుల అగ్రిగేటర్‌ ప్లాట్‌ఫామ్‌ డ్రీమ్‌ఫోక్స్‌ పబ్లిక్‌ ఇష్యూ బుధవారం(24న) ప్రారంభంకానుంది. ఇందుకు ధరల శ్రేణిని షేరుకి రూ.308-326గా నిర్ణయించింది. ఇష్యూ శుక్రవారం(26న) ముగియనుంది. యాంకర్‌ ఇన్వెస్టర్లకు నేడు(మంగళవారం) షేర్లను విక్రయించనుంది. ఆఫర్‌లో భాగంగా ప్రమోటర్లు 1.72 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఐపీవో తదుపరి చెల్లించిన మూలధనంలో ఇది 33 శాతం వాటాకు సమానంకావడం గమనార్హం!

4జీ చార్జీలకే 5జీ సేవలు!

- ప్రయోగాత్మకంగా కొనసాగింపు
- దశలవారీగా రేట్లకు రెక్కలు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: కొత్తతరం సాంకేతిక పరిజ్ఞానం అయిన 5జీ సేవలను నేడో రేపో ప్రారంభించేందుకు భారత టెలికం కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. స్పెక్ట్రం అందుకున్న కంపెనీలు ఒకవైపు.. 5జీ హ్యాండ్‌సెట్స్‌తో 5 కోట్ల మంది కస్టమర్లు మరోవైపు. అయితే అందరి చూపూ చార్జీలు ఎలా ఉండబోతున్నాయనే. టెలికం కంపెనీల నుంచి అందుతున్న సమాచారం మేరకు 4జీ రేటుకే 5జీ సేవలను అందించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒక్కో కస్టమర్‌ నుంచి సమకూరే ఆదాయాన్ని పెంచుకోవాలని కొన్నేళ్లుగా టెలికం సంస్థలు కసరత్తు చేస్తున్నాయి. కొత్త టెక్నాలజీ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించిన ఈ సంస్థలు అందుకు తగ్గ ప్రణాళికనూ రెడీ చేసుకున్నాయి.

ఆరు నెలల తర్వాతే..

ముందుగా 4జీ టారిఫ్‌లోనే 5జీ సేవలను ప్రయోగాత్మకంగా అందించే అవకాశం ఉందని దిగ్గజ టెలికం కంపెనీ ప్రతినిధి ఒకరు సాక్షి బిజినెస్‌ బ్యూరోకు తెలిపారు. 'కొత్త టెక్నాలజీపట్ల కస్టమర్‌ అనుభూతి చెందాలి. 5జీ ప్రయోజనాలు అందుకోవాలి. అంత వరకు రేట్ల సవరణ ఉండకపోవచ్చు. ఆరు నెలల తర్వాతే క్రమంగా కొత్త చార్జీలు అమలులోకి వచ్చే చాన్స్‌ ఉంది. నెట్‌వర్క్‌ స్లైసింగ్‌ విధానంలో ఒక్కో వినియోగదారుడు కోరుకున్న వేగాన్ని 5జీలో అందించే వీలుంది. నెట్‌వర్క్‌ అప్‌గ్రేడ్‌ కారణంగా అటు 4జీ సేవల నాణ్యతా పెరుగుతుంది' అని వివరించారు. 2022 మే 31 నాటికి దేశవ్యాప్తంగా 79.47 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్‌ వినియోగదార్లు ఉన్నారు. వీరిలో మొబైల్‌ బ్రాడ్‌బ్యాండ్‌ కస్టమర్లు 76.55 కోట్లు. సగటున ఒక్కో కస్టమర్‌ నుంచి టెలికం కంపెనీకి సమకూరుతున్న ఆదాయం రూ.200లోపే ఉంటోంది. దీనిని రూ.300-350కి చేర్చాలన్నది కంపెనీల లక్ష్యం. 2021 నవంబర్‌-డిసెంబర్‌లో చార్జీలు 20-25 శాతం పెరిగాయి.

కంపెనీలకు స్పెక్ట్రం భారం..

టెలికం కంపెనీలు 5జీ స్పెక్ట్రం కోసం భారీగానే ఖర్చు చేశాయి. రిలయన్స్‌ జియో ఏకంగా రూ.88,078 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్‌ రూ.43,084 కోట్లు, వొడాఫోన్‌ ఐడియా రూ.18,799 కోట్ల విలువైన స్పెక్ట్రంను కొనుగోలు చేశాయి. ఒక్క 700 మెగాహెర్ట్జ్‌ బ్యాండ్‌లో 10 మెగాహెర్ట్జ్‌ స్పెక్ట్రం కోసం జియో ఏకంగా రూ.40,000 కోట్లు ఖర్చు చేసిందంటే ఆశ్చర్యం వేయకమానదు. 700 మెగాహెర్ట్జ్‌ బ్యాండ్‌లో కవరేజ్‌ మెరుగ్గా ఉంటుందని జియో అంటోంది. 5జీ సేవల్లో భాగంగా మూడు ప్రైవేట్‌ టెలికం సంస్థలు నెట్‌వర్క్‌ అప్‌గ్రేడ్, విస్తరణకు అయిదేళ్లలో రూ.1.43-1.59 లక్షల కోట్లు వెచ్చించే అవకాశం ఉందని ఓ కన్సల్టింగ్‌ కంపెనీ వెల్లడించింది. భారీగా ఖర్చులు ఉన్నందున ప్యాక్‌ల చార్జీలు పెంచక తప్పదు. అది కూడా ఆచితూచి వ్యవహరించాలన్నది కంపెనీల భావన.

రెండేళ్లలో 15 కోట్లు..

ప్రస్తుతం దేశంలో 5 కోట్ల మంది వద్ద 5జీ హ్యాండ్‌సెట్స్‌ ఉన్నాయి. రెండేళ్లలో ఈ సంఖ్యను 15 కోట్లకు చేర్చాలన్నది టెలికం కంపెనీల లక్ష్యం. ఇందుకు అనుగుణంగా మొబైల్స్‌ తయారీ సంస్థలతో కలిసి బండిల్‌ ఆఫర్లను టెలికం సంస్థలు ప్రవేశపెట్టనున్నాయి. జియో రాకతో ఒక్కసారిగా దేశంలో 4జీ విప్లవం వచ్చింది. మూడు కంపెనీల గట్టి పోటీతో 5జీలోనూ అదే ఊపు ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం-ఇండియన్‌ పాలిటీ కోసం

ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మేనేజ్‌మెంట్‌ విద్యకు.. మ్యాట్

మేనేజ్‌మెంట్‌ కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే మేనేజ్‌మెంట్‌ అప్టిట్యూడ్‌ టెస్ట్‌ (మ్యాట్‌) నోటిఫికేషన్‌ విడుదలైంది. మ్యాట్‌ స్కోర్‌తో దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 600 పైగా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందొచ్చు. ఈ నేపథ్యంలో.. మ్యాట్‌ సమాచారం..



ఎంబీఏ స్నాప్‌షాట్

ఆల్‌ ఇండియా మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌(ఏఐఎంఏ).. మ్యాట్‌ పరీక్షను ఏటా నాలుగు సార్లు నిర్వహిస్తుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ విధానంలో పరీక్ష జరుగుతుంది. ఆసక్తి ఉంటే రెండు విధానాల్లో పరీక్షకు హాజరుకావచ్చు. ఈ పరీక్షలో సాధించిన స్కోరుకు ఏడాది పాటు వాలిడిటీ ఉంటుంది.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి ఏడాది పరీక్షలు రాసే వారు కూడా దరఖాస్తుకు అర్హులే.

పరీక్ష విధానం

ఆబ్జెక్టివ్‌ తరహాలో నిర్వహిస్తారు. పేపర్‌ బేస్డ్‌ టెస్ట్‌(పీబీటీ) లేదా కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌(సీబీటీ) లేదా ఇంటర్నెట్‌ బేస్డ్‌ టెస్ట్‌(ఐబీటీ) పద్ధతిలో పరీక్ష ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు. ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

ఐదు విభాగాలు

లాంగ్వేజ్‌ కాంప్రహెన్షన్‌-40 ప్రశ్నలు, ఇంటెలిజెన్స్‌ అండ్‌ క్రిటికల్‌ రీజనింగ్‌-40 ప్రశ్నలు, మ్యాథమేటికల్‌ స్కిల్స్‌-40 ప్రశ్నలు, డేటాఅనాలిసిస్‌ అండ్‌ సఫిషియెన్సీ-40 ప్రశ్నలు, ఇండియన్‌ అండ్‌ గ్లోబల్‌ ఎన్విరాన్‌మెంట్‌ల నుంచి 40 చొప్పున.. ఇలా మొత్తం ఐదు సెక్షన్ల నుంచి 200 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 రుణాత్మక మార్కులు ఉన్నాయి.

సిలబస్‌ ఇలా

- » **లాంగ్వేజ్‌ కాంప్రహెన్షన్:** ఈ విభాగంలో వెర్బ్స్, నౌన్,ప్రొనౌన్, ఆడ్జెక్టివ్, ఆడ్‌వెర్బ్స్, యాంటనిమ్స్‌-సినానిమ్స్, వన్‌వర్డ్‌ సబ్‌స్టిట్యూషన్, ఇడియమ్స్‌/ఫ్రేజెస్, వొకాబులరీ, ఫిల్‌ ఇన్‌ ద బ్లాక్స్, సెంటెన్స్‌ కరెక్షన్, పారా జంబుల్, రీడింగ్‌ కాంప్రహెన్షన్‌ అంశాల నుంచి ప్రశ్నలను అడుగుతారు.
- » **ఇంటెలిజెన్స్‌ అండ్‌ క్రిటికల్‌ రీజనింగ్:** ఈ విభాగంలోఅనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్‌ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. ఫ్యామిలీ ట్రీ, కోర్స్‌ ఆఫ్‌ యాక్షన్, అరేంజ్‌మెంట్, పై చార్ట్, క్యాలెండర్స్, స్టేట్‌మెంట్‌ కన్‌క్లూజన్స్, స్ట్రాంగ్‌ ఆర్గ్యూమెంట్‌ అండ్‌ వీక్‌ ఆర్గ్యూమెంట్స్, పజిల్స్, సిరీస్, బ్లడ్‌ రిలేషన్స్, కోడింగ్‌ అండ్‌ డీకోడింగ్, విజువల్‌ రీజనింగ్, సిలాజిజమ్, గ్రాఫ్స్‌ వంటి వాటి నుంచి ప్రశ్నలుంటాయి.
- » **డేటా అనాలిసిస్‌ అండ్‌ డేటా సఫిషియన్సీ:** ఈ విభాగంలో డేటా అనాలిసిస్‌ అండ్‌ డేటా సఫిషియన్సీ అనేవి రెండు వేర్వేరు విభాగాలు. వీటి నుంచి లైన్‌గ్రాఫ్, బార్‌గ్రాఫ్, పైచార్ట్, డేటా కంపారిజన్, క్వాంటిటేటివ్‌ కంపారిజన్, డేటా సఫిషియన్సీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- » **మ్యాథమెటికల్‌ స్కిల్స్:** ఈ విభాగంలో ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగనామెట్రీ, మెన్సురేషన్, మోడర్న్‌ మ్యాథ్స్‌ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- » **ఇండియన్‌ అండ్‌ గ్లోబల్‌ ఇన్విరాన్‌మెంట్:** ఈ విభాగంలో ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన కరెంట్‌ అఫైర్స్, జనరల్‌ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

సన్నద్ధత ఇలా

- » ప్రిపరేషన్‌ పరంగా ప్రణాళిక, పక్కా వ్యూహం అనుసరించాలి. టాపిక్‌ వైజ్‌గా షార్ట్‌నోట్స్‌ను ప్రిపేర్‌ చేసుకోవాలి. » అభ్యర్థులకు ఆయా విభాగాల్లో బేసిక్‌ కాన్సెప్ట్స్‌పై ఉన్న పట్టును పరీక్షించే విధంగా ప్రశ్నలను అడుగుతారు. కాబట్టి బేసిక్‌ కాన్సెప్ట్‌లపై ఎక్కువగా దృష్టి పెట్టాలి.
- » ఈ పరీక్షలో వేగంతోపాటు కచ్చితత్వంతో సమాధానాల్ని గుర్తించడం కీలకం. ఇందుకోసం అభ్యర్థులు ప్రిపరేషన్‌తోపాటు వీలైనన్నీ ఎక్కువ మాక్‌ టెస్ట్‌లు రాయాలి. గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్‌ చేయడం మేలు చేస్తుంది.

ప్రవేశం

మ్యాట్‌లో సాధించిన స్కోర్‌ ఆధారంగా ఆయా విద్యాసంస్థలు ఎంబీఏలో ప్రవేశం కల్పిస్తాయి. అభ్యర్థుల ఎంపికకు ప్రతి విద్యాసంస్థ తమ సొంత విధానం అనుసరిస్తుంది. ఆ క్రమంలో గ్రూప్‌ డిస్కషన్, రిటన్‌ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్‌ ఇంటర్వ్యూలు వంటివి నిర్వహిస్తున్నాయి.

ముఖ్యమైన సమాచారం

పీబీటీ:

- » **దరఖాస్తు చివరి తేదీ:** ఆగస్టు 29, 2022
- » **అడ్మిట్‌ కార్డ్:** ఆగస్టు 30, 2022
- » **పరీక్ష తేదీ:** 04 సెప్టెంబర్‌ 2022

సీబీటీ:

- » **దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్‌ 12, 2022
- » **అడ్మిట్‌ కార్డ్:** సెప్టెంబర్‌ 13, 2022
- » **పరీక్ష తేదీ:** సెప్టెంబర్‌ 18, 2022
- » **వెబ్‌సైట్:** https://mat.aima.in

కేంద్రంలో జూనియర్‌ ఇంజనీర్‌ కొలువు

ఇంజనీరింగ్‌ డిప్లొమా.. పాలిటెక్నిక్‌గా సుపరిచితమైన కోర్సు! డిప్లొమా పూర్తి చేసుకున్న యువతకు చక్కటి ఉద్యోగ అవకాశం ఆహ్వానం పలుకుతోంది! ఎస్‌ఎస్‌సీ-జూనియర్‌ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌ అండ్‌ క్వాంటిటీ సర్వేయింగ్, కాంట్రాక్ట్స్‌) పోస్టులకు ప్రకటన వెలువడింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది!! ఈ నేపథ్యంలో.. ఎస్‌ఎస్‌సీ తాజా నోటిఫికేషన్‌ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్‌ టిప్స్‌..

- » ప్రారంభ వేతనం రూ.60వేలు
- » డిప్లొమా/బీటెక్‌ ఉత్తీర్ణులు అర్హులు
- » సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌ విభాగాల్లో ఉద్యోగాలు
- » ఎస్‌ఎస్‌సీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ

జూనియర్‌ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటీ సర్వేయింగ్‌ అండ్‌ కాంట్రాక్ట్స్‌) ఎగ్జామ్‌-2022 ద్వారా స్టాఫ్‌ సెలక్షన్‌ కమిషన్‌(ఎస్‌ఎస్‌సీ) కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తొమ్మిది శాఖలు, విభాగాలు, సంస్థల్లో జూనియర్‌ ఇంజనీర్‌ పోస్టుల భర్తీ చేపట్టనుంది. బోర్డర్‌ రోడ్స్‌ ఆర్గనైజేషన్, సెంట్రల్‌ పబ్లిక్‌ వర్క్స్‌ డిపార్ట్‌మెంట్, సెంట్రల్‌ వాటర్‌ అండ్‌ పవర్‌ రీసెర్చ్‌ స్టేషన్, సెంట్రల్‌ వాటర్‌ కమిషన్, డైరెక్టరేట్‌ ఆఫ్‌ క్వాలిటీ అష్యూరెన్స్‌(నావల్), ఫరక్కా బ్యారేజ్‌ ప్రాజెక్ట్, మిలటరీ ఇంజనీరింగ్‌ సర్వీసెస్, నేషనల్‌ టెక్నికల్‌ రీసెర్చ్‌ ఆర్గనైజేషన్, మినిస్ట్రీ ఆఫ్‌ పోర్ట్స్, షిప్పింగ్‌ అండ్‌ వాటర్‌ వేస్(అండమాన్‌ లక్షద్వీప్‌ హార్బర్‌ వర్క్స్‌) తదితర శాఖలు, విభాగాల్లో సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్‌ జూనియర్‌ ఇంజనీర్‌ పోస్టులు భర్తీ చేయనున్నారు. పోస్టుల సంఖ్యను వెల్లడించలేదు.

అర్హతలు

- 2022, సెప్టెంబర్‌ 2 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌ నుంచి సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్‌ బ్రాంచ్‌లతో డిప్లొమా/బీటెక్‌ ఉత్తీర్ణులై ఉండాలి.
- బోర్డర్‌ రోడ్స్‌ ఆర్గనైజేషన్‌ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** జనవరి 1, 2022 నాటికి 30ఏళ్లకు మించకూడదు. సెంట్రల్‌ పబ్లిక్‌ వర్క్స్‌ డిపార్ట్‌మెంట్, సెంట్రల్‌ వాటర్‌ కమిషన్‌లకు మాత్రం గరిష్ట వయోపరిమితి 32ఏళ్లు. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

నెలకు రూ.60వేలు

- డిప్లొమా, బీటెక్‌ అర్హతతో గ్రూప్‌-బి(నాన్‌-గెజిటెడ్) హోదాలో భర్తీ చేయనున్న ఈ జూనియర్‌ ఇంజనీర్‌ పోస్టులకు ఎంపికైతే పే లెవల్‌-6లో రూ.35,400-రూ.1,12,400 వేతన శ్రేణి అందుతుంది.
- కొలువులు సొంతం చేసుకున్న వారికి ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వరకు వేతనం లభిస్తుంది.
- భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్, సీనియర్‌ సెక్షన్‌ ఇంజనీర్, డివిజనల్‌ ఇంజనీర్‌ హోదాలకు చేరుకునే అవకాశం ఉంది.

రాత పరీక్షతోనే కొలువు

జూనియర్‌ ఇంజనీర్‌ పోస్టులను రాత పరీక్షల్లో మెరిట్‌ ఆధారంగా భర్తీ చేస్తారు. పేపర్‌-1, పేపర్‌-2 పేరుతో రెండు పేపర్లలో పరీక్ష నిర్వహిస్తారు.

పేపర్‌-1.. మూడు విభాగాలు

- ఎంపిక ప్రక్రియలో తొలి దశగా పేపర్‌-1ను ఆన్‌లైన్‌ విధానంలో కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ పేపర్‌ మూడు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- అభ్యర్థులు తాము డిప్లొమా లేదా బీటెక్‌లో చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా పార్ట్‌-ఎ/పార్ట్‌-బి/పార్ట్‌-సిలలో ఏదో విభాగంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
జనరల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ రీజనింగ్	50	50
జనరల్‌ అవేర్‌నెస్	50	50
పార్ట్‌-ఎ జనరల్‌ ఇంజనీరింగ్‌ (సివిల్‌ అండ్‌ స్ట్రక్చరల్)	100	100
పార్ట్‌-బి జనరల్‌ ఇంజనీరింగ్‌ (ఎలక్ట్రికల్)	100	100
పార్ట్‌-సి జనరల్‌ ఇంజనీరింగ్‌ (మెకానికల్)	100	100

- పేపర్‌-1లో పొందిన మార్కులను నార్మలైజేషన్‌ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి..కటాఫ్‌ స్కోర్లను నిర్ణయిస్తారు. ఆ తర్వాత అందుబాటులో ఉండే పోస్టుల సంఖ్య ఆధారంగా మెరిట్‌ జాబితా రూపొందిస్తారు. వారికి పేపర్‌-2కు అర్హత లభిస్తుంది.

పేపర్‌-2.. డిస్క్రిప్టివ్‌ విధానం

- పేపర్‌-2ను పూర్తిగా సబ్జెక్ట్‌ పేపర్లతో డిస్క్రిప్టివ్‌ విధానంలో 300 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్‌-ఎ జనరల్‌ ఇంజనీరింగ్(సివిల్‌ అండ్‌ స్ట్రక్చరల్), పార్ట్‌-బి జనరల్‌ ఇంజనీరింగ్‌ (ఎలక్ట్రికల్), పార్ట్‌-సి జనరల్‌ ఇంజనీరింగ్(మెకానికల్) పేరుతో పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా సంబంధిత సబ్జెక్ట్‌ విభాగంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.

తుది ఎంపిక.. ఇలా

రెండు పేపర్లలోనూ పొందిన మార్కుల ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా విభాగాల్లో ఉన్న ఖాళీలు, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని.. నియామకాలు ఖరారు చేస్తారు.



జాబ్‌ పాయింట్

సబ్జెక్ట్‌లపై పట్టుతోనే విజయం

జూనియర్‌ ఇంజనీర్‌ పోస్టులకు పోటీపడే అభ్యర్థులు ప్రధానంగా.. ఇంజనీరింగ్‌ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాల్సి ఉంటుంది. డిప్లొమా, బీటెక్‌ స్థాయిలో అకడమిక్‌ పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి.

సివిల్‌ ఇంజనీరింగ్

సివిల్‌ ఇంజనీరింగ్‌ అభ్యర్థులు బిల్డింగ్‌ మెటీరియల్స్, ఎస్టిమేటింగ్, కాస్టింగ్‌ అండ్‌ ఎవాల్యుయేషన్, సర్వేయింగ్, సాయిల్‌ మెకానిక్స్, హైడ్రాలిక్స్, ఇరిగేషన్‌ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్‌ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజనీరింగ్‌ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా.. స్ట్రక్చరల్‌ ఇంజనీరింగ్‌కు సంబంధించి స్ట్రక్చర్స్‌ థియరీ, కాంక్రీట్‌ టెక్నాలజీ, ఆర్‌సీసీ డిజైన్, స్టీల్‌ డిజైన్‌ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్

ఈ విభాగం అభ్యర్థులు.. బేసిక్‌ కాన్సెప్ట్స్‌తో పాటు సర్క్యూట్‌ లా, మ్యాగ్నటిక్‌ సర్క్యూట్, ఏసీ ఫండమెంటల్స్, మెజర్‌మెంట్‌ అండ్‌ మెజరింగ్‌ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎలక్ట్రికల్‌ మెషీన్స్, ఫంక్షనల్‌ కిలో వాట్‌ మోటార్స్‌ అండ్‌ సింగిల్‌ ఫేజ్‌ మోటార్స్, సింక్రనస్‌ మెషీన్స్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్‌ అండ్‌ డిస్ట్రిబ్యూషన్, ఎస్టిమేషన్‌ అండ్‌ కాస్టింగ్, యుటిలైజేషన్‌ అండ్‌ ఎలక్ట్రికల్‌ ఎనర్జీ, బేసిక్‌ ఎలక్ట్రానిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

మెకానికల్‌ ఇంజనీరింగ్

థియరీ ఆఫ్‌ మెషీన్స్, మెషీన్‌ డిజైన్, ఇంజనీరింగ్‌ మెకానిక్స్, స్ట్రెంగ్త్‌ ఆఫ్‌ మెటీరియల్స్, ప్రాపర్టీస్‌ ఆఫ్‌ ప్యూర్‌ సబ్‌స్టాన్సెస్, ఫస్ట్‌ అండ్‌ సెకండ్‌ లా ఆఫ్‌ థర్మోడైనమిక్స్, ఎయిర్‌ స్టాండర్డ్‌ సైకిల్స్‌ ఫర్‌ ఐసీ ఇంజన్స్, ఐసీ ఇంజన్‌ పెర్‌ఫార్మెన్స్, ఐసీ ఇంజన్స్‌ కంబస్టన్, ఐసీ ఇంజన్‌ కూలింగ్‌ అండ్‌ లూబ్రికేషన్, ఫ్లూయిడ్‌ స్టాటిక్స్, ఫ్లూయిడ్‌ ప్రెజర్, ఫ్లూయిడ్‌ కైనమాటిక్స్, డైనమిక్స్‌ ఆఫ్‌ ఫ్లూయిడ్స్, మెజర్‌మెంట్‌ ఆఫ్‌ ఫ్లో రేట్, బేసిక్‌ ప్రిన్సిపుల్స్, హైడ్రాలిక్‌ టర్బైన్స్, సెంట్రిఫ్యుగల్‌ పంప్స్, క్లాసిఫికేషన్‌ ఆఫ్‌ స్టీల్.. తదితర కోర్‌ మెకానికల్‌ అంశాలపై పట్టు సాధించాలి.

సిద్ధాంతాలు, అన్వయ దృక్పథం

ఇంజనీరింగ్‌ పేపర్లలో మెరుగైన స్కోర్‌ కోసం అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లలోని ప్రాథమిక భావనలు,సిద్ధాంతాలు, నియమాలు, ధర్మాలు(ప్రాపర్టీస్) వంటివి చదువుతూనే.. అన్వయ నైపుణ్యం కూడా అలవర్చుకోవాలి. అప్పుడే పరీక్షలో ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఉమ్మడి సబ్జెక్ట్‌లు.. సన్నద్ధత ఇలా

- పేపర్‌-1లో అభ్యర్థులందరూ రాయాల్సిన ఉమ్మడి సబ్జెక్ట్‌లు.. జనరల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ రీజనింగ్, జనరల్‌ అవేర్‌నెస్‌ల కోసం ప్రత్యేకంగా సన్నద్ధత సాగించాలి.
- జనరల్‌ అవేర్‌నెస్‌లో రాణించేందుకు.. చరిత్ర, భారత రాజ్యాంగం, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, కరెంట్‌ అఫైర్స్, స్టాక్‌ జీకే అంశాలను చదవాలి. ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ దశలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- జాగ్రఫీకి సంబంధించి దేశ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, అడవులు, పర్వతాలు, సముద్ర తీర ప్రాంతాలు తదితర అంశాలను తెలుసుకోవాలి.
- రాజ్యాంగానికి సంబంధించి ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు, తాజా సవరణలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- సైన్స్‌ అండ్‌ టెక్నాలజీలో.. తాజాగా దేశ శాస్త్ర, సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, రక్షణ వ్యవస్థ, ఇస్రో తదితర సంస్థల ప్రయోగాల గురించి అధ్యయనం చేయాలి.
- జనరల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ రీజనింగ్‌లో రాణించడానికి.. నంబర్‌ సిరిస్, కోడింగ్‌-డీకోడింగ్, నంబర్‌ అనాలజీ, ఫిగరల్‌ అనాలజీ, వర్డ్‌ బిల్డింగ్, వెన్‌ డయాగ్రమ్స్, స్పేస్‌ విజువలైజేషన్, సిమిలారిటీస్‌ అండ్‌ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్‌ సాల్వింగ్‌ అనాలిసిస్, విజువల్‌ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్‌ వంటి అంశాలపై దృష్టిపెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్‌ 2, 2022
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులో సవరణలకు అవకాశం:** సెప్టెంబర్‌ 4, 2022
- **పేపర్1(కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌)తేదీ:** నవంబర్‌లో
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

కోడి కూస్తోందని కేసు పెట్టారు..



ఊళ్లల్లో ఇరుగుపొరుగు మధ్య కోళ్ల పంచాయితీ కొత్తేం కాదు. కానీ 'పక్కింటివాళ్ల కోడి వేధిస్తోంది, భరించలేకుండా ఉన్నాం బాబోయ్' అంటూ కోర్టుకెక్కారు జర్మనీకి చెందిన వృద్ధ దంపతులు ఫ్రెడ్రిక్, జుటా. కోడిపుంజు తెగ కూస్తూ తమను ఇబ్బందిపెడుతోందని కోర్టుకు విన్నవించుకున్నారు. కోడన్నాక కూయకుండా ఉంటుందా? ఆ మాత్రానికే కేసు పెట్టాలా అతిగా కపోతేను. అంటే.. అది కూస్తుంది పది ఇరవైసార్లు కాదు.. రోజుకు 200 సార్లట. అదికూడా 80 డెసిబెల్స్ రేంజులో. అంటే రద్దీగా ఉన్న ఓ వీధిలో వచ్చే శబ్దం అంత అన్నమాట. ఉదయం 8 గంటలకు మొదలయ్యే ఈ కూతల మోత... సాయంత్రం ఇతర కోళ్లతోపాటు గూట్లోకి చేరేంతవరకూ ఉంటోంది. ఏళ్లుగా కొనసాగుతున్న ఈ గోలను భరించలేక వారు కోడిపై కేసు పెట్టారు. 'వాళ్లు కోడిని వదులుకోలేరు. అది ఉంటే మేం ప్రశాంతంగా నిద్ర కూడా పోలేకపోతున్నాం. తలుపులు, కిటికీలు తీస్తే నాన్‌స్టాప్ చప్పుడు. చివరకు గార్డెన్‌కూ వెళ్లలేకపోతున్నాం. అదో, మేమో తేల్చుకోవాల్సిందే' అని అంటున్నారు. పొద్దున లేస్తే కోడిచేసే నాన్‌స్టాప్ చప్పుడును రికార్డు చేసి కోర్టు ముందుంచారు. అంతేకాదు.. దాని దెబ్బకు చుట్టుపక్కల ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయిన వాళ్ల గురించి కూడా కేసులో ప్రస్తావించారు. కేసు లెమ్గో జిల్లా జడ్జి ముందుకు త్వరలో రానుంది. ఆయన తీర్పుమీదే ఈ కోడి భవిష్యత్ ఆధారపడి ఉందన్నమాట.

హంతకుడెవరో చెప్పండి.. బాబా..



మర్డర్ మిస్టరీని ఛేదించాలంటే.. డాగ్‌స్క్వాడ్ తనిఖీలు, ఫోరెన్సిక్ రిపోర్టులు, విచారణలు ఇలా పోలీసులు మల్లగుల్లాలు పడతారు. కానీ.. చిత్రంలోని పోలీసేమో.. తనకు బాగా నమ్మకమున్న బాబా దగ్గరికి వెళ్లాడు.. ఓ హత్య కేసులోని అనుమానితుల జాబితాను ఆయన చేతిలో పెట్టి... మర్డర్ చేసిందెవరో చెప్పమని కోరాడు. ఈ బాబా కూడా జేమ్స్‌బాండ్ టైపులో లిస్టును ఒకటికి పదిసార్లు పరిశీలనగా చూసేసి.. ఇందులో ఉన్నవారెవరూ కాదు భక్తా.. మరొకడున్నాడు అంటూ కొంచెం బేస్ వాయిస్‌తో బదులిచ్చాడు. ఈ వీడియో కాస్త.. యూట్యూబ్‌లో వైరలయ్యింది. ఇంకేముంది ఉన్నతాధికారులు.. ఆ ఆఫీసర్ ఎవరా అని ఆరా తీశారు. చివరికి మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా బమితా స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ అనిల్ శర్మగా నిర్ధారణ అయ్యింది. వెంటనే.. సదరు ఏఎస్‌ఐని సస్పెండ్ చేశారు. ఇంతకీ ఈ కేసు ఏమిటంటే.. జూలై 28న వొతపూర్వ గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి హత్యకు గురైంది. గ్రామంలోని ముగ్గురిని అనుమానిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు కేసు పెట్టారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో వారిని వదిలిపెట్టారు. చివరికి యువతి మామను అరెస్టు చేశారు. అయితే అతడిని పరిశోధన, సాక్ష్యాల అధారంగానే అరెస్టు చేశామని, బాబా సూచన మేరకు కాదని జిల్లా ఎస్పీ పేర్కొనడం గమనార్హం.

పిగ్ ఫార్మింగ్..



ఈ ఫొటోలో కనిపిస్తున్న బిల్డింగ్‌ను చూశారా? స్టార్ హోటల్‌ను తలపిస్తోంది కదా! ఈ 26 అంతస్తుల ఆధునిక భవనం దేనికోసమో తెలుసా? పిగ్ ఫార్మింగ్ కోసం. ఈ బహుళ అంతస్తుల భవనాన్ని చైనా నిర్మిస్తోంది. పందుల పెంపకం కోసం ఇంత పెద్ద భవనం నిర్మించడం ప్రపంచంలోనే మొట్టమొదటిసారి. చైనాలో ప్రధాన ఆహారమైన పోర్క్ ఉత్పత్తిని పెంచడానికి, తక్కువ స్థలంలో ఎక్కువ ఉత్పత్తిని సాధించడానికి ఇలాంటి భవనాల్లో పందులను పెంచుతున్నారు. ఆఫ్రికాలో స్వైన్‌ఫ్లూ తరువాత... పందుల పెంపకంపై దృష్టిపెట్టిన చైనా, ఇలా బహుళ అంతస్తుల భవనాల్లో ఫార్మింగ్‌కు అనుమతించింది. మొదట రెండు మూడు అంతస్తులతో మొదలైన ఈ ఫార్మింగ్ ఇప్పుడిలా 26 అంతస్తులకు చేరింది. అక్కడి పిగ్స్‌కి యంత్రాలే ఆహారాన్ని సరఫరా చేస్తాయి. గాలి శుద్ధీకరణ, ఇన్ఫెక్షన్స్ సోకకుండా పద్ధతులు, పందుల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్, దాన్నుంచే విద్యుత్ ఉత్పత్తి ఇలా అధునాతన పద్ధతులను అవలంబిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఈ జంట భవనాలు ప్రారంభమైతే నెలకు 54వేల టన్నులు, ఏడాదికి 60 లక్షల టన్నులు పోర్క్ ఉత్పత్తి చేయనుంది. గతంలో యూరప్‌లోనూ ఇలాంటి నిర్మాణాలున్నా.. వివిధ కారణాలతో చాలా మూతపడ్డాయి. ఉన్న ఒకటి అరా మూడంతస్తులకు మించలేదు.

క్లుప్తంగా

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల : అక్టోబర్‌కు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనుంది. అక్టోబర్‌కు సంబంధించి మరికొన్ని ఆర్జిత సేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు మొదలవుతుంది. అక్టోబర్‌కు సంబంధించి వర్చువల్ సేవలైన కళ్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటా, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటా కూడా అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో విడుదలవుతాయి

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమలలో సోమవారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏడు కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,523 మంది స్వామిని దర్శించుకోగా, 37,100 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.65 కోట్లు వేశారు. ఎలాంటి టికెట్ లేకున్నా భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్నారు. దర్శనానికి ఎనిమిది గంటల సమయం పడుతోంది.

ఆర్టీసీ ఉద్యోగుల సంతకాల సేకరణ ఉద్యమం

సాక్షి, అమరావతి : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28 వరకు సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ప్రభుత్వంలో విలీనానికి ముందున్న పెన్షన్ విధానం, ఇతర ప్రయోజనాల సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ ఈ సంతకాలు సేకరించాలని నిర్ణయించినట్టు జేఏసీ కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పి.దామోదరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీకి సోమవారం వినతి పత్రం ఇచ్చామని, సంతకాల సేకరణ ఉద్యమం తర్వాత అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

డీజీపీ పేరుతో ఎస్‌ఐకి టోకరా

రూ.7లక్షలు స్వాహా చేసిన మోసగాడు

యాదమరి(చిత్తూరు) : టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మోసాలు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు మోసగాళ్లు తమ రూటు మారుస్తూ పోలీసులను కూడా ఏమారుస్తున్నారు. ఇటీవల ఒక మోసగాడు ఏకంగా డీజీపీ పేరుతో ఎస్‌ఐని బురిడీ కొట్టించి రూ.7లక్షలు స్వాహా చేయడం చర్చనీయాంశంగా మారింది. చిత్తూరులోని ఓ సెల్‌ఫోన్ షాపులో రెండు వారాల కిందట గుర్తుతెలియని వ్యక్తి సిమ్ కార్డు కొనుగోలు చేశాడు. దానిని తమిళనాడు డీజీపీ పేరుతో నమోదు చేసుకుని తిరునల్వేలిలోని ఓ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐకి కాల్ చేశాడు. తనకు అర్జంట్‌గా నగదు కావాలని, ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దని నమ్మబలికాడు. వచ్చిన ఫోన్ నంబరు డీజీపీ పేరుతో నమోదు అయి ఉండటం, ట్రూ కాలర్‌లో కూడా డీజీపీ పేరు పడుతుండటంతో నిజమేనని నమ్మిన ఎస్‌ఐ రూ.7లక్షలను విడతల వారీగా ఆ ఫోన్ నంబరుతో లింక్ అయిన యూపీఐల ద్వారా పంపించారు. కొద్దికాలం తర్వాత ఎస్‌ఐకి అనుమానం వచ్చి ఆ నంబర్‌కు ఎస్‌ఐ కాల్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని తెలుసుకుని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ద్వారా ఈ సమాచారాన్ని డీజీపీకి తెలియజేయగా అసలు విషయం బయటపడింది. దీనిపై తిరునల్వేలి పోలీసులు విచారణ చేయగా, మోసగాడు వినియోగించిన సిమ్ కార్డు ఆంధ్రా సరిహద్దులో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. యాదమరి మండలానికి చెందిన ఓ వ్యక్తి చిత్తూరులో సెల్‌షాపు నిర్వహిస్తూ ఈ నెల 8న గుర్తుతెలియని వ్యక్తికి సిమ్ కార్డు విక్రయించినట్లు నిర్ధారించారు. అతను ఎలాంటి నిర్ధారణ పత్రాలు తీసుకోకుండానే అధిక డబ్బుకు ఆశపడి ఇతరుల ఆధార్‌తో ఈ సిమ్‌కార్డు విక్రయించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఆ మేరకు చిత్తూరు జిల్లా ఎస్పీ అనుమతితో తమిళనాడు పోలీసులు ఆ సిమ్ కార్డు విక్రయించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



కృష్ణా, గోదావరిలో మరింత తగ్గిన వరద

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: పరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లో) వర్షపాత విరామంతో నదుల్లో వరద ప్రవాహం క్రమేణ తగ్గుతోంది. జూరాల, సుంకేశుల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్న కృష్ణాజలాల ప్రవాహం 1,76,232 క్యూసెక్కులకు తగ్గింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, కల్వకుర్తి, హంద్రీ–నీవా ద్వారా 21,288 క్యూసెక్కులను తరలిస్తున్నారు. ప్రాజెక్టులో 884.4 అడుగుల్లో 211.95 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ, స్పిల్ వే మూడు గేట్లను పదడుగులు ఎత్తి మొత్తం 1,46,469 దిగువకు వదులుతున్నారు. సాగర్‌లోకి 97,724 క్యూసెక్కులు చేరుతుండగా.. కుడి, ఎడమ కాలువలు, ఏఎమ్మార్పీ, వరద కాలువల ద్వారా 20,039 క్యూసెక్కులు తరలిస్తున్నారు. ప్రధాన విద్యుత్‌కేంద్రం, స్పిల్ వే గేట్ల ద్వారా 76,305 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 587.7 అడుగుల్లో 305.92 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టులోకి 85 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇక్కడ 171.14 అడుగుల్లో 38.55 టీఎంసీలను నిల్వచేస్తూ.. స్పిల్ వే గేట్లు, విద్యుత్‌కేంద్రం ద్వారా 58,562 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,10,527 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణాడెల్టాకు 15,037 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మిగిలిన 95,490 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

సాధారణ స్థాయికి గోదావరి

వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఉపనదుల్లో వరద తగ్గి గోదావరిలో ప్రవాహం సాధారణ స్థాయికి చేరుకుంది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 4,89,531 క్యూసెక్కులు చేరుతుండగా, గోదావరి డెల్టాకు 9,467 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 4,80,064 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

స్థిరంగా వంశధార'

వంశధార నదిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. గొట్టా బ్యారేజ్‌లోకి 24,399 క్యూసెక్కులు చేరుతుండగా, వంశధార ఆయకట్టుకు 2,231 క్యూసెక్కులను, 19,636 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. నాగావళి నుంచి తోటపల్లి బ్యారేజ్‌లోకి 8,649 క్యూసెక్కులు చేరుతుండగా, ఆయకట్టుకు 1,520 క్యూసెక్కులను విడుదల చేస్తూ, 1,851 క్యూసెక్కులను వదిలేస్తున్నారు.

ఉద్యోగాల నుంచి సీఐ, కానిస్టేబుల్ తొలగింపు

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో ఎదుర్కొన్న అభియోగాలు నిరూపితం కావడంతో రాజమహేంద్రవరం డీటీసీలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న యు.రామారావు, విజయవాడ సీసీఎస్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉన్న గాలి రవీంద్రబాబును సర్వీసు నుంచి తొలగిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా యు.రామారావు, కానిస్టేబుల్‌గా గాలి రవీంద్రబాబు పనిచేసినప్పుడు వారి మీద వచ్చిన ఆరోపణలపై నిర్వహించిన విచారణలో దోషులని తేలింది. దీంతో వారిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

ఏపీఈఆర్సీని రాష్ట్రానికి మార్చాలి: సీపీఎం

సాక్షి, అమరావతి : హైదరాబాద్‌లో ఉన్న ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మార్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జనవరి నుంచి మార్చి వరకు వినియోగించిన విద్యుత్‌కు ఎఫ్‌పీపీసీఏ ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో సెప్టెంబర్ 7న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులను హైదరాబాద్‌కు రావాలనడం సరికాదన్నారు.

వృద్ధిరేటులో ఏపీ ఫస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఏపీ ఎక్కువ వృద్ధి రేటు సాధించడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను ఎక్కడా నిలిపివేయకుండా కొనసాగించడమే. ఒక పక్క ఆదాయం తగ్గిపోయినప్పటికీ, ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగించింది. ప్రధానంగా వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేయడం, నాడు–నేడు పేరుతో విద్య, వైద్య రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంతో ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. కోవిడ్–19 లాక్‌డౌన్ సమయంలోనూ ఎక్కడా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల కార్యకలాపాలు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతతో చర్యలు చేపట్టింది. ప్రధానంగా ఎంఎస్ఎంఈ కార్యకలాపాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో 2021–22లో పారిశ్రామిక రంగంలో కూడా ఆంధ్రప్రదేశ్ 12.78 శాతంతో రెండంకెల వృద్ధి సాధించింది. ప్రాధాన్యత రంగ కార్యకలాపాలు కొనసాగించడం, ప్రజల చేతుల్లోకి డబ్బులను పంపించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ నిలబడిందని, ఇంత వృద్ధి రేటు సాధించడానికి ఇదే కారణమని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో 2021–22 ఆర్థిక సంవత్సరం స్థిర ధరల ఆధారంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వృద్ధి రేటును ఉంచారు. ఏపీ తరువాత అత్యధిక వృద్ధి రాజస్థాన్ 11.04 శాతం సాధించింది. ఆ తరువాత బిహార్ 10.98 శాతం, తెలంగాణ 10.88 శాతం వృద్ధి సాధించాయి.

ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో మైనింగ్ కేసు మరో ధర్మాసనానికి

బదిలీ చేసిన సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల సరిహద్దుల్లో మైనింగ్ కొనసాగింపునకు సంబంధించిన కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎన్.వి.రమణ మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ సి.టి.రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఏపీ, కర్ణాటకల సరిహద్దు వివాదం పరిష్కారం అయిందని, ఏపీ ప్రభుత్వం మైనింగ్‌కు అనుమతించిందని ఓబుళాపురం మైనింగ్ కంపెనీ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌ను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టు రిజిస్ట్రీని సీజేఐ ఆదేశించారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి చెందిన గనుల్లో మైనింగ్‌ను 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిలిపేసింది. ఈ నిర్ణయంపై ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించగా మైనింగ్ కంపెనీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

భారీ పెట్టుబడులే లక్ష్యం

విశాఖలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు



- వచ్చే ఏడాది జనవరి తర్వాత నిర్వహణ
- పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగాల గుర్తింపు
- బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రస్తుత కంపెనీల ప్రతినిధులు
- వారి అభిప్రాయాలతో కూడిన ఆడియో, వీడియోలతో ప్రచారం
- 12 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీకి పెట్టుబడులపై దృష్టి
- ఫార్మా పరిశ్రమల కోసం 6 వేల ఎకరాలు సిద్ధం
- ఉన్నత విద్య అభివృద్ధికి ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను ఆహ్వానించాలి
- ఉన్నతాధికారులతో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ సమీక్ష

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది విశాఖపట్నంలో నిర్వహించే ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు–2023లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించేలా కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) భాగస్వామ్యంతో భారీస్థాయి పెట్టుబడిదారులతో జనవరి తర్వాత ఈ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సు నిర్వహణపై సోమవారం సచివాలయంలో సీఐఐ ప్రతినిధులు, ముఖ్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఐటీ, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యుత్, పర్యాటక, చేనేత, వస్త్ర పరిశ్రమ, సముద్రయానం తదితర రంగాలతో పాటు పెట్టుబడులకు అవకాశాలున్న అన్ని రంగాల శాఖల అధికారులు సదస్సును విజయవంతం చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న జాతీయ, అంతర్జాతీయ కంపెనీల విస్తరణపై దృష్టి సారించాలన్నారు. సదస్సుకు ప్రత్యేక అంబాసిడర్ అవసరంలేదని, అపాచీ, కియా, హీరో, బ్రాండిక్స్ తదితర కంపెనీల ప్రతినిధులనే పరిశ్రమల ప్రమోటర్లుగా వినియోగించుకోవాలన్నారు. వారి అభిప్రాయాలతో ఆడియో, వీడియోలు రూపొందించి వాటితో విస్తృత ప్రచారం చేయాలన్నారు. సదస్సు లక్ష్యాలు, ప్రయోజనాలు ప్రతిబింబించేలా అనుభవజ్ఞులైన కన్సల్టెంట్ ద్వారా లోగో, థీమ్ రూపొందించాలని ఆదేశించారు.

ఈ రంగాలే కీలకం

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఇప్పటికే గుర్తించిన 32 వేల మెగావాట్ల సామర్థ్యంలో 20 వేల మెగావాట్లకు దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో ఎంవోయూలు చేసుకున్నట్లు చెప్పారు. మిగిలిన 12 వేల మెగావాట్లకు ఈ సదస్సులో పెట్టుబడులు తేవాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు సూచించారు. ఫార్మా పరిశ్రమలకు నక్కపల్లి, రాంబిల్లి ప్రాంతాల్లో దాదాపు 6 వేల ఎకరాలు భూమి అందుబాటులో ఉందని, ఈ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబుకు సూచించారు. ఉన్నత విద్య అభివృద్ధికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విద్యా సంస్థలను ఆహ్వానించాలని ఉన్నత విద్యా శాఖ చైర్మన్ హేమచంద్రా రెడ్డిని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, వస్త్ర పరిశ్రమలు, సముద్ర రవాణా, వాణిజ్య రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. తొలుత సీఐఐ ప్రతినిధి నీరజ్ జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సదస్సు ప్రయోజనాలు, లక్ష్యాలు, ఫలితాల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాత్మక విధానాలు, విస్తృత ప్రచారం తదితర అంశాలను వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్, సంచాలకులు జి.సృజన, ఐటీ కార్యదర్శి సౌరబ్ గౌర్, రాష్ట్ర చేనేత, వస్త్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తున్నాం.. పెట్టుబడులు పెట్టండి

ముంబైలో జరిగిన వర్క్‌షాప్‌లో ఏపీఐఐసీ వీసీ, ఎండీ సుబ్రహ్మణ్యం

- రాష్ట్రంలోని పారిశ్రామిక కారిడార్లలో రూ.11,753 కోట్లతో పనులు
- రూ.20,577 కోట్లతో 3 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం



సాక్షి, అమరావతి: పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మూడు పారిశ్రామిక కారిడార్లు వెళుతున్నాయని, వీటిలో రూ. 11,753 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ, ఎండీ సుబ్రహ్మణ్యం జవ్వాది తెలిపారు. ముంబైలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవుట్ రీచ్ వర్క్‌షాపులో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను సుబ్రహ్మణ్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మౌలిక వసతుల కల్పన ద్వారా పెట్టుబడులు ఆకర్షించాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిలాష అని చెప్పారు. అందులో భాగంగా మూడు కారిడార్లలో ఎనిమిదికి పైగా పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రూ.20,577 కోట్లతో రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో భోగాపురం, దగదర్తిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలు, నాలుగు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ భారీ మౌలిక ప్రాజెక్టుల అవకాశాలను పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు వినియోగించుకోవాలని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని సుబ్రహ్మణ్యం కోరారు.

అరటి లీడర్.. ఆంధ్రప్రదేశ్

- రికార్డు స్థాయిలో ఎగుమతులు
- లీడర్ షిప్ అవార్డు అందుకున్న స్పెషల్ సీఎస్ పూనం



అవార్డు అందుకుంటున్న పూనం మాలకొండయ్య

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. అరటి ఎగుమతుల్లో మేటిగా నిలిచిన ఏపీని లీడర్‌షిప్ అవార్డు వరించింది. నాణ్యమైన అరటి దిగుబడులను సాధించేందుకు రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా గ్రామస్థాయిలో చేపడుతున్న విస్తరణ కార్యక్రమాలు, ఎగుమతులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వ కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. అరటి సాగు విస్తీర్ణంలో మూడోస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్... ఎగుమతుల్లో మాత్రం మొదటి స్థానంలో నిలిచింది. గత మూడేళ్లలో లక్ష టన్నుల ఎగుమతులు జరిగితే 2021లోనే అత్యధికంగా 43 వేల టన్నుల అరటి ఎగుమతి అయింది. పులివెందుల, అనంతపురం క్లస్టర్లు అరటి ఎగుమతులకు హబ్‌గా నిలిచాయి. దేశంలో మరెక్కడాలేని విధంగా ముంబై పోర్టుకు అరటి కోసం ప్రత్యేకంగా కిసాన్ రైళ్లను నడిపిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వాల్యూచైన్ ప్రాజెక్టు వల్ల హెక్టార్‌కు 24 టన్నుల వరకు దిగుబడితో పాటు టన్నుకు రూ.12 వేల వరకు ఆదాయం పెరిగింది. అరటి ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం అనంతపురం, పులివెందుల ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజ్‌లు, ప్యాక్‌హౌస్‌లు నిర్మిస్తోంది. ఈ ఏడాది 75 వేల టన్నుల ఎగుమతులు లక్ష్యంగా రూ.269.95 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు చేపట్టింది. గతేడాది వరకు మిడిల్ ఈస్ట్ దేశాలకు ఎగుమతి అవుతున్న అరటిని ఈ ఏడాది యూరోపియన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.

జాతీయ స్థాయి కమిటీ గుర్తింపు

విషపూరిత రసాయన అవశేషాల్లేకుండా నాణ్యమైన అరటి దిగుబడులు సాధించడం, ఎగుమతులను ప్రోత్సహించడం లక్ష్యంగా గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా వినూత్న విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను లీడర్‌షిప్ అవార్డు వరించింది. జాతీయ స్థాయిలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ ఏపీని ది బెస్ట్ స్టేట్‌గా ప్రకటించింది. తిరుచురాపల్లిలోని శనివారం జరిగిన వేడుకల్లో జాతీయ అరటి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఉమాదేవి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (బెంగుళూరు) డైరెక్టర్ డాక్టర్ దేవీశర్మ నుంచి ఏపీ వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య ఈ అవార్డు అందుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు నాణ్యమైన అరటి దిగుబడులతోపాటు రికార్డుస్థాయి ఎగుమతులను సాధిస్తున్న ఏపీకి ఇదొక అరుదైన గౌరవమని స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య 'సాక్షి'కి తెలిపారు.



మరి చంద్రబాబు మంత్రి పదవి ఎందుకు ఇవ్వనట్టు?

- ఎర్రబెల్లికి లక్ష్మీపార్వతి ప్రశ్న
- ఆయన భార్య కూడా మిమ్మల్ని వడ్డాణం అడిగారా..
- నేను వడ్డాణం అడిగానని మీ బిడ్డలపై ప్రమాణం చేస్తావా..?

సాక్షి, అమరావతి : అప్పట్లో నాకు వడ్డాణం ఇవ్వనందుకే తనకు మంత్రి పదవి రాలేదని 27 ఏళ్ల తర్వాత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించడం విడ్డూరంగా ఉందని తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. 'వైస్రాయ్ సంఘటనలో ప్రధాన పాత్ర పోషించిన నీకు చంద్రబాబు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు' అని ఎర్రబెల్లిని ఆమె నిలదీశారు. 'చంద్రబాబు భార్య కూడా వజ్రాలు, వైఢూర్యాలు, వడ్డాణాలు అడిగారా? అందుకనే మంత్రి పదవి రాలేదా? అబద్ధాలు చెప్పడానికి సిగ్గుగా లేదా' అని ఎర్రబెల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వాసఘాతకులు, ఎన్టీఆర్ హంతకులంతా మళ్లీ కలుస్తున్నారని.. తెలంగాణ సీఎం కేసీఆర్ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ అధికారంలోకొచ్చిన 8 నెలల్లోనే.. తనను బూచిగా చూపి.. చంద్రబాబును సీఎంను చేసేందుకు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ నిర్వహించిన పాత్రను ఆడియోలు, వీడియోలు ద్వారా ఎన్టీఆర్ అప్పట్లోనే లోకానికి తెలియజేశారని గుర్తుచేశారు. అప్పట్లో ఓ హోటల్లో జర్నలిస్టులకు డబ్బులు పంపిణీ చేసి.. ఎన్టీఆర్‌కు, నాకు వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా వార్తలు రాయించిన బ్రోకర్ రాధాకృష్ణ అని ధ్వజమెత్తారు. 'ఆదివారం ఏబీఎన్‌లో ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే కార్యక్రమంలో తెలంగాణ మంత్రి, ఇప్పటికీ టీడీపీ పురిటి కంపును వదల్చుకోని ఎర్రబెల్లి దయాకర్‌రావు నాపై చేసిన వ్యాఖ్యలు చూశాక ఈ ప్రకటన చేస్తున్నా.. ఎర్రబెల్లి దయాకర్‌రావు మనిషైతే గుడిలో దేవుడి ముందు తన బిడ్డలు, మనవలపై ప్రమాణం చేసి.. నేను అతడిని వడ్డాణం అడిగానని చెప్పగలరా' అని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. ఎన్టీఆర్ ఏ నమ్మకంతో తనను వివాహం చేసుకున్నారో.. చివరి వరకూ ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ వచ్చానని తెలిపారు. ఎన్టీఆర్ ఇచ్చిన ఆస్తిని కూడా నిలబెట్టుకోలేక.. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న తనను సీఎం వైఎస్ జగన్ ఓ బిడ్డలా ఆదుకుని నిలబెట్టారని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.